శిథిలాల కిందే అతడి ఆశలు గల్లంతు



2

# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..
గుంటూరు-మంగళవారం 30 జూన్ 2026 | సంపుటి: 10 | సంచిక: 176 | పేజీలు: 8+4 | వెల రూ.5

24 గంటల్లో 3 శిఖరాలు ఎక్కిన యువరాణి



2


GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA | HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM





## ప్రభుత్వ సేవలు మరింత

# సులభతరం



## మనమిత్ర ద్వారా ఫిర్యాదుల స్వీకరణ

### జిల్లాల్లో క్షేత్రస్థాయి పర్యటనకు సర్క్యులర్ జారీ చేసినట్లు తెలిపిన అధికారులు

### ఆర్టీజీఎస్ సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు

■ పి.మీరాహుస్సే ఖాన్

**అమరావతి, (మనం ప్రత్యేక ప్రతినిధి):** ప్రభుత్వ సేవలు ప్రజలకు సులభంగా అందించేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. సోమవారం రాష్ట్ర సచివాలయంలోని ఆర్టీజీఎస్ సెంటర్ నుంచి వివిధ శాఖల పనితీరుపై సీఎం సమీక్షించారు. ఈ మేరకు ప్రభుత్వ సేవలను ప్రజలకు అందించే అంశంపై అధికారులకు ముఖ్యమంత్రి దిశా నిర్దేశం చేశారు. ప్రజలతో నిత్యం సంబంధాలున్న శాఖలు, విభాగాల్లో ప్రభుత్వ సేవలు పొందడం సులభతరం చేయాలని

...మిగతా 2లో

## క్షేత్రస్థాయి నాయకత్వాన్ని బలోపేతం చేయడమే జనసేన లక్ష్యం



### మంత్రి కందుల దుర్గేష్

**విజయవాడ, జూన్ 29 (మనం ప్రత్యేక ప్రతినిధి):** జనసేన పార్టీ క్షేత్రస్థాయి నాయకత్వాన్ని బలోపేతం చేసే లక్ష్యంతో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి మరియు విజయవాడ పార్లమెంట్ జనసేన పార్టీ పరిశీలకులు కందుల దుర్గేష్ నేతృత్వంలోని 28 మంది సభ్యుల బృందం విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో పార్టీ నిర్మాణ సారథుల సమాచార సేకరణ మరియు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ

...మిగతా 2లో

## జనసేనాని పవన్ కళ్యాణ్ అన్ని వర్గాల నాయకుడు

ఆయనపై కులముద్ర వేయవద్దు
రాజకీయ విశ్లేషకులు తెలకపల్లి రవి ఏకపక్ష వైఖరిపై మంత్రి కందుల దుర్గేష్ తీవ్ర ఆగ్రహం

2

## అమరావతి ఫ్రైడ్ ఫర్ ఏపీ-ఫ్రైడ్ ఫర్ ఇండియా

ప్రతిష్టాత్మక ప్రాజెక్టులో భాగమైనందుకు గర్వించండి

నిర్దేశిత గడువులోగా రాజధాని నిర్మాణాలు పూర్తి కావాలి

రాజధాని పనులపై ప్రతీ 2 నెలలకు ఒకసారి సమీక్ష

అమరావతి నిర్మాణ కాంట్రాక్టు సంస్థలతో సీఎం చంద్రబాబు

**అమరావతి, జూన్ 29(మనం న్యూస్):** యావత్ దేశం గర్వించే రాజధాని నగరంగా అమరావతిని నిర్మిస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. హైదరాబాద్ ప్లస్గా అమరావతి నిర్మాణం జరగాలని అన్నారు. ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ నగర నిర్మాణంలో కాంట్రాక్టు సంస్థలు కూడా భాగస్వాములు కావాలని సీఎం పిలుపునిచ్చారు. రాజధాని నిర్మాణ పనుల్లో మరింత వేగం పెంచాలని సీఎం ఆదేశాలు జారీ చేశారు. అమరావతిలో నిర్మాణ పనుల పురోగతిపై సచివాలయంలో కాంట్రాక్టు సంస్థలతో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. నిర్దేశిత గడువు కంటే ముందే నిర్మాణ పనులు పూర్తి చేయాలని సూచనలు ఇచ్చారు. ప్రస్తుతం రూ.50,999 కోట్ల విలువైన

...మిగతా 2లో

## జూలై 1న నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో సీఎం చంద్రబాబు పర్యటన

- సత్యవేడులో హీరో మోటార్స్ జీపీసీకి శంకుస్థాపన చేయనున్న ముఖ్యమంత్రి
- చిల్లకూరులో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ చేయనున్న సీఎం

**అమరావతి, జూన్ 29,(మనం ప్రతినిధి):** ప్రముఖ ద్విచక్ర వాహన తయారీ సంస్థ హీరో మోటార్స్ గ్లోబల్

...మిగతా 2లో



## రైతుకు భరోసా.. వ్యవసాయానికి

# పునర్ వైభవం

### విత్తన కంపెనీల బకాయిలు చెల్లించి సరఫరా వ్యవస్థను గాడిలో పెట్టాం

రాష్ట్రంలో ఎక్కడా ఎరువుల కొరత లేదు, ప్రత్యేక యాప్తో ఎరువుల పంపిణీ: మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

**అమరావతి/గుంటూరు, జూన్ 29,(మనం ప్రతినిధి):** రైతు సంతోషంగా ఉంటేనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని, రైతుకు భరోసా కల్పించి, వ్యవసాయ రంగానికి పునర్వైభవం తీసుకురావడమే ఎన్డీఏ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. సోమవారం గుంటూరులో లాంఫాం నందు గల ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఏరువాక పౌర్ణమి కార్యక్రమాన్నిపొలంలో ఎద్దుల అరక దున్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ వ్యవసాయానికి తొలి పండుగ అయిన ఏరువాకను గుంటూరులో నిర్వహించడానికి ప్రత్యేక కారణం ఉందని, రైతాంగానికి గుంటూరు జిల్లాతో అవినాభావ సంబంధం ఉన్నందున ఈ కార్యక్రమాన్ని ఇక్కడ నిర్వహించామని తెలిపారు. రాష్ట్ర జనాభాలో దాదాపు 66 శాతం మంది వ్యవసాయం,

...మిగతా 5లో

## జస్టిస్ రఘునందన్ రావు సేవలు చిరస్మరణీయం

### రాష్ట్ర ఉన్నత న్యాయ స్థానం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లిసా గిల్






**అమరావతి, జూన్ 29 (మనం ప్రతినిధి):** రాజ్యాంగ విలువలు, న్యాయపాలన పరిరక్షణలో జస్టిస్ రఘునందన్ రావు సేవలు చిరస్మరణీయం అని రాష్ట్ర ఉన్నత న్యాయ స్థానం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లిసా గిల్ అభినందించారు.హైకోర్టు న్యాయమూర్తిగా సేవలు అందిస్తున్న జస్టిస్ రఘునందన్ రావు పదవీ విరమణ సందర్భంగా సోమవారం హైకోర్టు మొదటి కోర్టు హాల్లో ఘనంగా వీడ్కోలు

...మిగతా 2లో

## ఉద్యోగుల ఫ్రెండ్లీగా కూటమి ప్రభుత్వం


### సీఎం చంద్రబాబును కలిసిన వివిధ ఉద్యోగ సంఘాల నేతలు



**అమరావతి, జూన్ 29,(మనం ప్రత్యేక ప్రతినిధి):** ఉద్యోగులకు మేలు చేసేలా ఇటీవల కెబినెట్ తీసుకున్న నిర్ణయాలపై ఉద్యోగుల్లో హర్షం వ్యక్తం అవుతోంది. 2004 సెప్టెంబర్ ముందు వివిధ నోటిఫికేషన్ల ద్వారా నియమితులైన ఉద్యోగులకు ఓల్ పెన్షన్ స్కీం వర్తింపచేయడం, ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా కార్పొరేషన్లకు చెందిన సంస్థలు, గురుకులాలకు చెందిన ఉద్యోగులకు పదవి విరమణ వయస్సును 62 ఏళ్లకు పెంచడం వంటి నిర్ణయాలు తీసుకుంది. గత కెబినెట్లో ఈ నిర్ణయాలు తీసుకున్నప్పటి నుంచి ఉద్యోగ సంఘాల ప్రతినిధులు సీఎం చంద్రబాబును కలుస్తూనే ఉన్నారు. ఈ మేరకు సోమవారం రాష్ట్ర సచివాలయంలో వివిధ ఉద్యోగ సంఘాలకు చెందిన ప్రతినిధులు

...మిగతా 2లో

## ఏపీ స్టార్ హోటల్స్ అసోసియేషన్ నాయకులు సీఎంకు 50లక్షల చెక్కు అందజేత



**అమరావతి, మనం న్యూస్:** ఆంధ్రప్రదేశ్ స్టార్ హోటల్స్ అసోసియేషన్ సభ్యులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ని సచివాలయంలో కలిసి అన్న క్యాంటీన్కు విరాళం అందించారు. తమ అసోసియేషన్ తరపున రూ.50 లక్షల చెక్కును సీఎంకు అందజేశారు. ఈ సందర్భంగా వారిని సీఎం అభినందించారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో ఏపీ స్టార్ హోటల్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్, హయత్ ప్లేస్ ఛైర్మన్ ఆర్.వీ స్వామి, వైస్ ప్రెసిడెంట్ పవన్ కార్తీక్, సెక్రటరీ సీ.మూర్తి, తాజ్ వివాంత ఛైర్మన్ మలినేని రాజయ్య, మురళీ ఫార్చ్యూన్ హోటల్ ఛైర్మన్ ముత్తవరపు మురళీ, జీఆర్టీ హోటల్స్ అధినేత వి.శరణ్ ఉన్నారు.

## పవిత్ర హజ్ యాత్ర పూర్తి చేసుకుని బెంగళూరు చేరుకున్న ఏపీ హాజీలు

- స్వాగతం పలికిన
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ షేక్ హసన్ భాషా



**విజయవాడ, జూన్ 29 (మనం న్యూస్):** పవిత్ర హజ్ యాత్రను విజయవంతంగా పూర్తి చేసుకుని సౌదీ అరేబియా నుంచి తిరిగి వచ్చిన ఆంధ్రప్రదేశ్కు చెందిన హాజీలు సోమవారం బెంగళూరు అంతర్జాతీయ విమానాశ్రయానికి సురక్షితంగా చేరుకున్నారు.శ్రీ సత్యసాయి, అనంతపురం, అన్నమయ్య, తిరుపతి, మదనపల్లె,

...మిగతా 2లో



## కేసులకు భయపడేది లేదు

అమరావతిపై తగ్గేది లేదు • దేవినేని అవినాశ్ ప్రకటన


**విజయవాడ,జూన్29 మనం ప్రత్యేక ప్రతినిధి:** అక్రమ కేసులకు భయపడి అమరావతి రైతుల పక్షాన వైయస్సార్సీపీ చేస్తున్న పోరాటంలో వెనుకంజ

...మిగతా 5లో

## ఎస్ఐఆర్లో అప్రమత్తంగా ఉండాలి

### పార్టీ ఓటు ఒక్కటి కూడా తొలగిపోనివ్వొద్దు

### సజ్జల రామకృష్ణారెడ్డి



**తాడేపల్లి, జూన్29, మనం న్యూస్:** ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియలో వైఎస్సార్సీపీ ఓటర్ల పేర్లను లక్ష్యంగా చేసుకుని తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నాయనే ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో పార్టీ నాయకులు, బీఎల్ఏలు, కార్యకర్తలు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని వైఎస్సార్సీపీ స్టేట్ కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా పార్టీ అధ్యక్షులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్లో ఆయన ఎస్ఐఆర్ ప్రక్రియపై చేపట్టాల్సిన కార్యాచరణపై దిశానిర్దేశం చేశారు. ఎస్ఐఆర్లో అనేక

...మిగతా 2లో

## 'తీస్తా' ప్రాజెక్టులో బంగ్లాకు సహకరిస్తాం: చైనా



**బీజింగ్, జూన్ 29:** 'తీస్తా నది సమగ్ర నిర్వహణ, పునరుద్ధరణ ప్రాజెక్టు'కు సంబంధించి భారత్ నుంచి ఆందోళనలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో చైనా స్పందించింది. బంగ్లాకు తన సహకారాన్ని అందిస్తామని పునరుద్ఘాటించింది. ఈ విషయంలో మూడో పక్షం ప్రభావం తమపై ఉండదని చైనా విదేశాంగశాఖ అధికార ప్రతినిధి గువో జియాకున్ తెలిపారు. 'తీస్తా'ను బంగ్లాదేశ్కు జీవనోపాధి ప్రాజెక్టుగా పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టుకు మద్దతుగా తన వంతు

...మిగతా 2లో

## అమెరికా-ఇరాన్ ఉద్రిక్తతలు

### ట్రంప్ కీలక ప్రకటన



**వాషింగ్టన్, జూన్ 29:** అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మరోసారి పెరుగుతున్న తరుణంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన చేశారు. తాజా అంశాలపై చర్చించేందుకు రావాలని ఇరాన్ కోరిందన్నారు. టెహ్రాన్ అభ్యర్థన మేరకు ఖతార్ రాజధాని దోహా వేదిగా మంగళవారం సమావేశం ఉంటుందని

...మిగతా 2లో

# శిథిలాల కిందే అతడి ఆశలు గల్లంతు

- **భూకంపంలో కుటుంబాన్ని కోల్పోయిన అర్జెంటీనా ఫుట్‌బాలర్**



**కారకస్, జూన్ 29:** వెనెజువెలాలో ఇటీవల సంభవించిన జంట భూకంపాలు ఎన్నో కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపాయి. ఈ విపత్తులో అర్జెంటీనా ఫుట్‌బాలర్ లుకాస్ ట్రెజో తన కుటుంబాన్ని కోల్పోయారు. భవనం కూలిపోవడంతో భార్య, ఇద్దరు పిల్లలు శిథిలాల కింద నలిగిపోయారు. వారి మరణాన్ని ఫుట్‌బాల్ క్లబ్ 'డిపోర్టివో లా గువేరా' ధ్రువీకరించింది.

ఈ భూకంపం ధాటికి వెనెజువెలాలోని యారకూ ప్రాంతం అతలాకుతలమైంది. అక్కడ పలు భవనాలు నేలమట్టమయ్యాయి. లుకాస్ కుటుంబం ఉన్న భవనం కూడా కూలడంతో అతడి భార్య యానినా మారనెల్లా, ఇద్దరు పిల్లలు గల్లంతయ్యారు. వారిని గుర్తించేందుకు ముమ్మరంగా సహాయక చర్యలు చేపట్టినా ఫలితం లేకపోయింది. ఆ ముగ్గురు శిథిలాల కింద ప్రాణాలు విడిచారు. అప్పుడు ఫుట్‌బాలర్ తన టీమ్‌తో వేరే ప్రాంతంలో ఉండటంతో ప్రాణాలతో బయటపడ్డాడు. భూకంపం తర్వాత తన భార్య, పిల్లలు గల్లంతయ్యారన్న వార్త వినగానే షాక్కు గురైన లుకాస్.. అక్కడకు చేరుకొని తన కుటుంబం కోసం శిథిలాలను తొలగిస్తూ వెతకడం ప్రారంభించాడు. వారిని ఎలాగైనా ప్రాణాలతో గుర్తించాలని అతడు చేసిన ప్రయత్నం తోటివారిని కంటతడి పెట్టించింది.

ఇదిలా ఉండగా.. భూకంపం ధాటికి అతలాకుతలమైన వెనెజువెలాకు బ్రెజిల్ స్టార్ ఫుట్‌బాలర్ నెయ్మర్ ఆపన్న హస్తం అందించాడు. 2,50,000 డాలర్లు (భారత కరెన్సీలో దాదాపు రూ.2.35 కోట్లు) విరాళంగా ప్రకటించాడు. ప్రభావిత ప్రాంతాల ప్రజలకు ఆహారం, తాగునీరు, వైద్యసహాయం అందించేందుకు ఈ నిధులను ఉపయోగించనున్నారు.

# 24 గంటల్లో మూడు శిఖరాలు ఎక్కిన బ్రిటన్ యువరాణి



**లండన్, జూన్ 29:** బ్రిటన్ యువరాజు విలియమ్ సతీమణి, ప్రిన్సెస్ ఆఫ్ వేల్స్ కేట్ మిడిల్టన్ సరికొత్త ఘనత సాధించారు. కేవలం 24 గంటల్లోనే మూడు శిఖరాలను అధిరోహించారు. ఏడాది క్రితమే క్యాన్సర్ నుంచి కోలుకున్న ఆమె .. ఓ ఛారిటీ కోసం ఈ శిఖరాలను ఎక్కారు. ఈ విషయాన్ని రాజకుటుంబానికి చెందిన సోషల్ మీడియా ఖాతాలో ఆమె పంచుకున్నారు.'నేషనల్ త్రీ పీక్స్ ఛాలెంజ్'లో భాగంగా కేట్ మిడిల్టన్ ఈ శిఖరాలను అధిరోహించారు. 24 గంటల వ్యవధిలో స్కాట్లాండ్‌లోని బెన్ నెవిస్, ఇంగ్లాండ్‌లోని స్కాఫెల్ పీక్, వేల్స్‌లోని స్నోడౌన్ శిఖరాలను ఎక్కారు. మొత్తం 37 కిలోమీటర్ల ట్రెక్కింగ్ చేసి ఆమె ఈ ఛాలెంజ్‌ను పూర్తి చేశారు. ''క్యాన్సర్ కేవలం శరీరంపై మాత్రమే ప్రభావం చూపించదు. మన ఆలోచనా విధానాన్ని మార్చేస్తుంది. ఇది నేను వ్యక్తిగతంగా తెలుసుకున్నా. క్యాన్సర్ నుంచి బయటపడాలంటే కేవలం మందులొక్కటే సరిపోవని అర్థం చేసుకున్నా. అందుకే ఈ ఛాలెంజ్‌ను స్వీకరించా. ఆ మహమ్మారి నుంచి బయటపడిన తర్వాత జీవితం ఎలా ఉంటుందనేది తెలుసుకునేందుకే ప్రయత్నించా'' అని కేట్ ఈ పోస్ట్‌లో రాసుకొచ్చారు.

''క్యాన్సర్ మహమ్మారిపై ప్రజల్లో అవగాహన కల్పించాలనే ఉద్దేశంతోనే ఈ ఛాలెంజ్‌లో పాల్గొన్నా. ఈ వ్యాధి నుంచి కోలుకోవడం అంటే కేవలం ఆరోగ్యంగా మారడం మాత్రమే కాదు.. జీవితం ఎంత సమతుల్యంగా ఉండాలో అర్థం చేసుకోవడం కూడా..! ప్రయత్నం, అంగీకారం, నమ్మకం, ఆలోచన ఉంటేనే దీన్నుంచి బయటపడగటం. చివరగా.. మనం జీవితంలో ముందుకెళ్లాలంటే ధైర్యం ఒక్కటే సరిపోదు. మనం ప్రయాణిస్తున్న మార్గంలో ఎన్ని అడ్డంకులు ఎదురైనా వాస్తవ పరిస్థితులను అర్థం చేసుకుని నిలకడగా ఉంటేనే సాధ్యమవుతుంది'' అని తెలిపారు.

తాను క్యాన్సర్ బారిన పడినట్లు 2024 మార్చిలో కేట్ ప్రకటించిన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి ప్రజా జీవితానికి దూరంగా ఉన్న ఆమె.. ఆసుపత్రిలో పలు దశల వారీగా కీమోథెరపీ చేయించుకున్నారు. ఈ మహమ్మారి నుంచి తాను పూర్తిగా బయటపడినట్లు గతేడాది జనవరిలో వెల్లడించారు. అప్పటి నుంచి క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

# పవిత్ర హజ్ యాత్ర పూర్తి చేసుకుని బెంగళూరు చేరుకున్న ఏపీ హాజీలు

(మొదటి పేజీ తరువాయి)

పలమనేరు ప్రాంతాలకు చెందిన హాజీల రాక సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ షేక్ హసన్ భాషా వారికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.హాజీలు పవిత్ర హజ్ యాత్రను క్షేమంగా పూర్తి చేసి స్వదేశానికి చేరుకోవడం సంతోషకరమైన విషయమని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా హాజీలందరికీ అల్లాహ్ మంచి ఆరోగ్యం, సుఖశాంతులు, ఆయురారోగ్యాలను ప్రసాదించాలని ప్రార్థించారు.

అలాగే హజ్ యాత్ర విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించిన భారత ప్రభుత్వం, సౌదీ అరేబియా ప్రభుత్వం, భారత హజ్ మిషన్ అధికారులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హజ్ కమిటీ అధికారులు, సంబంధిత సిబ్బందికి షేక్ హసన్ భాషా కృతజ్ఞతలు తెలిపారు.

# జస్టిస్ రఘునందన్ రావు సేవలు చిరస్మరణీయం

(మొదటి పేజీ తరువాయి)

కార్యక్రమం జరిగింది. ఈ వీడ్కోలు కార్యక్రమంలో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లిసా గిల్ మాట్లాడుతూ జస్టిస్ రఘునందన్ రావు న్యాయ ప్రస్థానం, న్యాయపరమైన నిష్పాక్షికత, రాజ్యాంగ విలువల పట్ల అచంచల నిబద్ధత, న్యాయవ్యవస్థ ఆధునీకరణలో ఆయన చేసిన విశిష్ట కృషిని కొనియాడారు.న్యాయవాదిగా విశేష అనుభవాన్ని సంపాదించిన తదుపరి న్యాయమూర్తిగా ధర్మాసనాన్ని అలంకరించి రాజ్యాంగ స్ఫూర్తిని, న్యాయపాలనను అత్యున్నత ప్రమాణాలతో పరిరక్షించారని ఆమె పేర్కొన్నారు.రాజ్యాంగపరమైన అంశాలు, సంక్లిష్టమైన సివిల్ వివాదాలు, పన్నుల సంబంధిత కేసులు, ప్రజాప్రయోజన వ్యాజ్యాలు వంటి అనేక కీలక అంశాల్లో ఆయన వెలువరించిన తీర్పులు న్యాయవ్యవస్థకు మార్గదర్శకంగా నిలుస్తాయని జస్టిస్ లిసా గిల్ పేర్కొన్నారు.తన పదవీకాలంలో సుమారు 25 వేల కేసులను వేగవంతంగా, సమర్థవంతంగా పరిష్కరించడం ద్వారా జస్టిస్ రఘునందన్ రావు న్యాయవ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేశారని ఆమె పేర్కొన్నారు.న్యాయపరమైన బాధ్యతలతో పాటు పరిపాలనా వ్యవహారాల్లోనూ ఆయన అసాధారణ నాయకత్వాన్ని ప్రదర్శించారని, న్యాయస్థానాల మౌలిక సదుపాయాల అభివృద్ధి, సమాచార సాంకేతికత వినియోగం, న్యాయ ప్రక్రియల డిజిటలైజేషన్, న్యాయసేవలను ప్రజలకు మరింత చేరువ చేయడంలో ఆయన చేసిన సేవలు చిరస్మర ణీయమని కొనియాడారు.పరిపాలనా కమిటీ, మౌలిక సదుపాయాల అభివృద్ధి కమిటీ, నియామకాలు, బదిలీలు, న్యాయస్థానాల కంప్యూటరీకరణ,ఆర్థిక వ్యవహారాలు, హైకోర్టు పరిపాలన తదితర కీలక కమిటీలలో ఆయన పోషించిన పాత్ర ఆంధ్రప్రదేశ్ న్యాయవ్యవస్థ అభివృద్ధికి బలమైన పునాదులు వేసిందని ప్రధాన న్యాయమూర్తి పేర్కొన్నారు.

**ప్రజల హక్కుల పరిరక్షణే న్యాయస్థానాల అత్యున్నత ధర్మం-జస్టిస్ రఘునందన్ రావు**

వీడ్కోలు సందర్భంగా జస్టిస్ రఘునందన్ రావు మాట్లాడుతూ న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరిస్తూ చేసిన రాజ్యాంగ ప్రమాణాన్ని తన పదవీకాలమంతా నిబద్ధతతో పాటించేందుకు కృషి చేశానని తెలిపారు.న్యాయమూర్తిగా పని చేసిన ఈ ఆరున్నర సంవత్సరాలు తన జీవితంలో అత్యంత విలువైన అనుభవాలను అందించాయని పేర్కొన్నారు. న్యాయస్థానమే తమకు మొదటి చివరి ఆశ్రయంగా భావించే సాధారణ ప్రజల బాధలు, వారి న్యాయపోరాటాన్ని దగ్గరగా అర్థం చేసుకునే అవకాశం తనకు లభించిందన్నారు.

# ఉద్యోగుల ఫ్రెండ్లీగా కూటమి ప్రభుత్వం

(మొదటి పేజీ తరువాయి)

మాజీ ఎమ్మెల్సీ రామకృష్ణ నేతృత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి ధన్యవాదాలు తెలిపారు. ప్రభుత్వం చేసిన మేలును మరువలేమని ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి ఉద్యోగ సంఘాల నేతలు తెలిపారు. కూటమి ఉద్యోగుల ఫ్రెండ్లీ ప్రభుత్వంగా ఉంటోందన్నారు. తాము ఉద్యోగులకు సహకరించినట్టే... ఉద్యోగులు కూడా ప్రభుత్వానికి సహకరించాలని ముఖ్యమంత్రి సూచించారు. ఏపీఆర్ఈఐ సొసైటీతో పాటు.. వివిధ సంక్షేమ శాఖల పరిధిలోని రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ సంస్థల సొసైటీలు, డీఎస్సీ 2003 టీచర్ల ఫోరంనకు చెందిన ప్రతినిధులు సీఎం చంద్రబాబును కలిశారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో గురుకులాల జేఏసీ నాయకులు దామచర్ల మధుసూదన రావు, ప్రభాకర్, రామ్మోహన్ రావు, రమేష్, డీఎస్సీ 2003 ఫోరం ప్రతినిధులు మోపిదేవి శివ శంకర్రావు, గురు బ్రహ్మం, రాజేష్ ఉన్నారు.

# నవంబర్ 12,13 తేదీల్లో విశాఖలో ప్రతిష్టాత్మకంగా భాగస్వామ్య సదస్సు

- **విశాఖ సదస్సు కంటే ముందుగా 5 చోట్ల ప్రాంతీయ భాగస్వామ్య సదస్సులు**
- **కొత్త ఆలోచనలకు... అవకాశాలకు సీఐఐ సదస్సు వేదిక కావాలి**
- **ఎంఓయూలు, పెట్టుబడులతోపాటు నాలెడ్జ్ షేరింగ్ మీద ఎక్కువ దృష్టి**
- **సీఐఐ భాగస్వామ్య సదస్సు-2026 సన్నాహక సమావేశంలో సీఎం చంద్రబాబు**

■ పి.మీరాహుస్సే ఖాన్

**అమరావతి, (మనం ప్రత్యేక ప్రతినిధి):** విశాఖ భాగస్వామ్య సదస్సు గతానికి భిన్నంగా నిర్వహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. ఈసారి ప్రాంతీయ స్థాయిలో కూడా సదస్సులు నిర్వహించాలని సూచించారు. నవంబర్ నెలలో నిర్వహించే 31వ సీఐఐ సదస్సుపై సోమవారం రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమీక్షించారు. నవంబర్ 12, 13వ తేదీల్లో విశాఖలో సీఐఐ భాగస్వామ్య సదస్సు నిర్వహించాలని నిర్ణయించారు. అలాగే ప్రాంతీయ స్థాయిలో భాగస్వామ్య సదస్సులు నిర్వహించే అంశంపై చర్చించారు. ౘ్రాఠిజీఙ్బజీజ ఇజ్బ్బుఙ్బ: ఔ్బుఛ్ఛీటఊజిజీఇ; ఫ్ఛీఛిజ్బు౹జూ౹జ౩ ఫీటఔ్బు్ఛీ ఫీట్బఛ్ఛీ జీ్ ్ ఫీట్బ్ఊఊ౹టరుఖజీజ గౌటజాఛీ ధీమ్మౌ 31వ పార్టనర్షిప్ సమ్మిట్ నిర్వహించనున్నారు. ఈ సదస్సులో భాగంగా ఎంఓయూలు కుదుర్చుకోవడం, మినిస్టీరియల్ సెషన్స్, ప్లీనరీ, కంట్రీ సెషన్స్, బీ2బీ, బీ2జీ సమావేశాలతో రెండు రోజుల భాగస్వామ్య సదస్సు నిర్వహించేలా అన్ని ఏర్పాట్లు చేయాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. విశాఖ భాగస్వామ్య సదస్సుకు జాతీయ, అంతర్జాతీయ కంపెనీల ప్రతినిధులు, కేంద్ర మంత్రులు, వివిధ దేశాలకు చెందిన డెలిగేట్స్ను ఆహ్వానించాలని సీఎం సూచించారు. భాగస్వామ్య సదస్సు నిర్వహణకు సంబంధించి వివిధ రాష్ట్రాలకు చెందిన సీఎంలకు లేఖలు రాయాలని అధికారులకు ముఖ్యమంత్రి సూచించారు. విశాఖ భాగస్వామ్య సదస్సుకు సంబంధించి దేశ విదేశాల్లో పెద్ద ఎత్తున ప్రచారం కల్పించాలని సీఎం చెప్పారు. ఈ మేరకు జూలై నుంచి సెప్టెంబర్ వరకు దేశవిదేశాల్లో రోడ్ షోలు చేపట్టాలని ఆదేశించారు. దీంట్లో భాగంగా ఢిల్లీ, బెంగళూరు, చెన్నై, ముంబై, కోయంబత్తూర్, అహ్మదాబాద్, హైదరాబాద్ వంటి ప్రాంతాల్లో సీఐఐ పార్టనర్ షిప్ సదస్సులకు సంబంధించి రోడ్ షోలు నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు అధికారులు తెలిపారు. అలాగే ప్రధాన భాగస్వామ్య సదస్సుకంటే ముందుగానే విశాఖ, రాజమండ్రి లేదా కాకినాడ, అమరావతి, అనంతపురం, తిరుపతి నగరాల్లో ప్రాంతీయ భాగస్వామ్య సమావేశాలు నిర్వహించాలని సూచించారు. అంతే కాకుండా.. ఈ సదస్సుల్లో ఎంఓయూలు కుదర్చుకునే అంశంపై అధికారులు ఎలాంటి ప్రణాళికలు చేపట్టారని ముఖ్యమంత్రి అడిగారు. ఏయే ప్రాంతాల్లో ఏయే రంగాలకు చెందిన పరిశ్రమలు స్థాపించేందుకు అవకాశం ఉంటుందో బేరీజు వేసుకుని.. ఆ మేరకు ఆయా ప్రాంతీయ సదస్సుల్లో ఎంఓయూలు కుదుర్చుకునేలా ఏర్పాట్లు చేస్తున్నామని అధికారులు తెలిపారు.

**లీడర్లదే భవిష్యత్...**

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ...భాగస్వామ్య సదస్సులు అంటే కేవలం పెట్టుబడులు రాబట్టడం, ఎంఓయూలు కుదుర్చుకోవడం అనే భావన పోవాలి. భాగస్వామ్య సదస్సుల్లో వివిధ కీలక అంశాల మీద చర్చ జరగాలి. ఎన్ని పెట్టుబడులు వస్తున్నాయి... ఎన్ని ఎంఓయూలు కుదుర్చుకున్నామనే దానికంటే నాలెడ్జ్ షేరింగ్ ఎంత వరకు చేసుకోగలుగుతున్నామనేది ముఖ్యం. అందుకే విశాఖలో జరగబోయే 31వ భాగస్వామ్య సదస్సులో జరిగే కార్యక్రమాలపై ప్రజలు చర్చించుకోవాలి. వినూత్నంగా ఆయా రంగాలను ఏ విధంగా అభివృద్ధి సాధించాలనే ఆలోచనలు రేకెత్తించాలి. టెక్నాలజీ సహా వివిధ అంశాల గురించి అందరూ మాట్లాడుతున్నారు. కానీ ఆయా రంగాల్లో ఛాంపియన్ గా నిలిచిన వాళ్లే గ్లోబల్ లీడర్లుగా ఎదుగుతున్నారు. ఫ్యూచరిస్టిక్ రంగాలపై ఎక్కువ దృష్టి సారించాలి. ప్రముఖ యూనివర్శిటీలకు చెందిన నిపుణులు భాగస్వామ్య సదస్సుకు వచ్చేలా చూడాలి. సీఐఐ గ్లోబల్ లీడర్ షిప్ సెంటర్ను అమరావతిలో ఏర్పాటు చేసుకోబోతున్నాం. విశాఖలో జరగబోయే పార్టనర్ షిప్ సమ్మిట్లో పబ్లిక్ పాలసీలపై కీలక చర్చలు జరగాలి. వ్యాపారాలు, పెట్టుబడులు వంటి అంశాలతో పాటు ఆయా రంగాల్లో సవాళ్లు ఎదురైతే వాటిని ఎలా అధిగమించాలనే అంశంపై రకరకాల చర్చలు జరగాలి. వ్యవసాయం, ఉద్యానరంగం, ప్రకృతి వ్యవసాయం, సర్క్యులర్ ఎకానమీ, ఆధ్యాత్మికత, స్ట్రెస్ ఫ్రీ వర్క్ వంటి అంశాలపై చర్చించాలి.

# ప్రభుత్వ సేవలు మరింత సులభతరం

(మొదటి పేజీ తరువాయి)

ముఖ్యమంత్రి సూచించారు. ఈ మేరకు సేవల్ని సులభతర ప్రక్రియను మొదలు పెట్టామని.. ముందుగా 11 రకాల సేవల్లో ప్రక్రియలను కుదిస్తున్నామని అధికారులు తెలిపారు. అలాగే ప్రజా ఫిర్యాదుల వ్యవస్థను ప్రజలకు మరింత అందుబాటులోకి తీసుకురావాలని సీఎం ఆదేశించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పలు సూచనలు చేశారు. ఆన్లైన్లో ఫిర్యాదులు చేసే అవకాశాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడంతోపాటు... మనమిత్ర వాట్సాప్లో కూడా ఫిర్యాదులు చేసే అవకాశం కల్పించాలన్నారు.

వాయిస్ మెసేజెస్ పెట్టినా వాటిని కూడా ఫిర్యాదులుగా స్వీకరించేలా చూడాలని సీఎం అధికారులకు సూచించారు. రాష్ట్రంలో మొబైల్ నెట్వర్క్ సమస్యలు లేకుండా చూడాలన్నారు. రాష్ట్రంలో సుమారు 3 వేల ప్రాంతాల్లో కనెక్టివిటీ సమస్య ఉందని.. మూడు నెలల్లో సమస్య పరిష్కరించాలన్నారు. ఈ మేరకు నెట్వర్క్ సంస్థలతో మాట్లాడాలని సూచించారు. నవచేతన పేరుతో స్త్రీ శిశు సంక్షేమ శాఖ చేపట్టిన ఎర్లీ చైల్డ్ హుడ్ డెవలప్మెంట్ స్క్రీనింగ్ విధానంపై సమావేశంలో అధికారులు ప్రజెంటేషన్ ఇచ్చారు. పిల్లల ఎదుగుదల, వారి మానసిక, శారీరక పరిస్థితులను అధ్యయనం చేస్తున్నట్టు అధికారులు వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా 33,949 మంది పిల్లలను స్క్రీన్ చేసినట్టు చెప్పారు. అంగన్వాడీ కేంద్రాలకు వచ్చేవారితో పాటు ఇళ్లకు కూడా వెళ్లి స్క్రీనింగ్ చేపట్టేలా చర్యలు తీసుకుంటున్నట్టు అధికారులు చెప్పారు. స్క్రీనింగ్తో పాటు... ఆ తర్వాత తీసుకోవాల్సిన చర్యలపై పైలెట్ ప్రాజెక్ట్ అమలు చేయనున్నట్లు వెల్లడించారు.

**తక్షణ పరిష్కారాలు చూపండి**

సీఎం సూచనల మేరకు క్షేత్రస్థాయి పర్యటనల విషయంలో సర్క్యులర్ జారీ చేశామని అధికారులు తెలిపారు. ఈ మేరకు నెలలో సెక్రటరీలు 3 రోజులు, హెచ్ఓడీలు 6 రోజులు, జిల్లా కలెక్టర్లు 8 రోజులు క్షేత్రస్థాయిలో పర్యటించాలని సర్క్యులర్ జారీ చేసినట్టు అధికారులు వివరించారు. సమస్యలు అధికంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి తక్షణ పరిష్కారాలు చూపాలని సీఎం ఆదేశించారు. పీజీఆర్ఎస్ విధానం మరింత మెరుగ్గా పనిచేసేలా స్టాండర్డ్ ఆపరేటివ్ ప్రొసీజర్స్ జారీ చేసినట్టు అధికారులు వెల్లడించారు. సీఐఐ డైరెక్టర్ జనరల్ చంద్రజీత్ బెనర్జీ, సీఐఐ ప్రతినిధులను వెంటపెట్టుకుని సీఎం చంద్రబాబు ఆర్టీజీఎస్ కేంద్రానికి వచ్చారు. ఆర్టీజీఎస్ పనితీరును ఐటీ సెక్రటరీ కాటంనేని భాస్కర్ సీఐఐ ప్రతినిధులకు వివరించారు.

## అమరావతి ప్రైడ్ ఫర్ ఏపీ-ప్రైడ్ ఫర్ ఇండియా

(మొదటి పేజీ తరువాయి)

పనులు కాంట్రాక్టు సంస్థలకు అప్పగించామని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. హౌసింగ్, ట్రంక్ ఇన్ ఫ్రా, ఎల్పీఎస్ ఇన్ ఫ్రా, సహా అసెంబ్లీ, హైకోర్టు, సచివాలయ టవర్ల లాంటి ఐకానిక్ భవనాల నిర్మాణ ప్రాజెక్టులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. పనులు వేగంగా చేసేందుకు అవసరమైన మానవ వనరులు, యంత్రాలు ఇతర సామాగ్రిని ముందుగానే సిద్ధం చేసుకోవాలని సీఎం స్పష్టం చేశారు. ప్రస్తుతం 26,924 మంది కార్మికులు, 5,140కి పైగా భారీ యంత్రాలు నిర్మాణ పనుల్లో నిమగ్నమైనట్టు మంత్రి నారాయణ సీఎంకు వివరించారు. నిర్మాణ పనులకు ఎలాంటి ఆటంకమూ లేకుండా కొండవీటి వాగు, పాలవాగు ప్రవాహాలు సజావుగా సాగేందుకు వీలుగా వాటిని వెడల్పు చేస్తున్నామని మంత్రి తెలియచేశారు. దీనిపై స్పందించిన సీఎం భవిష్యత్ నగరంగా నిర్మిస్తున్న అమరావతి నిర్మాణంలో పని చేశామన్న బ్రాండ్ ను కాంట్రాక్టర్లు సంపాదించేలా పనులు చేపట్టాలని సూచించారు. కొందరు వ్యక్తులు కావాలని లిటిగెంట్లుగా మారి రాజధాని పనుల్ని అడ్డుకోవాలని ప్రయత్నాలు చేస్తున్నారని .. రాష్ట్ర ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ముందుకు వెళ్లాలని సీఎం స్పష్టం చేశారు. కార్యదర్శులు, ప్రధాన కార్యదర్శుల నివాసాలు, రహదారులు, మౌలిక సదుపాయాలతో పాటు అసెంబ్లీ, హైకోర్టు, సచివాలయ టవర్ల నిర్మాణాలపై ముఖ్యమంత్రి పలు సూచనలు చేశారు. దేశవ్యాప్తంగా వివిధ పుణ్య క్షేత్రాలు, నదుల నుంచి పవిత్రమైన మట్టి, నీళ్లు తీసుకువచ్చి ఈ ప్రాంతాన్ని పునీతం చేశామని.. గత పాలకులు ఐదేళ్ల పాటు రాజధాని నిర్మాణాన్ని ఆపేశారని సీఎం అన్నారు.

## జూలై 1న నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో సీఎం చంద్రబాబు పర్యటన

(మొదటి పేజీ తరువాయి)

పార్ట్స్ సెంటర్-జీపీసీకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జూలై 1 తేదీన శంకుస్థాపన చేయనున్నారు. తిరుపతి జిల్లా సత్యవేడు మండలంలోని మదనపాలెంలో హీరో మోటార్ కార్ప్స్ నూతనంగా ఏర్పాటు చేయనున్న జీపీసీకు సీఎం భూమిపూజ చేయనున్నారు. హీరో మోటార్స్ కు చెందిన వివిధ తయారీ కేంద్రాలు, డీలర్లకు ద్విచక్ర వాహనాల విడి భాగాలను తయారు చేసి సరఫరా చేసేలా ఆ సంస్థ ఈ సెంటర్ ను ఏర్పాటు చేయనుంది. రూ.750 కోట్ల పెట్టుబడితో హీరో మోటార్ కార్పోరేషన్ ఈ జీపీసీ 2.0ను నిర్మించనుంది. దీని ద్వారా 4 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలగనున్నాయి. ఇప్పటికే శ్రీసిటీ సమీపంలో హీరో మోటార్స్ సంస్థ ఏర్పాటు చేసిన అధునాతన ద్విచక్ర వాహనాల తయారీ ప్లాంట్ లో ఏడాదికి 1.5 మిలియన్ల వాహనాలను ఉత్పత్తి జరుగుతోంది. దేశ, విదేశాల్లో ఉన్న మోటార్ సైకిళ్లు, స్కూటెక్ లు, ఈవీలకు విడి భాగాలను తయారు చేసేందుకు గానూ ఈ జీపీసీను హీరో మోటార్స్ ఏర్పాటు చేయనుంది. ఇప్పటికే పీ4 కార్యక్రమంలో మార్గదర్శిగా ఉన్న హీరో మోటార్స్ సంస్థ పలువురికి స్కాలర్ షిప్ లను ఇవ్వాలని నిర్ణయించుకుంది. ఈ మేరకు స్వర్ణాంధ్ర ఫౌండేషన్ ద్వారా హీరో మోటార్స్ అందించనున్న బ్రిజ్ మోహన్ లాల్ ముంజల్ పేరుతో హీరోస్ ఆఫ్ టుమారో పేరిట స్కాలర్షిప్ లను సీఎం ఆవిష్కరించనున్నారు.

# క్షేత్రస్థాయి నాయకత్వాన్ని బలోపేతం చేయడమే జనసేన లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

అధికారికంగా ప్రారంభించింది. విజయవాడ కేపీనగర్ లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఈ సందర్భంగా కమిటీ సభ్యులకు దిశానిర్దేశం చేయడంతో పాటు మీడియా సమావేశం నిర్వహించి మంత్రి కందుల దుర్గేష్ కీలక అంశాలు ప్రస్తావించారు. సాధారణ రాజకీయ పార్టీలకు భిన్నంగా క్షేత్రస్థాయి నుండి నాయకులను ఎన్నుకునే విశిష్ట విధానాన్ని జనసేన పార్టీ అవలంబిస్తోందని మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు. పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు ఈ స్పష్టమైన కార్యాచరణను సిద్ధం చేసినట్లు తెలిపారు. ఈ సమాచార సేకరణ ప్రక్రియ కోసం 28 మంది సభ్యులను జనసేనాని పవన్ కళ్యాణ్ స్వయంగా ఎంపిక చేశారని, ఇందులో రాగద్వేషాలకు తావులేకుండా, కులమతాలకు అతీతంగా అత్యంత పారదర్శకంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. జనసేన 7 సూత్రాలలోని 'కులాలను కలిపే విధానాన్ని' ఈ సందర్భంగా గుర్తుచేశారు.జూన్ 30 నుండి నాలుగు రోజుల పాటు దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ కొనసాగుతుందని స్పష్టం చేశారు. 2014 నుండి పార్టీ కోసం అంకితభావంతో పనిచేస్తున్న అనుభవజ్ఞులను గుర్తించి, వారి నాయకత్వ లక్షణాలు, బలాలు మరియు బలహీనతలను క్షుణ్ణంగా పరిశీలించాలి అన్నారు. ఈ కమిటీ కేవలం క్షేత్రస్థాయి సమాచారాన్ని, నివేదికలను సేకరించి ఒక ఖచ్చితమైన ప్రాతిపదికను మాత్రమే అధిష్ఠానానికి అందిస్తుందని, దీని ఆధారంగా విజయవాడ పార్లమెంట్ జిల్లా, పట్టణ, మరియు నియోజకవర్గ ఇంచార్జ్ నియామకంపై అంతిమ నిర్ణయం పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ తీసుకుంటారని వివరించారు..ఇందులో భాగస్వామ్యం కావడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ఇలాంటి ప్రక్రియకు శ్రీకారం చుట్టిన జనసేనాని పవన్ కళ్యాణ్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఒక్కొక్కరు ఒక్క అప్లికేషన్ మాత్రమే ఇవ్వాల్సి ఉంటుందన్నారు. అతి త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా పార్టీని బలోపేతం చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ ప్రక్రియను ప్రారంభించడం ఆనందంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు.

# జనసేనాని పవన్ కళ్యాణ్ అన్నివర్గాల నాయకుడు

- **ఆయనపై కులముద్ర వేయవద్దు**
- **రాజకీయ విశ్లేషకులు తెలకపల్లి రవి ఏకపక్ష వైఖరిపై మంత్రి కందుల దుర్గేష్ తీవ్ర ఆగ్రహం**



**అమరావతి,జూన్, 29,(మనం ప్రతినిధి):** కుల నిర్మూలన, సామాజిక సమానత్వం కోసం నిరంతరం శ్రమిస్తున్న డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ లాంటి నాయకుడిపై కుల ముద్ర వేయడం తగదని, కేవలం ఒకే ఒక్క కులానికి పరిమితం చేయడానికి ప్రయత్నించడం దుర్మార్గమని రాజకీయ విశ్లేషకులు తెలకపల్లి రవి ఏకపక్ష వైఖరిపై రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయ విశ్లేషకులు తెలకపల్లి రవి అనుసరిస్తున్న ఏకపక్ష, పక్షపాత విశ్లేషణలు సరికాదని మండిపడ్డారు. జనసేనాని పవన్ కళ్యాణ్ సమాజంలో అన్ని వర్గాల ప్రజల గుండెల్లో స్థానం సంపాదించుకున్న నిఖార్సైన ప్రజా నాయకుడని సోమవారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు.

ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. మేధావులనే వారు నిష్పక్షపాతంగా, రెండు వైపులా ఉన్న సత్యాన్ని విశ్లేషించాలే తప్ప, ఒకే వైపు నిలబడి రాజకీయ కళ్లద్దాలతో చూడటం సరికాదని హితవు పలికారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సిద్ధాంతాలను, ఆశయాలను అర్థం చేసుకోకుండా మాట్లాడటం తెలకపల్లి రవి మేధావితనానికే అవమానకరమని పేర్కొన్నారు. 'ఇంటి గడప దాటకూడదు కులం.. సమాజంలోకి వస్తే అందరూ సమానమే అని ఘంటాపథంగా చెప్పిన దమ్మున్న నాయకుడు మా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్. కులం పేరుతో రాజకీయం చేయాల్సిన దౌర్భాగ్యం కూటమి ప్రభుత్వానికి లేదు. క్రిమినల్కు కులం ఉండదు.. బాధితుడికి మతం ఉండదు!' అని మంత్రి స్పష్టం చేశారు. గాదె సాయి కృష్ణ కేసు విషయంలో కూటమి ప్రభుత్వం అత్యంత చిత్తశుద్ధితో వ్యవహరిస్తోందని మంత్రి దుర్గేష్ తెలిపారు. తప్పు చేసిన వాడు ఎంతటి వాడైనా వదిలే ప్రసక్తే లేదని ఇప్పటికే ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పాటు చేసి, నిందితుడైన సీఐ నాగరాజును అదుపులోకి తీసుకుని రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించిన విషయాన్ని గుర్తు చేశారు. ఇందులో ప్రభుత్వం ఎక్కడా కులాన్ని వెనకేసుకుని రాలేదని, చట్టం తన పని తాను చేసుకుపోతోందని స్పష్టం చేశారు. నేరస్థులను నేరస్థులుగానే చూడాలని, వారికి కుల, మత ముసుగులు వేయకూడదన్నదే తమ నాయకుడు పవన్ కళ్యాణ్ స్పష్టమైన విధానమన్నారు.

## అమెరికా-ఇరాన్ ఉద్రిక్తతలు

(మొదటి పేజీ తరువాయి)

సోషల్ మీడియాలో ఆయన పోస్టు చేశారు. ఇరుదేశాల ప్రతినిధులు ఇందులో పాల్గొంటారని చెప్పారు. ఈ సమావేశంలో తుది ఒప్పందంపైనా చర్చించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. కాగా ఖతార్లో ఈ వారం ఇరాన్- అమెరికా బృందాల మధ్య సమావేశాలు నిర్వహించే ప్రణాళికలేవీ లేవని ఇరాన్ ఉప విదేశాంగ మంత్రి కాజెమ్ ఘరిబబాడి పేర్కొన్నారు. తమ హామీల అమలుకు సంబంధించి అమెరికా తీసుకుంటున్న చర్యల పర్యవేక్షణ, ఖతార్‌తో సంప్రదింపులు యథావిధిగా కొనసాగుతున్నాయని అన్నారు.

## 'తీస్తా' ప్రాజెక్టులో బంగ్లాకు సహకరిస్తాం: చైనా

(మొదటి పేజీ తరువాయి)

సాయం చేయడానికి చైనా ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందన్నారు. అభివృద్ధి వ్యూహాలలో బంగ్లాదేశ్‌తో మరింత సమన్వయం సాధించడానికి, ఆర్థిక, వాణిజ్యం, నీటిపారుదల వంటి రంగాలలో సహకారాన్ని పెంపొందించుకోవడానికి సిద్ధంగా ఉన్నామని గువో జియాకున్ పేర్కొన్నారు. తీస్తా ప్రాజెక్ట్‌పై ఇరు దేశాల నిపుణులు సాంకేతిక అధ్యయనం నిర్వహిస్తారని బంగ్లాదేశ్ విదేశాంగ మంత్రి ఖలీలుర్ రెహమాన్ తెలిపారు. వ్యూహాత్మకంగా సున్నితమైన సిలిగుడి కారిడార్ (చికెన్స్ నెక్)కు ఈ నది సమీపంలో ఉన్నందున.. ఈ ప్రాజెక్టులో చైనా జోక్యం భారత్‌కు ప్రమాదకరమే. బంగ్లా-చైనా ఉమ్మడిగా కార్యకలాపాలు చేపడితే రక్షణ పరంగా ఇబ్బందులు తలెత్తుతాయని కేంద్ర ప్రభుత్వం ఆందోళన వ్యక్తం చేస్తోంది.

## ఉక్రెయిన్ యుద్ధం.. అమెరికాతో చర్చలకు సిద్ధం

(మొదటి పేజీ తరువాయి)

వద్ద భద్రతను మరింత కట్టుదిట్టం చేస్తామని, ఉత్పత్తి పెంచుతామని వెల్లడించారు. మరోవైపు, ఈ దాడులపై ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ మాట్లాడుతూ.. 'రష్యా సామర్థ్యాన్ని బలహీనపరిచే ఆపరేషన్లను కొనసాగిస్తాం' అని పేర్కొన్నారు.

## ఎస్ఐఆర్పై అప్రమత్తంగా ఉండాలి

(మొదటి పేజీ తరువాయి)

అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, ఎన్యూమరేషన్ ఫారాలు ఇవ్వకుండానే ఇచ్చినట్లు నమోదు చేస్తున్నారనే సమాచారం వస్తోందన్నారు. అనేక ప్రాంతాల్లో టీడీపీ నేతలు అధికారులపై ఒత్తిడి తెచ్చి వైఎస్సార్సీపీ ఓటర్ల పేర్లను తొలగించే ప్రయత్నాలు చేస్తున్న సమాచారం వస్తుందన్నారు. ప్రతి బూత్లో 40 నుంచి 50 ఓట్లు తొలగించే ప్రయత్నం జరిగే అవకాశం ఉన్నందున బీఎల్ఏలు, బూత్ స్థాయి నాయకులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై వంటి నగరాల్లో ఉద్యోగాలు, ఉపాధి కోసం ఉన్న వారి పేర్లను 'అందుబాటులో లేరు' అనే పేరుతో తొలగించే అవకాశం ఉందని, అలాంటి ప్రతి ఓటరుని గుర్తించి వారి ఓటు రక్షించే బాధ్యత పార్టీ శ్రేణులపై ఉందన్నారు. 'మన ఓట్లు మనమే కాపాడుకోవాలి. ఒక్క నిజమైన ఓటరు కూడా జాబితా నుంచి తొలగిపోకూడదు' అని స్పష్టం చేశారు. కొంతమంది అధికారులు టీడీపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్న నేపథ్యంలో ప్రతి చర్యను నిశితంగా పర్యవేక్షించాలని సూచించారు. బీఎల్వోలు సహకరించకపోయినా లేదా ఎలాంటి సమస్యలు ఎదురైనా వెంటనే పార్టీ సీనియర్ నాయకులను సంప్రదించాలని, వెంటనే జిల్లా కలెక్టర్లకు ఫిర్యాదు చేయాలని తెలిపారు.ఇప్పటికే రెండు వారాలు గడిచాయని, ఇకపై మరింత వేగంగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లా పార్టీ అధ్యక్షులు వెంటనే అన్ని నియోజకవర్గ ఇన్చార్జ్‌లతో సమావేశాలు నిర్వహించి సమన్వయం చేసుకోవాలని, ఎస్ఐఆర్ కోసం ఏర్పాటు చేసిన టాస్క్‌ఫోర్స్ నిరంతరం సమీక్షలు నిర్వహించాలని ఆదేశించారు.

# అట్టహాసంగా చెవిరెడ్డి మోహిత్ రెడ్డి జన్మదిన వేడుకలు

- తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలు
- పదివేల మందికి పసందైన వంటకాలతో భోజనాలు ఏర్పాటు
- శుభాకాంక్షలు తెలిపిన భూమన, నారాయణస్వామి, సిపాయి



**తిరుపతి రూరల్ జూన్ 29 మనం న్యూస్ :** తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంట గ్రామం సోమవారం పండుగ వాతావరణాన్ని తలపించింది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువనేత చెవిరెడ్డి మోహిత్ రెడ్డి జన్మదిన వేడుకలు అట్టహాసంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచే చెవిరెడ్డి నివాసానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, శ్రేయోభిలాషులు, స్నేహితులు పెద్దఎత్తున తరలివచ్చి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. దీంతో చెవిరెడ్డి నివాసం జనసంద్రంగా మారింది.

చంద్రగిరి నియోజకవర్గంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో మోహిత్ రెడ్డి జన్మదిన శుభాకాంక్షల ఫ్లెక్సీలు వెలసి పండుగ వాతావరణాన్ని సృష్టించాయి. తుమ్మలగుంటలోని తెలుగుతల్లి విగ్రహం నుంచి చెవిరెడ్డి నివాసం వరకు సందడి నెలకొంది. నివాసాన్ని ప్రత్యేక పుష్పాలంకరణతో అలంకరించగా, నాయకులు, కార్యకర్తల కోసం ప్రత్యేక భోజన స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఉదయం అల్పాహారం నుంచి మధ్యాహ్నం, రాత్రి భోజనాల వరకు వచ్చిన ప్రతి ఒక్కరికీ ఆతిథ్యం అందించారు. రకరకాల వంటకాలతో చెవిరెడ్డి కుటుంబ సభ్యులు స్వయంగా భోజనం వడ్డించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆత్మీయంగా పలుకరిస్తూ అన్ని ఏర్పాట్లను చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి దగ్గరుండి పర్యవేక్షించారు.

## 2018లో జరిగిన ఇద్దరి హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు శిక్ష విధించిన 9వ జిల్లా, సెషన్స్ జడ్జి



**చిత్తూరు జూన్ 29 మనం న్యూస్:** చిత్తూరు తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలో 2018 సంవత్సరంలో జరిగిన ఇద్దరి హత్య కేసులో నిందితుడైన బండి కేశవులుపై విచారణ పూర్తి చేసి,9వ అదనపు జిల్లా, సెషన్స్ జడ్జి ఎన్. శ్రీనివాసరావు నిందితుడిని దోషిగా నిర్ధారిస్తూ రెండు హత్యలకు గాను జీవిత ఖైదు శిక్ష మరియు ఒక్కో హత్యకు రూ.1,000 చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు.చిత్తూరు మండలం నయనిచెరువు పంచాయతీ పరిధిలోని చెన్నసముద్రం గ్రామానికి చెందిన పల్లెబోయన శేఖర్, పి. లక్ష్మీపతి యాదవ్ లక్ష్మయ్యలను అక్టోబరు20,2018 రాత్రి చెరకు తోటలో నిందితుడు బండి కేశవులు కత్తితో గొంతు కోసి హత్య చేశాడు. నిందితుడి కుమార్తెను శేఖర్ లైంగికంగా వేధిస్తున్నాడనే కక్షతో శేఖర్ను హత్య చేయగా, సంఘటనను బయటకు చెప్పకుండా ఉండేందుకు అతనితో పాటు ఉన్న లక్ష్మీపతిని కూడా హత్య చేశాడు.

మృతుడు శేఖర్ తల్లి పి. మాణిక్యమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి తాలూకా పోలీస్ స్టేషన్ ఎస్.ఐ. ఎన్. భాస్కర్ కేసు నమోదు చేశారు. కేసు తీవ్రత దృష్ట్యా అప్పటి చిత్తూరు రూరల్ ఈస్ట్ సర్కిల్ ఇన్స్పెక్టర్ బి. శ్రీనివాసరావు దర్యాప్తు చేపట్టి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. దర్యాప్తులో నిందితుడు వీఆర్వో సమక్షంలో నేరాన్ని అంగీకరించగా, అతని చూపిన మేరకు హత్యకు ఉపయోగించిన కొడవలి, రక్తపు మరకలున్న దుస్తులు తదితర వస్తువులను స్వాధీనం చేసుకొని శాస్త్రీయ ఆధారాలతో దర్యాప్తు పూర్తి చేసి కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేశారు.విచారణ అనంతరం సోమవారం 9వ అదనపు జిల్లా, సెషన్స్ జడ్జి తీర్పు వెలువరించి, నిందితుడు బండి కేశవులును రెండు హత్యలకుగాను ఐపిసి సెక్షన్ 302 కింద దోషిగా నిర్ధారించి, జీవిత ఖైదు శిక్ష మరియు ఒక్కో హత్యకు రూ.1,000 జరిమానా, జరిమానా చెల్లించని పక్షంలో మూడు నెలల సాధారణ కారాగార శిక్ష విధించారు.



## మోహినీ అవతారంలో పల్లకిపై దివ్య విహారం

- భక్తులను అనుగ్రహించిన శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి

**తిరుపతి జూన్29 మనంన్యూస్:** అప్పలాయగుంటలో వైభవంగా జరుగుతున్న శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం స్వామివారు మోహినీ అవతారంలో పల్లకిపై విహరిస్తూ భక్తులకు దివ్య మంగళ దర్శనం ప్రసాదించారు.స్వామివారి మనోహర రూపాన్ని దర్శించిన భక్తులు భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. గోవింద నామస్మరణతో మారుమోగిన మాడవీధులు ఉదయం 8 గంటలకు ప్రారంభమైన పల్లకీ వాహనసేవలో భక్తులు అడుగడుగునా కర్పూర హారతులు సమర్పిస్తూ, గోవింద నామస్మరణల మధ్య స్వామివారిని భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో హరీంద్రనాథ్, ఏఈవో దేవరాజులు, సూపరింటెండెంట్ శ్రీవాణి, టెంపుల్ ఇన్స్పెక్టర్ వేణుగోపాల్, అర్చకులు, శ్రీవారి సేవకులు, భక్తులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి పర్యటనకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి

- జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్

**శ్రీసిటీ, జూన్ 29 మనం న్యూస్:** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జూలై 1వ తేదీన శ్రీ సిటీలో హీరో మోటోకార్ప్ సంస్థ ఏర్పాటు చేయనున్న రెండో గ్లోబల్ పారట్స్ సెంటర్కు శంకుస్థాపన చేయనున్న నేపథ్యంలో విస్తృత స్థాయిలో ముందస్తు ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్, జిల్లా ఎస్పి ఎల్. సుబ్బరాయుడు, జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు, హీరో మోటోకార్ప్ సంస్థ ప్రతినిధులు, శ్రీ సిటీ అధికారులతో కలిసి కార్యక్రమం నిర్వహించనున్న ప్రాంగణాన్ని, హెలిపాడ్ను, వేదిక ఏర్పాట్లను, ముఖ్యమంత్రి రాకపోకల మార్గాలను క్షుణ్ణంగా పరిశీలించారు.




ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన అత్యంత ప్రతిష్టాత్మకమైనదని, ప్రతి శాఖ తనకు అప్పగించిన బాధ్యతలను సమయానికి పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమ నిర్వహణలో ఎలాంటి చిన్నపాటి లోపాలకు కూడా తావు లేకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి హెలికాప్టర్ ల్యాండింగ్ నుంచి కార్యక్రమం ముగిసే వరకు ప్రతి అంశాన్ని ప్రణాళికాబద్ధంగా అమలు చేయాలని, వేదిక నిర్వహణ, అతిథుల కూర్చోవడానికి ఏర్పాట్లు, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్ సరఫరా, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్, వైద్య సేవలు, అగ్నిమాపక సిబ్బంది అందుబాటులో ఉండేలా అందరు అధికారులు సమన్వయముతో చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు.

## సహకార బ్యాంకులను బలోపేతం చేసేందుకు డిపాజిట్ల పెంపుపై ప్రత్యేక దృష్టి సారించాలి



- జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

**చిత్తూరు, జూన్ 29 మనం న్యూస్:** సహకార బ్యాంకులను బలోపేతం చేసేందుకు డిపాజిట్ల పెంపుపై ప్రత్యేక దృష్టి సారించాలని సంబంధిత అధికారులకు సూచించిన జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సోమవారం జిల్లా సహకార వారోత్సవాల సందర్భంగా చిత్తూరులోని జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) కార్యాలయంలో జిల్లా కలెక్టర్ శ్రీ సుమిత్ కుమార్ డిసీసీబీ చైర్మన్ అమాస రాజశేఖర్ రెడ్డి, సహకార అధికారి శ్రీలక్ష్మి, బ్యాంకు మేనేజర్లు, సహకార సంఘాల అధ్యక్షులు, బోర్డు సభ్యులు తదితరులతో కలిసి మొబైల్ ఏటీఎం వాహనాలను ప్రారంభించి, సహకార జెండాను ఆవిష్కరించి, మొక్కలు నాటి జిల్లా సహకార రంగ అభివృద్ధి, రైతులకు మెరుగైన రుణ సదుపాయాల కల్పన, బ్యాంకుల ఆర్థిక స్వావలంబన, డిపాజిట్ల పెంపు, రుణాల వసూళ్లు, ఎన్పీఏల నియంత్రణ తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని బ్యాంకులు సేకరించిన మొత్తం డిపాజిట్లలో డీసీసీబీ వాటా కేవలం 3.20 శాతం మాత్రమే ఉండగా, రుణాల పంపిణీలో మాత్రం 5.25 శాతం వాటాను కలిగి ఉందన్నారు. దీంతో రుణాల పంపిణీ కోసం రాష్ట్ర సహకార బ్యాంకు, నాబార్డ్ వంటి సంస్థలపై అధికంగా ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని తెలిపారు. డిపాజిట్లను మరింతగా పెంచడం ద్వారా బ్యాంకు స్వంత వనరులు బలోపేతం అవుతాయని, తద్వారా బయటి సంస్థలపై ఆధారపడకుండా రైతులకు అవసరమైన సమయంలో తక్షణ రుణ సదుపాయాలు అందించే అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు.

## ఏరువాక పౌర్ణమి భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే రైతన్నల పండుగ

- పూతలపట్టు ఎమ్మెల్యే కే మురళీమోహన్

**పూతలపట్టు, జూన్,29మనం న్యూస్:** దేశానికీ వెన్నుముక రైతన్న అని, రైతుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పధకాలను అమలు చేస్తున్నదని స్థానిక ఎమ్మెల్యే మురళీమోహన్ పేర్కొన్నారు. సోమవారం పూతలపట్టు మండలంలోని బండపల్లి వద్ద వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతు సాధికార సంస్థ సహకారంతో ఏరువాక పౌర్ణమి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ఎమ్మెల్యే పాల్గొన్న ఆయన మాట్లాడుతూ దేశానికి,ప్రపంచానికి ఆహారం అందించే అన్నదాత నేడు ఆహాకారాలు చేస్తున్నాడని ప్రభుత్వాలు చేసే సహాయం కోసం అర్రులు చేస్తున్నాడని, ఇది దేశానికి సమాజానికి మంచిది కాదని అన్నారు. దేశం ఆకలి తీర్చే అన్నదాత నేడు ఆర్థికంగా చితికిపోయి పండించిన పంటలకు గిట్టుబాటు లేక ప్రభుత్వాలు ఇచ్చే సబ్సిడీల కోసం, రాయితీల కోసం చేయి చాచడం దయనీయమైన పరిస్థితి అని అన్నారు. శాస్త్రవేత్తలు మేధావులు పరిశోధనలు చేసి అందిస్తున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులు అందిపుచ్చుకోవడం లేదా లేక శాస్త్రవేత్తలు చెప్పే విషయాలు రైతులకు ఉపయోగపడటం లేదా అని ప్రశ్నించారు.



# ఏడుగురు జూదరుల అరెస్ట్

### రూ.32,200 నగదు, 52 ప్లేయింగ్ కార్డులు స్వాధీనం

**బంగారు పాళ్యం జూన్29 మనం న్యూస్:** చిత్తూరు జిల్లా ఎస్పీ తుషార్ డూడి, ఆదేశాల మేరకు జిల్లా పోలీసులు జిల్లా నందు జూదం, గంజాయి, మాదక ద్రవ్యాలు, అక్రమ మద్యం, చట్టవిరుద్ధ కార్యకలాపాలపై ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా పలమనేరు సబ్-డివిజన్ డి.ఎస్.పి.డేగల ప్రభాకర్ పర్యవేక్షణలో, బంగారుపాళ్యం ఇన్స్పెక్టర్ కత్తి శ్రీనివాసులు ఆదేశాల మేరకు బంగారుపాళ్యం పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ టి. ప్రసాద్ సిబ్బంది ఈరోజు బంగారుపాళ్యం మండలం రాగిమానుపెంట పంచాయతీ పరిధిలోని బిఎల్ కండ్రిగ గ్రామ సమీపంలో అక్రమ జూదం జరుగుతున్నదని డ్రోన్ నిఘా ఆధారంగా ఆకస్మిక దాడి నిర్వహించి అక్రమంగా జూదం ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను అరెస్ట్ చేశారు.

దాడి సమయంలో కొందరు వ్యక్తులు నగదు పణంగా పెట్టి పేకాట (జూదం) ఆడుతున్నట్లు గుర్తించారు. పోలీసులను గమనించిన వెంటనే ముగ్గురు వ్యక్తులు అక్కడి నుండి పరారయ్యారు. సంఘటన స్థలంలోనే ఏడుగురు నిందితులను అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేయడంతో పాటు, వారి వద్ద నుంచి రూ.32,200 నగదు మరియు 52 ప్లేయింగ్ కార్డులను స్వాధీనం చేసుకున్నారు.



### అన్నదాతలకు సిఎం చంద్రబాబు ఏరువాక పున్నమి శుభాకాంక్షలు

(విజయవాడ,మనం న్యూస్ ప్రతినిధి) : దేశానికి అన్నం పెడుతున్న అన్నదాతలకు ఏరువాక పున్నమి శుభాకాంక్షలు. జ్యేష్ఠ శుద్ధ పౌర్ణమి నాడు రైతన్నలు భూమిని, పశుసంపదను పూజించి ప్రకృతితో అనుసంధానం అయ్యే కార్యక్రమం ఏరువాక. పాడి పంటలతో రైతన్నల ఇళ్లలో వెలుగులు నిండాలని ప్రార్థిస్తున్నాను. ప్రకృతిని పూజించే గడ్డపై పుట్టిన మనం ఆ సాంప్రదాయాలను పాటిద్దాం. ప్రకృతి సాగుతో పంటలు పండించి మన భూమిని, మన ఆరోగ్యాన్ని విషతుల్యం కాకుండా కాపాడుకుందాం. వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు కూటమి ప్రభుత్వం ఎప్పుడూ చొరవ తీసుకుంటుంది. ఇందులో భాగంగానే అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ నిధులు జమ చేసి వారికి అండగా నిలిచాం. ఎల్ నినో, అంతర్జాతీయ పరిస్థితుల కారణంగా తలెత్తే సవాళ్ళను రైతన్నలు అధిగమించాలని కోరుకుంటున్నాను. ప్రభుత్వ సూచనలు, సలహాలు పాటిస్తూ రైతన్నలు సాగుతో సిరులు పండించాలని ఆకాంక్షిస్తున్నాను.

# శశి మేఘనకు ఘనంగా సత్కారం

**అమలాపురం జూన్ 29 మనం ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దేవాంగ సంక్షేమ సంఘం విజయవాడలో ఆదివారం నిర్వహణలో మార్చి 2026 పదవ తరగతి పబ్లిక్ పరీక్ష లలో 26 జిల్లాలలో ప్రథమ స్థాయి లో మార్కులు సాధించిన విద్యార్థిని విద్యార్థులను ఘనంగా సత్కరించారు. డా. బి. ఆర్. అంబేద్కర్ కోనసీమజిల్లా నుండి 598 మార్కులు సాధించిన పడవల శశి మేఘన ను రాష్ట్ర దేవాంగ సంక్షేమ సంఘ అద్యక్షుడు వూటుకూరి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి అధ్యక్షత న జరిగిన బహుమతి ప్రదానోత్సవ సభలో మాజీమంత్రి నిమ్మల కృష్ణప్ప, మాజీ ఐ ఏ ఎస్ తొగర్ల చిరంజీవులు,తలిదండ్రులు పడవల విశ్వప్రసాద్,రాజ్యలక్ష్మి ల సమక్షంలో శశి మేఘన కు 11,348 రూపాయల నగదు,ప్రసంసాపత్రం, జ్ఞాపిక లతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలోసంఘ కార్యదర్శి మాడిశెట్టి శివశంకరయ్య, కోశాధికారి కొండపల్లి పరమేశ్వర రావు, నిమ్మల అంబరీష్, చంగల మహేష్, ముప్పన వీరరాజు,బండ్ల బాబు, బల్ల వెంకటరమణ,పిచ్చిక శ్యామ్, బళ్ల వెంకటేశ్వర రావు, కార్టూనిస్ట్ మాడా రాము, మన్నెం సతీష్, అల్లక తాతారావు, చంగల మహేష్, అల్లాడ సత్యనారాయణ తదితర దేవాంగ ప్రముఖులు పాల్గొని శశి మేఘనను అభినందించారు.



# సమస్యలు పరిష్కరించాలికౌన్సిల్ సభ్యులు

- సమస్యలపై తగు చర్యలు తీసుకోవాలి
- నగర పంచాయతీ చైర్మన్ సిహెచ్ చలం రెడ్డి

**బేతంచేర్ల జూన్ 29 ( మనం న్యూస్) :** నగర పంచాయతీ కార్యాలయం లో నగర పంచాయతీ చైర్మన్ సి.హెచ్.చలం రెడ్డి అధ్యక్షతన మరియు నగర పంచాయతీ కమిషనర్ డి. హరిప్రసాద్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు ఈ సమావేశంలో నగర పంచాయతీ పరిధిలోని పలు వార్డులకు సంబంధించిన సమస్యలపై కౌన్సిల్ సభ్యులు కమిషనర్ చైర్మన్ తెలిపారు చర్చించారు.నగర పంచాయతీ పరిధిలోని అన్ని వార్డులలో ప్రజలు ఎదుర్కొంటున్న డ్రైనేజీ తాగునీరు రోడ్లు మరియు వీధి దీపాల సమస్యలను పరిష్కరించాలని సమావేశంలో కోరారు నగర పంచాయతీ చైర్మన్ సిహెచ్ చలం రెడ్డి మాట్లాడుతూ కాలనీలలో ఉన్న సమస్యలు పరిష్కరించాలని సమావేశంలో తెలిపారు కమిషనర్ హరి ప్రసాద్ కాలనీ ఉన్న వివిధ సమస్యలు పరిష్కరిస్తామని కౌన్సిల్కు తెలియజేశారు ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు కోఆప్షన్ మెంబర్లు నగర పంచాయతీ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



## వర్షం కురుస్తది

నదుల మీద
వాగులు పై
చిక్కని అడవులపై
కొండ వాలు తలంపైకి
ఎండకు ఎండి బాగా చెదిరిన
చెట్ల తలలపై
ఆకాశంలోకి ఎగబాకీ
నిటారుగా నిలబడిన
పైన్ వృక్ష శిరస్సుపై
ఈజిప్ట్
నేలను తడుపుతున్న నైలు నది
తనువును తాకుతూ
అమెజాన్ గుండెల్లో
సింఫని లా
విక్టోరియా జలపాత హోరులో
తానో రాగమై
వర్షం కురుస్తది
సూడాన్ ఎద్దు కొమ్ములు కడుగుతూ
కాంగో అడవుల్లో
కలగంటున్న చింపాజి
దేహాన్ని తడపటానికి
వర్షం కురుస్తది
బ్రెజిల్ ఫవేలా కొండలపై
కరేబియన్ నీలి జలాల్లో
తనివి తీరా తడవటానికి
వర్షం కరుస్తది
చిర పుంజిలో
శివ తాండవం చేయడానికి
పుడమి పురి విప్పడానికి
మాయన్ ల
మిగిలిన మనుషుల ముందు
కలిసి ఆడటానికి
తప్పకుండా వర్షం కురుస్తది
లామాల మెడను ముద్దాడటానికి
మచు పీచు స్వర్గపు అంచులను
తాకటానికి
వర్షం కురుస్తది

**- డా. సుంకర రమేశ్**
9492180764

ఎడిట్ పేజీ కోసం మీ సామాజిక విశ్లేషణలు, సాహిత్య వ్యాసాలు
**manamlekhalu@gmail.com**
మెయిల్ అడ్రస్‌కు పంపగలరు.

**ఈ పేపర్ కోసం**
https://www.manamepaper.com/
వెబ్‌సైట్‌లో చూడండి

– ఎడిటర్

# 'డబుల్ ఇంజన్'లో ట్రబుల్స్ ఎక్కువ




దేశంలో ప్రస్తుత పరిస్థితులను గమనిస్తే అవినీతి గురించి చర్చించడానికి, మాట్లాడటానికి ఇంతకంటే సరైన వారం మరొకటి ఉండదనిపిస్తోంది. వ్యక్తిగతంగా నా గురించి నేను చెప్పుకోవాల్సి వస్తే, ఇటీవల కాలంలో సమాజంలో, వార్తల్లో 'అవినీతి' అనే పదం ఇన్నిసార్లు వినాల్సి రావడం వల్ల నా తల తిరిగిపోతోందని నేను బహిరంగంగానే అంగీకరిస్తున్నాను. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసనలు తెలియజేస్తున్న ప్రతిపక్షాలను ఉద్దేశించి కొందరు అన్న 'బొద్దింకలు' అనే పదం నుండి.. అయోధ్య పవిత్ర రామాలయ నిర్మాణంలో బయట పడుతున్న రకరకాల వివాదాల వరకు.. అలాగే ఉజ్జయినిలో బంధుప్రీతితో కూడిన భూవ్యవహారాల అక్రమాల్లో దొరికిపోయిన 'డబుల్ ఇంజన్' ప్రభుత్వ ముఖ్యమంత్రి వరకు.. దేశంలో అవినీతి అనేది ఇప్పుడు ఎవరూ విస్మరించలేని అంతర్భాగంగా మారిపోయింది.

ఈసారి కూడా నేను వ్యాయామశాలలో ఉన్నప్పుడు, దేశ జాతీయ రాజకీయ రంగంలో అవినీతి అనేది అకస్మాత్తుగా ఇంతలా ఎలా పేలిందా అని తీవ్రమైన దిగులుతో, ఆందోళనతో ఆలోచిస్తున్నాను. సరిగ్గా అదే తరుణంలో ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ టీవీ స్క్రీన్‌పై ప్రత్యక్షమయ్యారు. ఉత్తరప్రదేశ్‌లో తాము అందిస్తున్న 'డబుల్ ఇంజన్' ప్రభుత్వం వల్లే ఆ రాష్ట్రం ఇప్పుడు దేశంలోనే నంబర్ వన్‌గా మారిందని ఆయన ఎంతో ఆత్మవిశ్వాసంతో, చిరునవ్వుతో ప్రకటించడం నన్ను తీవ్ర ఆశ్చర్యానికి గురిచేసింది. కానీ వాస్తవ పరిస్థితులను పరిశీలిస్తే అది ఎంతమాత్రం నంబర్ వన్ కాలేదు.

యోగి ఆదిత్యనాథ్ చేసిన ఆ ప్రసంగంలో నన్ను ప్రధానంగా ఆకర్షించిన అంశం ఏమిటంటే, ఆయన తన 'డబుల్ ఇంజన్' ప్రభుత్వం గురించి పదేపదే చేసిన ప్రస్తావన. ఎందుకంటే, ప్రస్తుతం దేశంలో అత్యంత ఆదర్శవంతమైనవిగా, పారదర్శక మైనవిగా ప్రచారం చేయబడుతున్న ఇటువంటి రాష్ట్రా ల నుంచే ఈ మధ్య కాలంలో అతిపెద్ద అవినీతి కథనాలు మరియు స్కాములు వెలుగులోకి వస్తున్నాయి. ఉదాహరణకు అయోధ్యలోని అత్యంత ప్రతిష్టాత్మకమైన రామాలయ నిర్మాణం నేరుగా 'బుల్డోజర్ బాబా' అని పిలవబడే యోగి ఆదిత్యనాథ్ ప్రత్యక్ష పర్యవేక్షణలోనే జరిగింది.

అలాంటప్పుడు, దేశవిదేశాల నుండి సామాన్య భక్తులు పూర్తి విశ్వాసంతో, భక్తిశ్రద్ధలతో స్వామివారికి సమర్పించిన కానుకల నుండి బంగారం, వెండి, ఖరీదైన ఆభరణాలు మరియు కోట్ల రూపాయల నగదు లూటీ అవు తున్నాయనే చిన్నపాటి అనుమానం లేదా సమాచారం కూడా పాలకులకు రాకపోవడం నిజంగా అత్యంత అసాధారణమైన విషయం. ఆలయ నిధులను రక్షించాల్సిన ట్రస్టీలు కూడా అక్కడ అంత పెద్ద ఎత్తున ఏం జరుగుతుందో గమనించలేకపోవడం అంతే విచిత్రంగా ఉంది. ఆలయానికి వచ్చే కానుకలను, నిధులను వృత్తిపరమైన సంస్థల చేత లెక్కించాలని ఎప్పుడో నిపుణులు ఇచ్చిన సలహాను వారు




ఎందుకు పక్కన పెట్టారో ఇప్పుడు సమాజానికి సమాధానం చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రస్తుతం దేశంలో వెలుగుచూస్తున్న ఇలాంటి అన్ని కేసుల్లో మనకు స్పష్టంగా కనిపిస్తున్నది ఒకటే.. అది పాలకులలో ఉన్న నేరపూరితమైన విషయాల పట్ల జవాబుదారీతనం లేకపోవడమే.

ఇక విద్యావ్యవస్థ విషయానికి వస్తే, గత వారం మరో యువ భారతీయ విద్యార్థి నీట్ ప్రవేశ పరీక్షలో జరిగిన అక్రమాలను తట్టుకోలేక, మళ్లీ ఆ పరీక్షను ఎదుర్కొనే ధైర్యం లేక ఆత్మహత్య చేసుకుని బలయ్యాడు.

గత ఐదేళ్ల కాలంలో కేవలం ఈ నీట్ పరీక్ష గందరగోళం కారణంగా దేశవ్యాప్తంగా దాదాపు వంద మందికి పైగా విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుని ప్రాణాలు కోల్పోగా, గత ఏడాదిలోనే అత్యధికంగా మరణాలు సంభవిం చడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. దేశంలోని పరీక్షల వ్యవస్థలో జరిగిన ఈ ఘోరమైన గందరగోళానికి, అవకతవకలకు కేంద్ర విద్యాశాఖ మంత్రిదే ప్రత్యక్ష బాధ్యత కాబట్టి ఆయన తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేయడం పూర్తిగా సమంజసమైనదే.

ప్రస్తుత విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేయాలనే ప్రధాన డిమాండ్‌తోనే ప్రతిపక్షాలు గత వారం అంతా జంతర్ మంతర్ వద్ద తీవ్రమైన ఎండలను సైతం లెక్కచేయకుండా నిరసనలు చేస్తూ గడిపారు. కానీ, శుక్రవారం నాడు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సోషల్ మీడియాలో విద్యాశాఖ మంత్రికి పోస్ట్ చేసిన ఆత్మీయ పుట్టినరోజు శుభాకాంక్షలను బట్టి చూస్తే, ఆయనను పదవి నుంచి తొలగించే లేదా ఆయన రాజీనామాను కోరే అవకాశాలు చాలా తక్కువగా ఉన్నాయని స్పష్టమవుతోంది.

ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారతదేశ పౌరులుగా, మనకు సేవకులుగా ఉండాల్సిన ప్రజాప్రతినిధుల నుండి మరియు ప్రభుత్వం నుండి పూర్తి జవాబుదారీతనాన్ని డిమాండ్ చేసే సంపూర్ణ హక్కు మనకు ఉంది. కానీ, తనను తాను నిరంతరం 'ప్రధాన్ సేవక్' (ప్రధాన సేవకుడు) అని పిలుచుకునే దేశ ప్రధాని, తన సొంత మంత్రులు మరియు వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు చూపిస్తున్న ఇటువంటి బాధ్యతారాహిత్యం వల్ల దేశ ప్రతిష్ట ఎంతగా దెబ్బతింటుందో గమనించలేకపోవడం విచారకరం.

ముంబైలో విధానసభ బడ్జెట్ సమావేశాలు జరుగు తున్నప్పుడు ప్రజాప్రతినిధులు, మంత్రులు సామాన్యులకు అందుబాటులో ఉండకుండా అత్యంత విలాసవంతమైన ఒబెరాయ్ హోటల్లో విడిది చేస్తారనే విషయం, దేశంలో అవినీతి ఇప్పుడు ఎంత బహిరంగంగా ప్రదర్శించబడుతుందో ప్రధాని నరేంద్ర మోడీగారికి తెలుసా? దీనికి అంతటికీ ఎవరు డబ్బులు చెల్లిస్తున్నారు, ఎందుకు చెల్లిస్తున్నారు? ఒకవేళ మీరు మర్చిపోయి ఉంటే ఇక్కడ గుర్తుచేస్తున్నాను.. ప్రస్తుతం మహా రాష్ట్రలో నడుస్తున్నది కూడా మరొక డబుల్ ఇంజన్ ప్రభుత్వమే.

ప్రస్తుత రోజుల్లో అవినీతిపరులైన రాజకీయ నాయకులు దేశంలో ఎంతగా పెరిగిపోయారంటే, ప్రధానమంత్రి మోదీ ఎప్పుడో అధికారంలోకి రాకముందు ఇచ్చిన 'నా ఖాంగా, నా ఖానే దూంగా' (నేను అవినీతికి పాల్పడను, ఇతరులను కూడా అవినీతి తిననివ్వను) అనే హామీని ఆయన నిలబెట్టుకుంటారని ప్రజలు ఆశించడం ఎప్పుడో మానేశారు. దాదాపు పన్నెండేళ్ల క్రితం కేంద్రంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ లోక్‌సభ ఎన్నికల్లో ఘోరంగా ఓడిపోవడానికి అప్పట్లో జరిగిన అవినీతి స్కాములే ప్రధాన కారణం, అందుకే మోదీ ఇచ్చిన ఈ అవినీతి రహిత హామీ ఆనాడు ఎన్నికల్లో దేశ ప్రజలపై అంత శక్తివంతమైన ప్రభావాన్ని చూపించింది. ఆ ప్రభావం తదనంతర కాలంలో మసకబారినట్లు కనిపిస్తుంది. దేశంలో ఏదైనా కొత్త అవినీతి కథనం లేదా స్కామ్ బయట

పడినప్పుడు, దానిపై వివరణ ఇవ్వాల్సింది పోయి.. గతంలో కాంగ్రెస్ హయాం ఇంతకంటే ఘోరంగా ఉండేదని, అప్పట్లో ఇన్ని స్కాములు జరిగాయని బిజెపి అధికార ప్రతినిధులు ఎందుకు అంత వ్యంగ్యంగా, బాధ్యతారాహిత్యంగా సమాధానం ఇస్తున్నారు? ఒకవేళ మధ్య ప్రదేశ్ ముఖ్యమంత్రి తనపై వచ్చిన ఆరోపణలకు గౌరవప్రదంగా రాజీనామా చేయాల్సి వస్తే, ఆస్తుల వివరాలు అత్యంత రహస్యంగా మరియు అనుమానాస్పదంగా ఉన్న కర్ణాటక ముఖ్యమంత్రి కూడా రాజీనామా చేయాలి కదా అని ఒకరిపై ఒకరు బురద చల్లుకుంటూ ఎందుకు వాదిస్తున్నారు? వీటన్నిం టినీ గమనిస్తే ఒక నిజం స్పష్టమవుతోంది..

ప్రస్తుత సమాజంలో అతి త్వరగా, ఎలాంటి కష్టం లేకుండా అత్యంత సంపన్నులు కావడానికి రాజకీయాల్లోకి ప్రవేశించడం కంటే సులువైన మార్గం మరొకటి లేదు. దేశంలోని చాలా మంది పెద్ద రాజకీయ నాయ కులు తమ వృద్ధాప్యంలో కూడా అధికారాన్ని పట్టుకుని వదల కుండా ఉండటానికి మరియు తమ తర్వాత తమ పిల్లలు, వార సులు కూడా రాజకీయాల్లోకే వచ్చేలా చూసుకోవడానికి ప్రధాన కారణం, ఈ రంగంలో చాలా సులభంగా, కోట్లాది రూపాయల నల్లధనాన్ని సంపాదించ వచ్చనే పచ్చి నిజమే.


అయితే, ఈ విధమైన అవినీతి సంస్కృతి అనేది హిందుత్వ నాయకులు దేశ బాధ్యతలు చేపట్టినప్పటి నుండి మాత్రమే కొత్తగా జరుగుతున్నది ఏమీ కాదు. కానీ నరేంద్ర మోదీ మొదటిసారి దేశ ప్రధానమంత్రి అయినప్పుడు, దశాబ్దాలుగా వస్తున్న ఈ అసహ్యకరమైన, కుళ్ళిపోయిన రాజకీయ సంస్కృతిని ఆయన మారుస్తారని దేశంలోని సామాన్య ప్రజల్లో ఒక గొప్ప ఆశ కలిగింది. ఆ తరువాత నాయకులు అంతా నీతులు చెప్పేవారేనన్న తత్వం బోధపడింది.

కానీ ఆయన తన పదేళ్ల పాలనలో దీనిని మార్చలేకపోవడం అనేది ఆయన ప్రభుత్వ అతిపెద్ద వైఫ ల్యాలలో ఒకటిగా నిలిచిపోతుంది. ఉజ్జయినిలో జరిగిన అక్రమ భూవ్యవహారాలపై గత వారం ఈ పత్రికలో వచ్చిన పరిశోధనాత్మక కథనం లాంటి నిజాలను ధైర్యంగా బయటపెట్టడానికి ఈ రోజుల్లోని మెయిన్ స్ట్రీమ్ మీడియా కూడా పాలకులకు లొంగి పోయింది. చాలా కాలం తర్వాత జర్నలిజం విలువలను కాపా డుతూ వచ్చిన అద్భుతమైన పరిశోధనాత్మక కథనం అది.

**- వెంక గారి భూమయ్య**
9848559863

# మనిషి మారకపోతే మార్క్స్ ఏంచేస్తాడు..?

ఈ దేశంలో ఒక విచిత్రమైన అలవాటు ఉంది.సమాజంలో సమస్యలు కనిపించినప్పుడల్లా మనం పరిష్కారం కోసం ఒక మహానుభావుడిని వెతుకుతాం. ఒకరు బుద్ధుడిని తీసుకొస్తారు. మరొకరు అంబేద్కరును చూపిస్తారు. ఇంకొకరు మార్క్స్‌ను ముందుకు తెస్తారు. వారందరూ గొప్పవారే. వారి ఆలోచనలు మానవ చరిత్రను ప్రభావితం చేశాయి. కానీ ఒక ప్రశ్న మాత్రం ఎప్పుడూ అడగబడదు. 'బుద్ధుడు ఉన్నాడు. అంబేద్కర్ ఉన్నాడు.మార్క్స్ ఉన్నాడు. మరి మనం ఇంకా ఎందుకు మారలేదు'?. ఈ ప్రశ్నకు సమాధానం వెతకకుండా మరొక మహానుభావుడి కోసం ఎదురు చూడడం అనేది చీకట్లో పోగొట్టుకున్న తాళం చెవిని వెలుతురు ఉన్నచోట వెతకడం లాంటిది. మన దేశంలో సిద్ధాంతాల కొరత కాదు. ప్రపంచంలో మరేదేశానికి లేనంత సిద్ధాంత సంపద మనదగ్గర ఉంది. మతాలు ఉన్నాయి. తత్వాలు ఉన్నాయి. విప్లవ గ్రంథాలు ఉన్నాయి. రాజ్యాంగం ఉంది. ఉద్యమాల చరిత్ర ఉంది. అయినప్పటికీ అన్యాయం ఉంది. అసమానత ఉంది.ద్వేషం ఉంది. దోపిడీ ఉంది. కులం ఉంది. మత వివక్షకు కూడా ఉంది. అంటే సమస్య ఎక్కడో వేరేచోట ఉంది. మనిషి ఒక ఆశ్చర్యక రమైన జీవి. అతడు స్వేచ్ఛ గురించి మాట్లాడు తాడు. కానీ తనకు అవకాశం దొరికితే ఇతరులను నియంత్రించాలని చూస్తాడు. సమానత్వం గురించి ఉపన్యాసాలు ఇస్తాడు. కానీ తనకు ఉన్న ప్రత్యేక హక్కులను వదులుకోవడానికి సిద్ధపడడు. న్యాయం గురించి గట్టిగా మాట్లాడతాడు. కానీ



తనకు లాభం కలిగించే అన్యాయాన్ని మాత్రం మౌనంగా సమర్థిస్తాడు. ఇదే మానవ వైరుధ్యం.

బుద్ధుడు మనిషిలోని దుఃఖాన్ని చూశాడు అంబేద్కర్ కుల ఆధిపత్యాన్ని చూశాడు. మార్క్స్ ఆర్థిక దోపిడిని చూశాడు. కానీ ఈ ముగ్గురి ఆలోచనలు కూడా తమ స్వార్థానికి అనుగుణంగా మార్చుకునే మనిషి 'మనస్తత్వాన్ని'(విప్లవం ఓడిపోయే చోటు) మనం ఇంకా పూర్తిగా అర్థం చేసుకోలేదు. అధ్యయనం చేసే ప్రయత్నమూ చేయడం లేదు. అందుకే చరిత్రలో ఒక విచిత్రమైన దృశ్యం కనిపిస్తుంది. విప్లవం కోసం పోరాడిన వ్యక్తి అధికారంలోకి వచ్చిన తరువాత అధికార భాషనే మాట్లాడుతాడు. సమానత్వం కోసం పోరాడిన నాయకుడు తన అనుచరుల మధ్య అసమానతలను సహజంగా స్వీకరిస్తాడు. తన శత్రువును సులభంగా గుర్తిస్తాడు కానీ తనలోని అహంకారాన్ని గుర్తించలేడు. తనకు జరిగిన అన్యాయాన్ని జీవితాంతం గుర్తుంచుకుంటాడు కానీ తాను చేసిన అన్యాయాన్ని మరుసటిరోజే మర్చిపోతాడు. తనను అణిచివేసే వ్యవస్థను విమర్శిస్తాడు. కానీ తాను ఇంకొకరిపై చూపుతున్న ఆధిపత్యాన్ని చూడలేడు. అణచివేతకు వ్యతిరేకంగా పోరాడిన ఉద్యమమే కొన్నిసార్లు తనలోనీ భిన్నాభిప్రాయాలను అణచి వేస్తుంది. అంటే సమస్య సిద్ధాంతంలో లేదు సమస్య సిద్ధాంతాన్ని ఉపయోగిస్తున్న మనసులో ఉంది. అందుకే సమాజ మార్పు గురించి మాట్లాడేటప్పుడు మనం కేవలం రాజకీయాలను, కులాన్ని, ఆర్థిక వ్యవస్థను మాత్రమే చర్చిస్తున్నాం. కానీ అన్నింటిని నడిపిస్తున్న మనస్తత్వాన్ని గురించి తక్కువగా మాటాడుతున్నాం. ప్రపంచ చరిత్రలో జరిగిన అనేక ఘర్షణలు కేవలం ఆర్థిక, మత కారణాల వల్ల మాత్రమే జరగలేదు. మనిషి తన గుర్తింపును కాపాడుకోవాలనే భయం,తన గుంపును గొప్పదిగా భావించాలనే కోరిక, ఇతరుల కంటే పై చేయిగా ఉండాలనే మనస్తత్వం కూడా వాటికి కారణమయ్యాయి. ఈ సత్యాన్ని గుర్తించకుండా కేవలం సిద్ధాంతాలను అమలు పరచడం ద్వారా సమాజాన్ని మార్చగలమని భావించడం ఒక భ్రమ. ఈ దేశంలో చాలామంది మహానుభావులను చదువరు. వారిని పూజిస్తారు. ఆలోచనలను విశ్లేషించరు. వాటిని నినాదాలుగా మార్చుకుంటారు. ప్రశ్నించరు. విశ్వసిస్తారు. ఫలితంగా సిద్ధాంతం ఒక మతంగా మారుతుంది. నాయకుడు ఒక దేవుడిగా మారుతాడు. ఏ సిద్ధాంతమైన విమర్శనాత్మక అధ్యయనం నుంచి ఆరాధన దశలోకి వెళ్ళినప్పుడు అది తన విముక్తి శక్తిని కోల్పోతుంది. తద్వారా ఆలోచన ఆగినచోట మార్పు కూడా ఆగిపోతుంది.

అందుకే ఈ దేశానికి కావలసింది మరో బుద్ధుడు కాదు. మరో అంబేద్కర్ కాదు. మరో మార్క్స్ కాదు. వారందరి నుండి నేర్చుకుంటూనే వారందరినీ ప్రశ్నించగలిగే ఒక కొత్త మేధో సంస్కృతి. తన కులాన్ని, తన మతాన్ని, తన రాజకీయ నాయకుడిని,అవసరమైతే తనను తాను కూడా ప్రశ్నించగలిగే వ్యక్తి.

ఎందుకంటే రాజకీయ, ఆర్థిక,సామాజిక విపవాలు అనేవి ప్రభుత్వాలను, సంపద పంపిణీని, సంబంధాలను మార్చవచ్చు నేమోగాని మనిషి తనను తాను 'పరిశీలించడం' ప్రారంభించిన రోజే అసలు విప్లవం మొదలవు తుంది.

**- ఆయిరబోయిన బిక్షపతి**
79932 48717

# చరిత్రను మలుపు తిప్పే మహాశక్తులు



చరిత్ర పుటలను తిరగేస్తే ప్రతి గొప్ప మార్పు వెనుక ఒక ప్రజా ఉద్యమం ఉన్నట్లు కనిపిస్తుంది. భారతదేశ స్వాతంత్ర్య సంగ్రామం నుండి, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం వరకు, నక్సల్బరీ నుండి నేటి ప్రజాస్వామ్య పరిరక్షణ పోరాటాల వరకు, ప్రతి సందర్భంలోనూ ప్రజల సంఘటిత శక్తి వ్యవస్థల పునాదులను కదిలించింది. ఒక విప్లవ ప్రస్థానంలో ప్రజాఉద్యమాలు అనేవి కేవలం గొంతుకలు మాత్రమే కాదు, అవి సమాజంలోని అన్యాయాలను ఎదిరించే చారిత్రక ఆయుధాలు.

చాలామంది ప్రజా ఉద్యమాలను కేవలం రోడ్ల మీద చేసే ఆందోళనలుగా, ట్రాఫిక్ జామ్లుగా చూస్తుంటారు. కానీ, వాస్తవానికి ఉద్యమం అంటే సమాజంలో ఉన్న ఒక లోపాన్ని గుర్తించి, దానిపై చర్చను లేవనెత్తి, పాలకవర్గాలను జవాబుదారీని చేయడం. ఇది ప్రజల చైతన్యాన్ని పెంచుతుంది. ఒక వ్యక్తి తన సమస్య కేవలం తనది మాత్రమే కాదు, అది ఒక సామాజిక సమస్య అని గ్రహించిన క్షణమే ఉద్యమం మొదలవుతుంది. ఎన్నికల ద్వారా వచ్చిన ప్రభుత్వం ఏమైనా చేయవచ్చని భావించడం ప్రజాస్వామ్యానికి ప్రమాదం. పాలకుల అహంకారానికి, అప్రజాస్వామిక చట్టాలకు బ్రేక్ వేసే శక్తి ఒక్క ప్రజా ఉద్యమాలకే ఉంటుంది. పౌర హక్కులు, కార్మిక చట్టాలు, విద్యా హక్కులన్నీ ప్రభుత్వాలు దానంతట అవి ఇచ్చినవి కావు, ప్రజా ఉద్యమాల ఒత్తిడి వల్ల సామాన్యుడు సాధించుకున్న హక్కులు. అందుకే, ఉద్యమాలు లేని ప్రజాస్వామ్యం, ఊపిరి లేని శరీరం వంటిది.

ప్రజా ఉద్యమాలలో విజయం ఎప్పుడు వస్తుందంటే, అక్కడ విశాల ఐక్యత ఏర్పడినప్పుడు. వర్గం, కులం, మతం, ప్రాంతాల కంచెలను దాటి సామాన్య ప్రజలందరూ ఒకే వేదికపైకి వచ్చినప్పుడు పాలకుల గుండెల్లో రైళ్లు పరిగెడతాయి. నేడు లిబరేషన్ వంటి శక్తులు చేస్తున్న ప్రయత్నం అదే, కార్మికులను, రైతులను, దళితులను, మేధావులను, మహిళలను మరియు యువతను ఒకే ప్రజాస్వామ్య గొడుగు కిందకు తేవడం. ఈ ఐక్యత మాత్రమే ఫాసిజం వంటి పెను సవాళ్లను ఎదుర్కోగలదు. నక్సల్బరీ తిరుగుబాటు మనకు నేర్పిన పాఠం ఎంతటి శక్తివంతమైన వ్యవస్థనైనా, ప్రజలు తమ హక్కుల కోసం నిలబడితే వణకక తప్పదు. నేడు మన ముందున్న సవాళ్లు వేరు కావచ్చు, కానీ పోరాడే మార్గం అదే. మతోన్మాదం, కార్పొరేట్ దోపిడీ, నిరుద్యోగం వంటి సవాళ్లను ఎదుర్కోవడానికి మనం నిరంతర ప్రజా ఉద్యమాలను నిర్మించాలి. ఏదో ఒక రోజు మార్పు వస్తుందని వేచి చూడటం కంటే, ఆ మార్పులో భాగస్వాములు కావడం గొప్ప విషయం. చరిత్రను చదవడం కాదు, చరిత్రను నిర్మించడం యువత కర్తవ్యం. ఆ నిర్మించే ప్రక్రియే ఈ ప్రజా ఉద్యమాలు. మీరు ఇల్లు వదిలి బయటకు రావచ్చు, సోషల్ మీడియాలో గళమెత్తవచ్చు, లేదా క్షేత్రస్థాయిలో సమస్యలపై చర్చించవచ్చు, ప్రతి చిన్న అడుగు ఒక ఉద్యమానికి పునాది. మన గమ్యం ఒక్కటే.. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వంతో కూడిన నవ భారతం. ఆ గమ్యం వైపు సాగే ప్రతి అడుగులో మనం సంఘటితమై ఉందాం.

**- మామిండ్ల రమేష్ రాజా**
7893230218

# ప్రజాస్వామ్య పరిరక్షణ.. సవాళ్లు




ప్రపంచ రాజకీయ చరిత్రలో ప్రజాస్వామ్యం అత్యంత విలువైన వ్యవస్థగా పరిగణించ బడుతోంది. ప్రజల ప్రాతినిధ్యంతో నిర్మితమయ్యే పాలన, వారి గొంతుకను వినిపించే వేదికగా పార్లమెంటులు రూపు దిద్దుకున్నాయి. ప్రజాస్వామ్య మూలాల పరిరక్షణ, పారదర్శక పాలన, బాధ్యతా యుతమైన వ్యవస్థ కోసం ప్రపంచ దేశాలు అనుసరిస్తున్న పార్లమెంటరీ విధానం ఓ సుదీర్ఘ ఆచార సంప్రదాయంగా రూపాంతరం చెందింది. ఈ వ్యవస్థకు గల ప్రాధాన్యతను గుర్తించేందుకు ప్రతి సంవత్సరం జూన్ 30న అంతర్జాతీయ పార్లమెంటరీ దినోత్సవాన్ని జరుపు కుంటారు. ఈ సందర్భంగా పార్లమెంటుల ప్రాముఖ్యత, వాటి పాత్ర, ప్రజల భాగస్వామ్యం వంటి అంశాలపై ప్రపంచ వ్యాప్తంగా చర్చలు, సమీక్షలు జరుగుతాయి.

ఈ దినోత్సవానికి మూలాలుగా 1889లో స్థాపించబడిన ఇంటర్ పార్లమెంటరీ యూనియన్ నిలిచింది. ప్రపంచం లోని వివిధ దేశాల శాసన సభల మధ్య సంబంధాలను మెరుగు పరచడానికి, చర్చా సంస్కృతిని ప్రోత్సహించేందుకు, ప్రజాస్వామ్య విలువలను వ్యాప్తి చేయడానికే ఈ సంఘం ఏర్పడింది. జెనీవాలో స్థాపితమైన ఈ యూనియన్ ప్రారంభంలో మిగతా దేశాల దృష్టిలో ఓ భావ పూర్వక ప్రయత్నంలా కనిపించినా, కాలక్రమేణా ఇది ఓ ప్రపంచ స్థాయి సంస్థగా ఎదిగింది. 2018లో ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ ఈ తేదీకి అధికారిక గుర్తింపు ఇస్తూ జూన్ 30ను అంతర్జాతీయ పార్లమెంటరీ దినంగా ప్రకటించింది. ఈ నిర్ణయం ద్వారా పార్లమెంటరీ వ్యవస్థల పాత్రకు, వాటి ప్రజాస్వామ్య బలోపేతానికి జరుగుతున్న కృషికి గౌరవం దక్కింది. పార్లమెంట్లు ప్రజల ఆకాంక్షలకు ప్రతినిధులుగా నిలిచే ప్రధాన వేదికలు. చట్టాలు రూపొందించడం, పాలకులను సమీక్షించడం, నిధుల వినియోగంపై పర్యవేక్షణ చేయడం వంటి కీలకమైన విధులను నిర్వర్తిస్తూ, పాలనా యంత్రాంగాన్ని ప్రజల పక్షాన నియంత్రించే సాధనంగా పార్లమెంటు వ్యవస్థ ఉంటుంది. ప్రతి దేశంలోనూ రాజకీయ భిన్నాభిప్రాయాలకు చోటిచ్చే ఒకే ఒక్క వేదికగా పార్లమెంటు వ్యవస్థ పనిచేస్తుంది. అందుకే ఇది ప్రజాస్వామ్యానికి ప్రాణ వాయువుగా నిలుస్తుంది. ప్రపంచ వ్యాప్తంగా కొన్ని దేశాల్లో రెండు సభల వ్యవస్థ అమలులో ఉంది. ఉదాహరణకు భారత దేశంలో లోకసభ, రాజ్య సభలు సమిష్టిగా పార్లమెంటు వ్యవస్థగా పనిచేస్తాయి. అమెరికాలో హౌస్ ఆఫ్ రిప్రజెంటేటివ్స్, సెనేట్ అనే రెండు సభలు ఉన్నాయి. మరోవైపు నార్వే, బాంగ్లాదేశ్ వంటి కొన్ని దేశాల్లో ఒకే సభతో కూడిన పార్లమెంటు వ్యవస్థ (యూని క్యామెరల్) అమలులో ఉంది. ఏ రూపంలో ఉన్నా, పార్లమెంటు వ్యవస్థలు ప్రజల గళంగా మారి, వారి హక్కులను, అవసరాలను, సమస్యలను ప్రభుత్వానికి చేరవేసే వేదికలుగా పనిచేస్తున్నాయి. భారత దేశంలో పార్లమెంటు మూడు భాగాలతో నిర్మితమైంది - రాష్ట్రపతి, లోకసభ, రాజ్యసభ. ప్రపంచం లోనే అతిపెద్ద ప్రజాస్వామ్యంగా భారత దేశానికి ఉన్న గుర్తింపు ఈ పార్లమెంటు వ్యవస్థ వల్లే సాధ్యమైంది. నిత్యం నూతన చట్టాల రూపకల్పన, బడ్జెట్ ఆమోదం, పాలకులు చేపడుతున్న విధానాల సమీక్ష - ఇవన్నీ పార్లమెంటు వేదికల పైనే జరుగు తున్నాయి. పార్లమెంటరీ చర్చలు, ప్రశ్నోత్తరాల ద్వారా ప్రజల గోడులను ప్రభుత్వ దృష్టికి తీసుకురావడం జరుగుతోంది. ఈ సందర్భంలో పార్లమెంటుల బాధ్యత మరింత పెరుగుతోంది. నేటి వేగవంతమైన ప్రపంచంలో వాతావరణ మార్పులు, ఆర్థిక అసమానతలు, వలసల సమస్యలు, సాంకేతిక విప్లవం, సామాజిక విభేదాలు వంటి ఎన్నో సవాళ్లు దేశాలను ఎదుర్కొంటున్నాయి. ఈ సవాళ్లకు సమగ్రంగా స్పందించగల సామర్థ్యం ఉన్న ఏకైక ప్రజాస్వామ్య వేదిక పార్లమెంటే. ప్రజల అవసరాలను నేరుగా ప్రతిబింబించే శక్తి ఉన్న సంస్థ ఇది. చర్చ, సంప్రదింపుల ద్వారా సామరస్యాన్ని, శాసన ప్రక్రియల ద్వారా అభివృద్ధిని, పాలనా సమీక్షల ద్వారా సమర్థతను సాధించగల శక్తి పార్లమెంటులో దాగి ఉంది. ఇప్పటి పరిస్థితుల్లో పార్లమెంటు వ్యవస్థలను మరింత పారదర్శకంగా, సమర్థ వంతంగా తీర్చిదిద్దడం అత్యవసరం. ప్రజల నమ్మకాన్ని మరింత బలపరిచే విధంగా సంస్కరణలు చేయాల్సిన అవసరం ఏర్పడింది. సమాచార హక్కు, డిజిటల్ పార్లమెంటు, ప్రత్యక్ష ప్రసారాల ద్వారా ప్రజలకు పార్లమెంటు పనితీరును నేరుగా చూపించడం వంటివి సరికొత్త మార్గాలు. యువత, మహిళలు, సామాజికంగా వెనుకబడిన వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించడం ద్వారా ప్రజాస్వామ్య స్వరూపానికి మరింత విశాలత ఇవ్వవచ్చు. రాజకీయాల్లో పారదర్శకత, నైతికత, ప్రజాభిముఖత పెరగాలంటే పార్లమెంటు వ్యవస్థలు బాధ్యతాయుతంగా నడవాల్సిన అవసరం ఉంది. జూన్ 30ను పురస్కరించుకొని ప్రపంచ వ్యాప్తంగా పార్లమెంట్లు ఆత్మ విమర్శ చేసుకోవాలి. అవి నిజంగా ప్రజల మద్దతుతో పని చేస్తున్నాయా? వాటిలో ప్రజల గొంతుకలు వినిపిస్తున్నాయా? ప్రజాస్వామ్య విలువలు ప్రతిఫలిస్తున్నాయా? అనే ప్రశ్నల సమాధానాల కోసం కార్యాచరణలు రూపొందించాలి. ఈ దినోత్సవం కేవలం ఉత్సవంగా కాక, ప్రజాస్వామ్య పునరాలోచనకు అవకాశంగా మారాలి. ప్రజలు తమ ప్రతినిధులను ఎన్నుకునే ప్రక్రియ కేవలం ఓటుతో ముగియ కూడదు. వారిని పట్టించుకునే స్థాయికి ప్రజల భాగస్వామ్యం చేరాలి. పార్లమెంటు వ్యవస్థలు ప్రజల హక్కుల పరిరక్షణకు గట్టి కవచాలు కావాలి. ప్రతీ పౌరుడి గొంతుక, ఆశయం, అభిప్రాయానికి అర్థవంతమైన ప్రాతినిధ్యాన్ని కల్పించడమే పార్లమెంటరీ వ్యవస్థల అసలైన లక్ష్యం. జూన్ 30 - అంతర్జాతీయ పార్లమెంటరీ దినోత్సవం మనకు ఈ మార్గాన్ని గుర్తుచేస్తూ, దానిపై నడవాల్సిన కర్తవ్యం ఒప్పించే సందేశ దినంగా నిలుస్తోంది.

**జూన్ 30...అంతర్జాతీయ పార్లమెంటరీ దినోత్సవం**

**- రామ కిష్టయ్య సంగన భట్ల**
9440595494

## 95 శాతం ఈ.ఎఫ్. పత్రాల పంపిణీ పూర్తి

- విశాఖ జిల్లాలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం వేగవంతం: జిల్లా కలెక్టర్

విశాఖపట్నం, జూన్ 29: విశాఖ జిల్లాలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా ఎన్యూమరేషన్ ఫారాల (ఈ.ఎఫ్.) పంపిణీ ప్రక్రియ వేగంగా కొనసాగుతోందని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ తెలిపారు. జిల్లాలో మొత్తం 20,23,009 మంది ఓటర్లకు గాను ఇప్పటివరకు 19,24,480 మందికి ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణీ చేయడం ద్వారా 95.13 శాతం పంపిణీ పూర్తయిందని వెల్లడించారు. జిల్లాలోని 1,980 పోలింగ్ కేంద్రాల పరిధిలో బీఎల్వోలు ఇంటింటికీ వెళ్లి ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాలను అందజేస్తూ, వాటిని తిరిగి సేకరించే ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహిస్తున్నారని తెలిపారు.

నియోజకవర్గాల వారీగా పరిశీలిస్తే పెందుర్తిలో 97.65 శాతం, గాజువాకలో 96.82 శాతం, విశాఖ ఉత్తరంలో 95.94 శాతం, విశాఖ దక్షిణంలో 95.55 శాతం, విశాఖ తూర్పులో 93.93 శాతం, విశాఖ పశ్చిమంలో 93.33 శాతం, భీమిలిలో 92.56 శాతం ఈ.ఎఫ్. పత్రాల పంపిణీ పూర్తయిందన్నారు. ఇప్పటివరకు జిల్లాలో 2,60,210 ఫారాలు డిజిటైజ్ చేయగా, ఇది మొత్తం ఓటర్లలో 12.86 శాతానికి సమానం అని తెలిపారు. ఫారాల పంపిణీతో పాటు డిజిటైజేషన్ ప్రక్రియను కూడా మరింత వేగవంతం చేయాలని సంబంధిత ఎన్నికల అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

ఎన్యూమరేషన్ ఫారాలు ఇంకా అందుకోని ఓటర్లు లేదా నింపి సమర్పించని వారు తమ బీఎల్వోలకు వీలైనంత త్వరగా ఫారాలను అందజేసి ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమానికి సహకరించాలని జిల్లా కలెక్టర్ ప్రకటన ద్వారా విజ్ఞప్తి చేశారు.

# ప్రతిష్టాత్మక వేడుకకు పటిష్ట ఏర్పాట్లు..

# సమన్వయంతో విజయవంతం

### అధికారులకు దిశానిర్దేశం చేసిన రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత

### పల్లా శ్రీనివాసరావు, జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్తో కలిసి ఏర్పాట్ల పరిశీలన



విశాఖపట్నం, జూన్ 29 : విశాఖ వేదికగా జరగనున్న ప్రతిష్టాత్మక వేడుకకు పటిష్ట ఏర్పాట్లు చేయటంతో పాటు, సమన్వయంతో విజయవంతం చేయాలని రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత అధికారులను ఆదేశించారు. భారత రాష్ట్రపతి మంగళవారం విశాఖపట్నంలో పర్యటించనున్న నేపథ్యంలో నోవాటెల్ హోటల్తో పాటు ప్రధాన కార్యక్రమ వేదిక వద్ద చేపట్టిన ఏర్పాట్లను మంత్రి సోమవారం క్షుణ్ణంగా పరిశీలించారు. ఆమెతో పాటు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్, విశాఖ నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి అధికారులతో మాట్లాడుతూ, కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం తొలి స్నాతకోత్సవంలో దేశ ప్రథమ పౌరురాలు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పాల్గొనడం రాష్ట్రానికి గర్వకారణమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున రాష్ట్రపతికి ఘన స్వాగతం పలికేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు.

జిల్లా యంత్రాంగం, విశాఖ నగర పోలీస్ కమిషనరేట్, కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయ అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టారని మంత్రి పేర్కొన్నారు. కార్యక్రమానికి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, ప్రముఖులు హాజరుకానున్న నేపథ్యంలో ప్రతి అంశాన్ని అత్యంత జాగ్రత్తగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. అధికారులంతా సమష్టి కృషితో ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, రాష్ట్రపతి భవన్ నుంచి జారీ చేసిన ప్రోటోకాల్, భద్రతా మార్గదర్శకాలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని సూచించారు. కార్యక్రమ నిర్వహణలో ఎక్కడా చిన్నపాటి లోపం కూడా తలెత్తకుండా అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు.

మంత్రి వంగలపూడి అనిత ముందుగా వి-కన్వెన్షన్ హాలులో ఏర్పాటు చేసిన ప్రధాన కార్యక్రమ వేదికను పరిశీలించారు. అనంతరం గ్రీన్ రూములు, అతిథుల విశ్రాంతి గదులు, భద్రతా ఏర్పాట్లు, ప్రవేశ-నిష్క్రమణ మార్గాలు, ఇతర సౌకర్యాలను తనిఖీ చేసి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడిన మంత్రి, రాష్ట్రపతి పర్యటన విజయవంతంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం అన్ని శాఖల సమన్వయంతో పనిచేస్తోందని తెలిపారు. రాష్ట్రపతి పర్యటనతో పాటు కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం తొలి స్నాతకోత్సవం విజయవంతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆమె కోరారు. జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి, డీసీపీలు లతామాధురి, మణికంఠ, ఆర్డీవోలు దిలీప్ చక్రవర్తి, సంగీత్ మాథుర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ప్రజల సమస్యలపై శాఖాధిపతులు ప్రత్యేక దృష్టి పెట్టాలి

### విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర



విజయవాడ,జూన్,29,(మనం న్యూస్): ప్రజల నుండి వచ్చే ప్రతి ఫిర్యాదును బాధ్యతగా స్వీకరించి, క్షేత్రస్థాయిలో పరిశీలించి శాశ్వత పరిష్కారం అందించాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్లో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో కమిషనర్ పాల్గొని ప్రజల వినతులను స్వీకరించారు.

ప్రధాన కార్యాలయంతో పాటు జోనల్ కార్యాలయాల్లో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల కార్యక్రమాలను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిన కమిషనర్, గతంలో వచ్చిన ఫిర్యాదుల పరిష్కార స్థితిని శాఖాధిపతులతో చర్చించారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే సమస్యలను ఆలస్యం చేయకుండా వెంటనే పరిష్కరించాలని సూచించారు. మున్సిపల్ సేవల కోసం రూపొందించిన పురమిత్ర యాప్లో నమోదవుతున్న ఫిర్యాదులను కూడా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని తెలిపారు.

ప్రజలు ఇచ్చిన ఫిర్యాదులను ఒక శాఖ నుండి మరో శాఖకు మళ్లించడం కాకుండా, సంబంధిత అధికారులు స్వయంగా స్పందించి సమస్యలకు పరిష్కారం చూపాలని కమిషనర్ స్పష్టం చేశారు. శాఖలన్నీ పరస్పర సమన్వయంతో పని చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని పేర్కొన్నారు.ఈ సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో మొత్తం 14 ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు. వీటిలో పట్టణ ప్రణాళిక శాఖకు సంబంధించిన అక్రమ నిర్మాణాలు 6, రోడ్ల ఆక్రమణలు వంటి అంశాలపై ఎక్కువ ఫిర్యాదులు నమోదు కాగా, రెవెన్యూ 3, ఇంజనీరింగ్ 3, ఎస్టేట్ శాఖలకు సంబంధించిన 2 ఫిర్యాదులు కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. ప్రతి ఫిర్యాదును అధికారులు స్వయంగా పరిశీలించి, ప్రజలకు స్పష్టమైన మరియు శాశ్వత పరిష్కారం అందించే విధంగా చర్యలు తీసుకుంటామని కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టే విధంగా పారదర్శకంగా, సమర్థవంతంగా పనిచేయాలని అధికారులకు సూచించారు.

ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్లు ఏ. రవీంద్రరావు, డాక్టర్ డి. చంద్రశేఖర్, కె. శకుంతల, చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్, చీఫ్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె. అర్జునరావు, చీఫ్ ఇంజనీర్ (ఇంచార్జ్) సత్యకుమారి, డిప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) సృజన, అకౌంట్స్ ఆఫీసర్ బి. సత్యనారాయణమూర్తి, ఎస్టేట్ ఆఫీసర్ ఏ. శ్రీధర్, డిప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ చంద్రశేఖర్, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ నరేష్, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ డి. హరీష్, బయాలజిస్ట్ సూర్యకుమార్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర మంత్రిమండలిలో మార్పులు?

- వర్షాకాల సమావేశాల్లోపే పునర్ వ్యవస్థీకరణ!
- గవర్నర్లుగా కొందరికి.. పార్టీలో ఇంకొందరికి అవకాశం
- బీజేపీ గూటికి చేరినవారికీ పదవులు
- స్పీకర్ నిర్ణయం కీలకం



ఢిల్లీ, జూన్ 29: కేంద్ర మంత్రిమండలిలో మార్పులు చేర్పులపై ఊహాగానాలు ఊపందుకున్నాయి. ఇలాంటి అంశాలపై చివరి క్షణం వరకు గోప్యత పాటించడం ప్రధాని నరేంద్ర మోదీ ప్రత్యేకత అయినా వివిధ సంకేతాలను బట్టి.. ఇప్పటి నుంచి పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లోగా ఏ క్షణమైనా పునర్వ్యవస్థీకరణ జరగవచ్చని భావిస్తున్నారు. మంత్రిమండలిలో ఇప్పటికే ఖాళీగా ఉన్న, త్వరలో ఖాళీ కాబోతున్న స్థానాలను భర్తీచేయడంతోపాటు తృణమూల్ కాంగ్రెస్, శివసేన (యూబీటీ) వంటి పార్టీల నుంచి చీలికవర్గం ఎంపీలు ప్రత్యేక వర్గాలుగా ఏర్పడి బీజేపీకి మద్దతు ప్రకటిస్తుండటంతో వాటి నుంచీ కొందరికి మంత్రి పదవులు ఇచ్చే అవకాశం ఉంది. బీజేపీ నూతన సారథి నితిన్ నబీన్ జట్టులో కీలకమైన పదవుల్ని కొంతమంది యువ నేతలకు అప్పగించే అవకాశముందని సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే పార్టీ పదవుల జాబితా దాదాపు కొలిక్కి వచ్చింది. కొందరు కేంద్ర మంత్రులతో నబీన్ కొద్దిరోజుల క్రితం చర్చలు జరిపారు. కొత్తవారిని మంత్రులుగా తీసుకోవడం, కొందరి శాఖల్ని మార్చడం వంటి వాటిపై సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. సోమవారం వరకు సీషెల్స్ పర్యటనలో ఉండే ప్రధాని మోడీ తిరిగి జులై 6 నుంచి 11 వరకు విదేశాల్లో ఉంటారు. జపాన్ ప్రధాని సనాయె తకాయిచి జులై 1 నుంచి 3 వరకు మన దేశంలో పర్యటించనున్నారు. అందువల్ల ప్రధాని వెసులుబాటును బట్టి మంత్రిమండలిలో మార్పులు చేపట్టనున్నారు. పశ్చిమ బెంగాల్ నుంచి కొందరు ఎంపీలను మంత్రిమండలిలోకి తీసుకోనున్నారు. షిండే నేతృత్వంలోని శివసేన పార్టీ నుంచి ఒక సీనియర్ నేతకు క్యాబినెట్ మంత్రి పదవి లభించనుందని తెలుస్తోంది. తృణమూల్, శివసేన (యూబీటీ) చీలిక వర్గాల్లో ఎవరికైనా అవకాశం ఇచ్చేముందు స్పీకర్ నిర్ణయం కీలకం కానుంది.

### గవర్నర్లుగా కేంద్ర మంత్రులు!

గవర్నర్లుగా థావర్చంద్ గహ్లోత్ (కర్ణాటక), మంగూభాయ్ పటేల్ (మధ్యప్రదేశ్), గుర్మీత్సింగ్ (ఉత్తరాఖండ్)ల పదవీ కాలం త్వరలో ముగియనుంది. ప్రస్తుత మంత్రుల్లో కొందరిని వీరి స్థానాల్లోకి పంపిస్తారని, ఆ మేరకు మంత్రిమండలిలో యువ రక్తాన్ని తీసుకువస్తారని చెబుతున్నారు. ఆప్ నుంచి విడిపోయి బీజేపీలో చేరుతున్న ఏడుగురు రాజ్యసభ సభ్యుల్లో ఒకరిద్దరికి విస్తరణలో బెర్తులు ఖాయం కానున్నాయి. నీట్ ప్రశ్నపత్రం లీకేజీ, సీబీఎస్ఈ డిజిటల్ మూల్యాంకనంలో తప్పిదాల తర్వాత కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ భవితవ్యం డోలాయమానంలో పడింది. రాజ్యసభ సభ్యులుగా నవంబరులో పదవీకాలం ముగిసిపోతున్న వారిలో కేంద్ర మంత్రులు హర్దీప్సింగ్ పురీ, బి.ఎల్.వర్మ ఉన్నారు. వారికి మరో అవకాశం లభిస్తుందా..లేదా అనేది తేలాలి. పంకజ్ చౌధరీ, హర్ష్ మల్హోత్రాలకు యూపీ, ఢిల్లీ రాష్ట్రశాఖల పార్టీ బాధ్యతల్ని అప్పగించారు. 'ఒకరికి ఒకే పదవి' నిబంధన కింద వీరిద్దరినీ మంత్రివర్గం నుంచి తప్పించేందుకు ఎక్కువ అవకాశాలు కనిపిస్తున్నాయి. జార్జి కురియన్, రవ్నీత్ సింగ్ బిట్టూల రాజ్యసభ పదవీ కాలం ఈ నెల 21న ముగిసింది. మంత్రి పదవికి కురియన్ రాజీనామా సమర్పించారు. పంజాబ్ ఎన్నికలపై దృష్టి పెట్టాల్సిందిగా బిట్టూకు పార్టీ సూచించినట్లు సమాచారం. ఉత్తర్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, పంజాబ్ల నుంచి పలువురికి ఈసారి మోడీ బృందంలో మంత్రులుగా అవకాశం రావచ్చని సమాచారం. ఈ మూడు రాష్ట్రాల్లో వచ్చే ఏడాది శాసనసభ ఎన్నికలు జరగనున్నాయి.



## కేతన్ నుంచి రూ.కోటి తీసుకొని ప్రియుడికి ఇచ్చిన సియా..!

పూణె, జూన్ 29: పూణె యువ వ్యాపారవేత్త కేతన్ అగర్వాల్ హత్య కేసును పోలీసులు భిన్న కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. దీంతో ఎప్పటికప్పుడు కొత్త విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. పెళ్లి షాపింగ్ కోసమంటూ కేతన్ నుంచి నిందితురాలు సియా రూ.కోటి రూపాయలు తీసుకుందని తెలుస్తోంది. తర్వాత ఆ డబ్బును ప్రియుడు చేతన్కు ఇచ్చిందని దర్యాప్తులో భాగంగా వెల్లడైంది. సియా-చేతన్ వేసిన ప్లాన్లో ఇది కూడా భాగమని పోలీసు వర్గాలు వెల్లడించాయి.

సియా-చేతన్.. కేతన్ హత్యకు ప్లాన్ చేయడమే కాకుండా భవిష్యత్ ప్రణాళికలు వేసుకున్నారట. తమ మీద ఎలాంటి అనుమానం రాకుండా చూసుకునేందుకు కేతన్ను అడ్డు తొలగించుకున్న కొన్ని సంవత్సరాల తర్వాత వివాహం చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. తమ ప్లాన్లో భాగంగానే కేతన్ నుంచి సియా రూ.కోటి తీసుకుంది. వివాహ ఖర్చులకు దానిని వాడుకోకుండా చేతన్కు ఆ డబ్బు ఇచ్చింది. తమది ధనిక కుటుంబం కాకపోవడంతో ఆర్థికంగా స్థిరపడేందుకు కనీసం మూడు సంవత్సరాలు పడుతుందని సియాకు చేతన్ చెప్పినట్లు సమాచారం. దీంతో ప్రియుడిని సెటిల్ చేసేందుకే ఆ డబ్బు ఇచ్చిందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి.

## రైతుకు భరోసా.. వ్యవసాయానికి

# పునర్ వైభవం

(మొదటి పేజీ తరువాయి)

అనుబంధ రంగాలపై ఆధారపడి జీవిస్తున్నారని, అందువల్ల వ్యవసాయ రంగానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో తీవ్రంగా దెబ్బతిన్న వ్యవసాయ రంగాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రెండేళ్లలో గాడిలో పెట్టగలిగాం. రైతుకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, సాంకేతిక పరిజ్ఞానం, మార్కెట్ అనుసంధానం వంటి అన్ని అంశాల్లో ప్రభుత్వం సమగ్ర చర్యలు చేపట్టింది. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చి రైతు ఆదాయం పెంచడమే ఎన్డీయే కూటమి ప్రభుత్వ సంకల్పం అని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు.

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో వ్యవసాయం, నీటిపారుదల వంటి కీలక రంగాలు పూర్తిగా నిర్లక్ష్యానికి గురయ్యాయని విమర్శించారు. రైతు భరోసా కింద సంవత్సరానికి రూ.7,500 ఇవ్వడం మినహా రైతుకు ఉపయోగపడే అనేక పథకాలను నిలిపివేశారని, విత్తన కంపెనీలకు వందల కోట్ల రూపాయల బకాయిలు పెట్టి విత్తన సరఫరా వ్యవస్థను దెబ్బతీశారని అన్నారు. గత ప్రభుత్వ బకాయిలను దశలవారీగా చెల్లించి, రాయితీపై రైతులకు నాణ్యమైన విత్తనాలను సబ్సిడీపై అందిస్తున్నామని చెప్పారు. రైతులు సంప్రదాయ సాగు విధానాలతో పాటు మార్కెట్ అవసరాలు, శాస్త్రవేత్తల సూచనలకు అనుగుణంగా పంటల సాగు చేయాలని మంత్రి సూచించారు. ఒక సంవత్సరం ధరలు బాగున్నాయని ఒకే పంటను అధికంగా సాగు చేస్తే మరుసటి ఏడాది ధరలు పడిపోయి రైతులు నష్టపోయే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. మిర్చి, పొగాకు వంటి పంటల విషయంలో గత అనుభవాలు దీనికి నిదర్శనమని పేర్కొన్నారు. అధిక కెమికల్స్ ఉపయోగించడం వలన ఇటీవల చైనాకు వెళ్లిన గుంటూరు మిర్చి కంటైనర్స్ తిరిగి వెనక్కి వచ్చిన సందర్భాలు గుర్తుచేసుకోవాలని తెలిపారు. ఎల్నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపిక చేసుకోవాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. వ్యవసాయ శాఖ కూడా నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ రైతులకు మార్గనిర్దేశం చేస్తోందన్నారు. ఉద్యానవన, పశుసంవర్ధక, మత్స్య, పట్టు పరిశ్రమ, సహకార శాఖలు సమన్వయంతో పనిచేస్తూ ఎల్నినో ప్రభావాన్ని తగ్గించే చర్యలను అమలు చేస్తున్నాయని మంత్రి వెల్లడించారు. రైతులకు అవసరమైన సాంకేతిక సలహాలు, వాతావరణ హెచ్చరికలు, పంటల నిర్వహణ సూచనలు గ్రామ స్థాయి వరకు చేరేలా విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. ఎలాంటి వాతావరణ సవాళ్లు ఎదురైనా రైతులను ఆదుకునేందుకు అవసరమైన అన్ని చర్యలు సిద్ధంగా ఉన్నాయని మంత్రి స్పష్టం చేశారు.

## కేసులకు భయపడేది లేదు

(మొదటి పేజీ తరువాయి)

వేసే ప్రసక్తే లేదని ఎన్టీఆర్ జిల్లా వైయస్సార్సీపీ అధ్యక్షుడు దేవినేని అవినాశ్ స్పష్టం చేశారు. విజయవాడ లోని పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎంతమంది పోలీసులను, గూండాలను, మాఫియా ముఠాలను దించి మాపై దాడులకు ఉసిగొల్పినా రైతుల కోసం మళ్లీ మళ్లీ వస్తూనే ఉంటామని చెప్పారు. అమరావతికి భూములివ్వని రైతులను ప్రభుత్వమే వేధిస్తూ బలవంతపు భూసేకరణకు పాల్పడుతోందని చెప్పారు. రైతులు పడుతున్న ఇబ్బందులు నిజం కాబట్టి, అవి బయటి ప్రపంచానికి తెలియకుండా చేయాలన్న కుట్రతోనే రైతు పరిరక్షణ కమిటీగా వెళ్తున్న మాపై టీడీపీ గూండాలు ఉండవల్లిలో దాడులు చేశారని ధ్వజమెత్తారు. పైగా మేమే రౌడీలతో దాడులకు వెళ్తున్నట్టు ప్రచారం చేయడం సిగ్గుచేటన్నారు. మేము పిలిస్తేనే వైయస్సార్సీపీ నేతలు వచ్చారని పెనుమాక రైతులు ప్రెస్మీట్ పెట్టి చెప్పిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. అమరావతి రాజధాని నిర్మాణం ముసుగులో వేల కోట్ల అవినీతి, భూదోపిడీ జరుగుతోందని.. అమరావతి కోసం విజయవాడ గొంతు పిసికేశారని దేవినేని అవినాశ్ మండిపడ్డారు.

### అమరావతి దోపిడీ వెలుగుచూస్తుందని భయం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో బీహార్ని మించిన జంగిల్ రాజ్ పాలన సాగుతోంది. ప్రభుత్వ దోపిడీ, అరాచకాలను తట్టుకోలేక రైతులు వైయస్ జగన్ గారిని కలిస్తే కూటమి నాయకులు తట్టుకోలేకపోతున్నారు. వైయస్సార్సీపీ రైతు పరిరక్షణ కమిటీ రైతులను కలవాడానికి వెళ్తుంటే అడ్డుకోవడమే అప్రజాస్వామికం అయితే, మా మీదనే దాడులు చేసి తిరిగి మా మీదనే కేసులు పెట్టడం జంగిల్ రాజ్ పాలనకు నిదర్శనం. టీడీపీ గూండాలతోపాటు, మట్టి మాఫియా, ఇసుక మాఫియా ముఠాలతో కూడిన వందల మంది రౌడీలు మాపై దాడికి తెగబడ్డారు. పోలీసులు చట్టాలను ఉల్లంఘించి తెలుగుదేశం పార్టీ కార్యకర్తల్లా వ్యవహరించారు. ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలను ప్రశ్నిస్తుంటే ఓర్చుకోలేకపోతున్నారు. ఎల్లో మీడియా, టీడీపీ సోషల్ మీడియాలో మేం రౌడీలతో వెళ్లినట్టు తప్పుడు ప్రచారం చేస్తున్నారు. పెనుమాక రైతుల ఆహ్వానం మేరకు రైతు పరిరక్షణ కమిటీ సభ్యులం మాత్రమే వెళ్లాం. మేము ఆహ్వానిస్తేనే వైయస్సార్సీపీ కమిటీ వచ్చిందని పెనుమాక రైతులు ప్రెస్మీట్ పెట్టి మరీ చెప్పారు.

## ముంబయిలో భారీ వర్షం..

### జలమయమైన రహదారులు

ముంబయి, జూన్ 29: ముంబయిని భారీ వర్షాలు ముంచెత్తాయి. ఆదివారం రాత్రి కేవలం నాలుగు గంటల్లోనే 100మిల్లీమీటర్ల కంటే ఎక్కువ వర్షం కురవడంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వర్షం ప్రభావంతో సబర్బన్ రైలు సర్వీసులకు అంతరాయం కలగడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. రోడ్లపై నీరు నిలవడంతో పలు చోట్ల ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. వీణా నగర్లో అత్యధికంగా 160.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు బృహన్ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ వెల్లడించింది.

వర్షం కారణంగా అంధేరి ప్రాంతంలోని సబ్వే పూర్తిగా నీట మునిగింది. దీంతో ముందస్తు చర్యగా ఈ అండర్పాస్లో వాహనాల రాకపోకలను నిలిపివేసినట్లు బీఎంసీ వెల్లడించింది. మరోవైపు వాతావరణం అనుకూలంగా లేనందున విమాన సర్వీసులు ఆలస్యంగా నడుస్తున్నాయి. రానున్న కొన్ని గంటల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో వాతావరణ శాఖ పలు ప్రాంతాలకు రెడ్, ఆరెంజ్ అలర్టు జారీ చేసింది.

# శాఖలో నేడు కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం తొలి స్నాతకోత్సవం

### 373 మంది పట్టభద్రులకు డిగ్రీ పట్టాలు.. 13 మందికి బంగారు పతకాల ప్రదానం

### ముఖ్య అతిథిగా విచ్చేస్తున్న భారత రాష్ట్రపతి, హాజరుకానున్న కేంద్ర, రాష్ట్ర మంత్రులు

### విలేకరుల సమావేశంలో ఛాన్సలర్ మదన్ లాల్ మీనా, వైస్ ఛాన్సలర్ టి. శ్రీనివాసన్




విశాఖపట్నం, జూన్ 30 : విశాఖపట్నంలో మంగళవారం కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం తొలి స్నాతకోత్సవం (కాన్వొకేషన్) ఘనంగా నిర్వహించనున్నట్లు విశ్వవిద్యాలయ ఛాన్సలర్ మదన్ లాల్ మీనా, వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ టి. శ్రీనివాసన్ తెలిపారు. సోమవారం స్థానిక దస్పల్లా హోటల్లో సంయుక్తంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు స్నాతకోత్సవానికి సంబంధించిన వివరాలను వెల్లడించారు. 2020 నుంచి 2025-26 విద్యా సంవత్సరాల వరకు వివిధ కోర్సులు పూర్తి చేసిన మొత్తం 373 మంది విద్యార్థులకు డిగ్రీ, పీజీ పట్టాలు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. అలాగే అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 13 మంది విద్యార్థులకు రాష్ట్రపతి చేతుల మీదుగా బంగారు పతకాలు అందజేసి సత్కరించనున్నట్లు పేర్కొన్నారు.

విజయనగరం కేంద్రంగా 2019లో కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటై, 2020 నుంచి తరగతులు ప్రారంభమైనట్లు వివరించారు. ప్రస్తుతం విశ్వవిద్యాలయంలో ఎనిమిది పీజీ కోర్సులు, ఐదు డిగ్రీ కోర్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. స్కూల్ ఆఫ్ సైన్సెస్, స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్, స్కూల్ ఆఫ్ మేనేజ్మెంట్ ఆధ్వర్యంలో విద్యా కార్యక్రమాలు కొనసాగుతున్నాయని చెప్పారు. స్నాతకోత్సవంలో స్కూల్ ఆఫ్ సైన్సెస్ నుంచి 200 మంది, స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ నుంచి 82 మంది, స్కూల్ ఆఫ్ మేనేజ్మెంట్ నుంచి 91 మంది విద్యార్థులు పట్టాలు అందుకోనున్నట్లు వెల్లడించారు. 13 మందికి బంగారు పతకాలు.. అందులో 10 మంది విద్యార్థినులే ఈ సందర్భంగా ఛాన్సలర్, వైస్ ఛాన్సలర్ మాట్లాడుతూ విశిష్ట ప్రతిభ కనబరిచిన 13 మంది విద్యార్థులకు బంగారు పతకాలు ప్రదానం చేస్తున్నట్లు పేర్కొన్నారు. వారిలో 10 మంది విద్యార్థినులు, ముగ్గురు విద్యార్థులు ఉండటం విశేషమన్నారు. ఎంఎస్సీ కెమిస్ట్రీ విభాగం నుంచి ఐదుగురు, ఇంటిగ్రేటెడ్ ఎంఎస్సీ కెమిస్ట్రీ నుంచి ఇద్దరు, మాస్టర్ ఆఫ్ సోషల్ వర్క్ నుంచి ఇద్దరు, మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ నుంచి ఇద్దరు, ఎంఎస్సీ బయోటెక్నాలజీ నుంచి ఇద్దరు బంగారు పతకాలకు ఎంపికైనట్లు వెల్లడించారు. ఛాన్సలర్ మదన్ లాల్ మీనా మాట్లాడుతూ స్నాతకోత్సవం ప్రతి విద్యార్థి జీవితంలో ఒక ముఖ్యమైన మైలురాయి అని అన్నారు. ఉన్నత విద్యతో పాటు నైతిక విలువలు, సామాజిక బాధ్యత, నవీన ఆలోచనలను అలవరచుకున్నప్పుడే యువత సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషించగలదన్నారు. పట్టభద్రులు తమ విద్యను దేశాభివృద్ధికి, సమాజ శ్రేయస్సుకు వినియోగించాలని పిలుపునిచ్చారు. వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ టి. శ్రీనివాసన్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయం నాణ్యమైన విద్య, పరిశోధన, ఆవిష్కరణలు, నైపుణ్యాభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దేందుకు అనేక వినూత్న కార్యక్రమాలు అమలు చేస్తున్నామని తెలిపారు. స్నాతకోత్సవ కార్యక్రమానికి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, ఫౌండర్ వీసీ టి.వి. కట్టిమణి, ఇతర మంత్రులు, ప్రజాప్రతినిధులు, ప్రముఖ విద్యావేత్తలు, విశిష్ట అతిథులు హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వివరించారు. పట్టభద్రులు, వారి తల్లిదండ్రులు నిర్ణీత సమయానికి హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. విలేకరుల సమావేశంలో రిజిస్ట్రార్ జితేంద్ర మోహన్ మిశ్రా పాల్గొన్నారు.

# దర్శన క్యూలైన్ల వద్ద కొబ్బరికాయల కొట్టే వ్యవస్థ గాడి తప్పిందా?

- **అర్చకుడు లేదా పరిచారకుడిని నియమించాలని భక్తుల డిమాండ్!**





**అన్నవరం, జూన్ 29, మనం న్యూస్ :** శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో దర్శనానికి వచ్చే భక్తులకు ఆలయ సంప్రదాయాలు, ఆగమ నియమాలు పాటించేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని భక్తులు కోరుతున్నారు. ముఖ్యంగా దర్శన క్యూలైన్ల వద్ద కొబ్బరికాయలు కొట్టే విధానం ప్రస్తుతం వివాదాస్పదంగా మారిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో దర్శనానికి వెళ్లే క్యూలైన్ల వద్ద దేవస్థానం తరపున అర్చకుడు లేదా పరిచారకుడు విధులు నిర్వహిస్తూ భక్తుల కొబ్బరికాయలను కొట్టి, స్వామివారికి నివేదించిన అనంతరంకొబ్బరి ముక్కను ప్రసాదంగా అందించేవారని పలువురు గుర్తు చేస్తున్నారు. దీంతో ఆలయ సంప్రదాయం కూడా కొనసాగేదని, భక్తులకు ఆధ్యాత్మిక సంతృప్తి కలిగేదని చెబుతున్నారు. అయితే ప్రస్తుతం ఆ స్థానాల్లో దేవస్థానం తరపున అర్చకుడు లేదా పరిచారకుడు లేకపోవడంతో కాంట్రాక్టర్ నియమించిన ప్రైవేట్ వ్యక్తులే కొబ్బరికాయలు కొడుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొబ్బరికాయలోని రెండు ముక్కలను స్వాధీనం చేసుకోవడమే కాకుండా, కొందరు భక్తుల నుంచి డబ్బులు కూడా వసూలు చేస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇలాంటి వ్యవహారాలపై దేవస్థానం అధికారులు, సంబంధిత సిబ్బంది తగిన పర్యవేక్షణ చేయడం లేదనే అసంతృప్తి భక్తుల్లో కనిపిస్తోంది. ఆలయ సంప్రదాయాలకు విరుద్ధంగా ప్రైవేట్ వ్యక్తులు వ్యవహరించడం వల్ల దేవస్థానం ప్రతిష్ఠ దెబ్బతింటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. అందువల్ల దర్శన క్యూలైన్ల వద్ద దేవస్థానం ఆధ్వర్యంలో శాశ్వతంగా అర్చకుడు లేదా పరిచారకుడిని నియమించి, కొబ్బరికాయలు కొట్టే విధానాన్ని పారదర్శకంగా నిర్వహించాలని భక్తులు కోరుతున్నారు. అలాగే భక్తుల నుంచి ఎలాంటి అనధికారిక వసూళ్లు జరగకుండా పర్యవేక్షణను మరింత కట్టుదిట్టం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. వ్రత మండపాల్లో టెంకాయలపై వివాదం.. కాంట్రాక్టర్ ప్రచారంపై భక్తుల ఆగ్రహం? అన్నవరం దేవస్థానంలోని వ్రత మండపాల్లో వ్రతాలు నిర్వహించుకున్న దంపతులు పూజా విధానంలో కొట్టిన టెంకాయలను పూర్తిగా అక్కడే వదిలేయాలని వ్రత పురోహితులతో మైక్లో ప్రచారం చేయిస్తున్నారని భక్తులు ఆరోపిస్తున్నారు. ఈ ప్రచారం కొబ్బరి ముక్కల కాంట్రాక్టుదారుడి ఒత్తిడితోనే జరుగుతోందని విమర్శలు వినిపిస్తున్నాయి. దేవస్థానం నిబంధనల్లో ఇలాంటి ఆదేశాలు ఉన్నాయా లేదా అనే విషయంపై అధికారులు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందని భక్తులు కోరుతున్నారు. శాస్త్రోక్తంగా పూజలో ఉపయోగించిన టెంకాయల విషయంలో భక్తులకు సరైన అవగాహన కల్పించకుండా ఏకపక్షంగా ప్రచారం చేయడం సరికాదని పలువురు అభిప్రాయపడుతున్నారు. మరోవైపు ఈ అంశంపై క్షేత్రస్థాయిలో దేవస్థానం అధికారులు పర్యవేక్షణ చేయడం లేదని భక్తులు ఆరోపిస్తున్నారు. వ్రత మండపాల్లో ఏం జరుగుతుందో పరిశీలించి, దేవాదాయ శాఖ నిబంధనలకు అనుగుణంగా స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేయాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

# ప్రతి ఒక్కరూ విద్యార్థులకు తోడ్పాటునందించాలి




- **తెదేపా ఇంచార్జ్ పొత్తూరి రామరాజు**

**మొగల్తూరు, జూన్ 29 (మనం న్యూస్) :** ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు తగిన వసతి సౌకర్యాలతో పాటు వారికి అవసరమైన విద్యా సామగ్రిని అందజేయడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యతని నరసాపురం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ పొత్తూరి రామరాజు అన్నారు. మొగల్తూరు మండలం ముత్యాలపల్లి గెదళ్లవంపు గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సోమవారం ఆరోగ్యవర్షిని ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన నోట్ పుస్తకాలు, స్టేషనరీ సామాగ్రి, ఆట వస్తువులను పొత్తూరి రామరాజు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ విధమైన సేవ కార్యక్రమాలు విద్యార్థుల భవిష్యత్తుకు ఎంతగానో దోహదపడతాయని అన్నారు. చిన్నారులు శ్రద్ధగా చదువుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఆయన ఆకాంక్షించారు. విద్య, వైద్య, సామాజిక సంక్షేమ రంగాల్లో ఆరోగ్యవర్షిని ట్రస్ట్ అందిస్తున్న సేవలు అభినందనీయమని ఆయన కొనియాడారు. ఈ విధమైన సేవా కార్యక్రమాలకు తనవంతు సహకారం అందిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఆరోగ్య వర్షిని ట్రస్ట్ ప్రతినిధులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# టిడిపి నాయకుడి మృతికి వర్తకుల సంతాపం



**కాత్రేనికోన, జూన్ 29 మనం ప్రతినిధి :** ఇటీవల గెద్దనపల్లిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో టిడిపి నాయకుడు మోకా లోవరాజు మరణించిన సంగతి తెలిసిందే. కాత్రేనికోన గేట్ సెంటర్ వర్తక సంఘం సోమవారం లోవరాజు మృతికి సంతాపం ప్రకటించారు. దుకాణాలు మూసివేశారు. ఆయన కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. ఈ కార్యక్రమంలో వాసంశెట్టి నాగ హనుమంతరావు, గువ్వల సత్తిబాబు, వాసంశెట్టి రాజేశ్వరరావు, గువ్వాల శ్రీనివాస్, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



# అనారోగ్య బాధితునికి వాకర్స్ క్లబ్ , పాలకొల్లు 28 వేల రూపాయల ఆర్థిక సాయం

**పాలకొల్లు, జూన్ 29,మనం ప్రతినిధి:** తోటి వారి కష్టాన్ని ఏదో ఒక రూపం లో పంచుకోవడం ద్వారా సమాజం ఒక కుటుంబం గా మారుతుందని వాకర్స్ క్లబ్ పాలకొల్లు అధ్యక్షుడు తటవర్తి సుధాకరరావు అన్నారు. పాలకొల్లు శ్రీ క్షీరారామలింగేశ్వర స్వామి దేవస్థానం లో అర్చకునిగా పనిచేస్తున్న నిమ్మగడ్డ వెంకట నాగేంద్ర ప్రసాద్ కుమారుడు తీవ్ర అనారోగ్యానికి గురై బెంగళూరు లో చికిత్స కు వెళ్లాల్సిన పరిస్థితిలో డబ్బులు లేక ఇబ్బందులు పడుతున్న విషయం తెలియడం తో వాకర్స్ క్లబ్ తరపున సభ్యులు సమకూర్చిన 28 వేల రూపాయల మొత్తాన్ని ఆ కుటుంబానికి అందించిన సందర్భంగా ఆయన మాట్లాడారు.కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి షేక్ పీర్ సాహెబ్, పూర్వ గవర్నర్ ఆకి రామకృష్ణ, ఉపాధ్యక్షులు మానెం బసవరాజు, ధనాని శ్రీరామమూర్తి, కఠారి నాగేంద్ర కుమార్, జవ్వాజి కల్యాణ్, కాపా చిరంజీవి, శ్రీనివాస శాస్త్రి, చామా శ్రీనివాసరావు,గుండుబోయిన నాగేశ్వరరావు, కర్రి కిరణ్,కోట చంటియ్య తదితరులు పాల్గొన్నారు.

# అన్నవరం కొండపైకి వెళ్లే వాహనాలపై కట్టుదిట్టమైన తనిఖీలు

- **'మనం' కథనానికి స్పందన**



**అన్నవరం, జూన్ 29, మనం న్యూస్ :** కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానం కొండపైకి వెళ్లే టోల్గేట్ వద్ద వాహనాల తనిఖీలు సక్రమంగా నిర్వహించడం లేదంటూ 'మనం' పత్రికలో ప్రచురితమైన కథనానికి దేవస్థానం భద్రతా విభాగం స్పందించింది. కథనం వెలువడిన అనంతరం అధికారులు వెంటనే చర్యలు చేపట్టి, కొండపైకి వెళ్లే ప్రతి వాహనాన్ని తప్పనిసరిగా క్షుణ్ణంగా తనిఖీ చేయాలని భద్రతా సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. టోల్గేట్ వద్ద భద్రతా సిబ్బంది కార్లు, బస్సులు, వ్యాన్లు, ద్విచక్ర వాహనాలు సహా అన్ని వాహనాలను ఆపి తనిఖీలు నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా అన్యమత ప్రచార సామగ్రి, నిషేధిత వస్తువులు, అనుమానాస్పద పదార్థాలు, దేవస్థానం నిబంధనలకు విరుద్ధమైన వస్తువులు కొండపైకి తరలించకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా భద్రతా ప్రమాణాలను పాటిస్తూ తనిఖీలు నిర్వహించాలని అధికారులకు సూచించినట్లు సమాచారం. కొండపై ఆలయ పవిత్రత, భక్తుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ తనిఖీలను మరింత పటిష్ఠం చేసినట్లు అధికారులు తెలిపారు. దేవస్థానానికి వచ్చే ప్రతి వాహనంపై నిరంతర నిఘా కొనసాగుతుందని, భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఇవ్వబోమని భద్రతా విభాగం స్పష్టం చేసింది. మనం పత్రికలో ప్రచురితమైన కథనానికి స్పందించి వెంటనే చర్యలు చేపట్టడంపై భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# రైతులు రుణాలను సకాలంలో చెల్లించాలి



- **ఆగర్రు సొసైటీ అధ్యక్షుడు డేవిడ్ రాజు**

**పాలకొల్లు, జూన్ 29,మనం ప్రతినిధి:** రైతులు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు ద్వారా తీసుకున్న స్వల్ప, దీర్ఘకాలికరణాలు గడువు తేదీలోగా చెల్లిస్తే అటు రైతుకు, ఇటు సొసైటీకి ప్రయోజనాలు చేకూర్తాయని పాలకొల్లు మండలం ఆగర్రు సొసైటీ అధ్యక్షుడు మేడిది జాన్ డేవిడ్ రాజు అన్నారు. సహకార వారోత్సవాలు ఆయన ప్రారంభించి ఆ సందర్భంగా సోమవారం సొసైటీ అధ్యక్షుడు జాన్ డేవిడ్ రాజు రైతుల సహకార రచ్చబండ కార్యక్రమం నిర్వహించి రైతులతో మాట్లాడారు. రచ్చబండ వద్ద రైతులంతా కలిసి మాట్లాడుకుంటే ఏ బ్యాంకులో ఎంత రుణం లభిస్తుంది లబ్ధి ఎలా చేకూరుతుంది తదితర విషయాలు తెలుస్తాయని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఆక్వా అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ రాచమల్ల మీరయ్య, డైరెక్టర్లు పెన్మెత్స సూర్యనారాయణ రాజు, పోలినాటి నాగేశ్వరరావు, సీఈఓ కడియం కిషోర్, సిబ్బంది పాల్గొన్నారు.

# పదిమందికి సేవ చేయడంలోనే నిజమైన సంతృప్తి



- **మంత్రి నిమ్మల**
- **ఉపాధి శ్రామికుల శ్రమకు గౌరవం ... ఆటపాటలకు వేదిక**

**పాలకొల్లు, జూన్ 29,మనం ప్రతినిధి:** 'పేదల సేవే మా సేవ' కార్యక్రమంలో భాగంగా యలమంచిలి మండలం వడ్డిలంక గ్రామంలో నిర్వహించిన ఉపాధి హామీ శ్రామికుల ఆత్మీయ కలయిక వేడుక ఆనందోత్సాహాల నడుమ సాగింది. రోజంతా శ్రమించే కూలీలకు ఒకరోజు సేదతీరే అవకాశంగా మంత్రి నిమ్మల రామానాయుడు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. మహిళా శ్రామికులు ఆటలు, పాటలతో ఉత్సాహంగా పాల్గొని సందడి చేశారు. ముఖ్యంగా కుర్చీల ఆటలో మహిళల పోటీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. విజేతలకు మంత్రి నిమ్మల బహుమతులు అందజేసి అభినందించడం జరిగింది. మహిళా శ్రామికులకు చీరలు అందజేయడంతో వారిలో ఆనందం వెల్లివిరిసింది. ప్రతి శ్రామికుడిని ఆప్యాయంగా పలకరించి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు .అనంతరం అందరూ ఒకే కుటుంబ సభ్యుల్లా కలిసి సహపంక్తి భోజనాలు చేయడం కార్యక్రమానికి మరింత ఆత్మీయతను తీసుకొచ్చింది. శ్రమకు గౌరవం, సేవకు ఆప్యాయత, సంబరాలకు సాక్ష్యంగా నిలిచిన ఈ వేడుక శ్రామికులకు చిరస్మరణీయ అనుభూతిని కలిగించింది.ఈ సందర్భంగా మంత్రి నిమ్మల మాట్లాడుతూ మన సంపాదనలో కొంతైనా పదిమందికి సేవ చేయడంలో కలిగే సంతృప్తి మరెక్కడా ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో బోనం నాని,మామిడి శెట్టి పెద్దిరాజు,కడలి గోపి, పీతల శ్రీనివాస్, కే సోమేశ్వర రావు పాల్గొన్నారు.

# అవార్డులే ఆయన చిరునామా

- **నమ్మకమే ఆయన సంపద**
- **ఆక్వా పితామహుడు ఉద్దరాజు కాశీ విశ్వనాథరాజు జీవితం**
- **సేవ, సాధన, సత్కారాల స్వర్ణగాథ**





**భీమవరం జూన్ 29 మనం న్యూస్ :** క్షితిజాలను విస్తరింపజేస్తూ భవితలను తీర్చిదిద్దుతూ.హద్దులను చెరిపేస్తూ.అడుగడుగునా అవకాశాల బాటలు వేస్తూ సాగిన ఒక మహోన్నత జీవన ప్రస్థానం. అది కేవలం ఒక వ్యక్తి కథ కాదు; ఎన్నో తరాలకు దిక్సూచి, ఎందరికో స్ఫూర్తి, సమాజానికి మార్గదర్శకంగా నిలిచిన జీవగాథ. విద్యను విలువగా భావించిన విద్యాభిమాని, రైతుకు అండగా నిలిచిన దూరదృష్టి కలిగిన నాయకుడు, పారిశ్రామిక రంగంలో కొత్త ఒరవడిని సృష్టించిన కార్యశీలి, ఆక్వా రంగాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లిన దార్శనికుడు - ఆయనే ఉద్దరాజు కాశీ విశ్వనాథరాజు.కొంతమందికి అవార్డు రావడం గొప్ప. మరికొందరికి అవార్డు ఇవ్వడం ద్వారా ఆ పురస్కారానికే గౌరవం పెరుగుతుంది. ఆ రెండో కోవకు చెందిన వ్యక్తిత్వమే ఉద్దరాజు కాశీ విశ్వనాథరాజు. వేదికలు మారాయి కాలం మారింది.కానీ సత్కారాలు అందుకునే ఆయన స్థానం మాత్రం మారలేదు. శాలువా కప్పించే చేతులు మారినా, శాలువా కప్పించుకునే భుజాలు మాత్రం అవే.

# అన్నవరం దేవస్థానానికి విశిష్ట సేవలు అందించిన నలుగురు ఉద్యోగులకు ఘన వీడ్కోలు



**అన్నవరం, జూన్ 29, మనం న్యూస్ :** కాకినాడ జిల్లా అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో సుదీర్ఘకాలంగా విధులు నిర్వహించి భక్తులకు, దేవస్థానానికి విశేష సేవలు అందించిన నలుగురు ఉద్యోగులు సోమవారం పదవీ విరమణ చేశారు. తమ తమ విభాగాల్లో అంకితభావంతో, నిజాయితీతో సేవలందిస్తూ దేవస్థానం అభివృద్ధిలో కీలక పాత్ర పోషించిన వారికి అధికారులు, సహచర ఉద్యోగులు ఘనంగా వీడ్కోలు పలికారు. పదవీ విరమణ చేసిన వారిలో ఇంజనీరింగ్ విభాగం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పంచాది గుర్రాజు, ఎలక్ట్రికల్ విభాగం లైన్మన్ సుంకర సత్యనారాయణ, రికార్డు అసిస్టెంట్ వి. కుసుమ, సీనియర్ అసిస్టెంట్ బి.వి. రమణ ఉన్నారు. తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ దేవస్థానం పరిపాలనలో విశ్వసనీయ ఉద్యోగులుగా గుర్తింపు పొందారు. ఈ సందర్భంగా దేవస్థానం కార్యనిర్వహణాధికారి (ఈవో) చక్రధర్ రావు మాట్లాడుతూ, పదవీ విరమణ చేసిన ఉద్యోగులు తమ ఉద్యోగ జీవితమంతా క్రమశిక్షణ, సేవాభావం, బాధ్యతాయుతమైన విధి నిర్వహణతో దేవస్థానానికి మంచి పేరు తీసుకువచ్చారని కొనియాడారు.

# ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియ వేగంగా పూర్తి చేయాలి



**నరసాపురం, జూన్ 29 (మనం న్యూస్):** ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా ఫారాల డిజిటలైజేషన్, ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన నరసాపురం తహసీల్దార్ కార్యాలయంలో జరుగుతున్న ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను పరిశీలించి మ్యాపింగ్, డిజిటలైజేషన్ పనుల పురోగతిని బీఎల్వోలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ 2002 ఓటర్ల జాబితాతో సరిపోల్చి మ్యాపింగ్ ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలన్నారు. ఓటర్ల నమోదులో పూర్వీకుల వివరాల ఆధారంగా అవసరమైన మార్పులు, చేర్పులు చేసుకునే అవకాశముందని తెలిపారు. ఒక బీఎల్వో పరిధిలోని ఓటర్ల వివరాలు మరో బీఎల్వో పరిధికి చెందినవిగా ఉంటే వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. ప్రతి ఇంటిని సందర్శించి ఎన్రోల్మెంట్ ఫారాలు అందజేయాలని పాత ఓటర్ల జాబితాలో నమోదైన చిరునామాలో ఓటరు లేకపోతే వారి కొత్త చిరునామా వివరాలను సేకరించి నమోదు చేయాలని ఆదేశించారు. పెండింగ్లో ఉన్న ఓటర్ల మ్యాపింగ్ను త్వరగా పూర్తిచేసి అర్హత కలిగిన ఒక్క ఓటరు కూడా నమోదు కాకుండా మిగలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను పూర్తి పారదర్శకత, బాధ్యతాయుతంగా నిర్వహించి వంద శాతం పూర్తి చేయాలని బూత్ స్థాయి అధికారులు ప్రత్యేక శ్రద్ధతో పని చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఆర్డీవో దాసి రాజు, తహసీల్దార్ నాగార్జున, బీఎల్వోలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ అనుమతులు లేని కాన్వెంట్ బడులపై చర్యలు తీసుకోండి



- **శంఖవరం ఎమ్.ఈ.ఓకు మండల అంగన్వాడీ కార్యకర్తల వినతి**

**శంఖవరం జూన్ 29 మనం ప్రతినిధి:** ప్రభుత్వ అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న ప్రైవేటు కాన్వెంట్ బడులపై చట్టబద్ధమైన తగు చర్యలను తీసుకోవాలని మండల విద్యాశాఖ అధికారి సూరిశెట్టి వెంకటరమణను మండల అంగన్వాడీ కార్యకర్తలు కోరారు. కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరంలోని మండల విద్యాశాఖ కార్యాలయంలో ఆయన్ని సోమవారం కలసి ఫిర్యాదు చేశారు. మూడు నుండి నాలుగు సంవత్సరాల వయస్సు పిల్లలను అంగన్వాడీ కేంద్రాల్లోనే కొనసాగించేలా, అంగన్వాడీ కేంద్రాల్లోనే ప్రీ స్కూల్ విద్య పొందేలా తల్లి తండ్రులకు అవగాహన కల్పించాలి, నాలుగు సంవత్సరాల వయస్సు పూర్తయిన తర్వాత మాత్రమే పిల్లలను పాఠశాలల్లో చేర్చుకునేలా ప్రైవేటు విద్యా సంస్థలకు ఆదేశాలు జారీ చేయాలి, ఐదేళ్ళలోపు పిల్లలు అందరూ అంగన్వాడీ కేంద్రాల్లోని ప్రీ స్కూల్ విద్యను పొందడమే సరైనదని పాటు పేర్కొన్నారు. మండలంలో ప్రభుత్వ అనుమతులు లేని ప్రయివేటు, కాన్వెంట్ పాఠశాలలపై విచారణ జరిపి, నిర్ధారణ అయితే తగు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

# దేవస్థానం నర్సరీలో వైభవంగా ఏరువాక పున్నమి వేడుకలు

**అన్నవరం, జూన్ 29, మనం న్యూస్ :** కాకినాడ జిల్లా అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో సోమవారం ఏరువాక పున్నమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. దేవస్థానం నర్సరీలో సంప్రదాయబద్ధంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో రైతుల సంక్షేమం, సకాలంలో వర్షాలు కురిసి సమృద్ధిగా పంటలు పండాలని, రాష్ట్ర ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలు కలగాలని స్వామివారిని ప్రత్యేకంగా ప్రార్థించారు. వేద మంత్రోచ్ఛారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించి వ్యవసాయానికి సంబంధించిన సంప్రదాయ కార్యక్రమాలను చేపట్టారు.

ఏరువాక పున్నమి ప్రాముఖ్యతను వివరిస్తూ రైతులు సస్యశ్యామలమైన పంటలతో అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం అధికారులు, సిబ్బంది, రైతులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమం ఆధ్యాత్మిక వాతావరణంలో ఘనంగా ముగిసింది. కార్యక్రమంలో దేవస్థానం ఈవో చక్రధరరావు, పాలక మండలి సభ్యులు చిరంజీవి రావు దేవస్థానానికి చెందిన పలు విభాగాల అధికారులు, సిబ్బంది కూడా పాల్గొని సంప్రదాయ పూజా కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా జరిగింది.



# రోడ్డు ప్రమాద మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

- **నిరుపేదల పక్షాన మన ఊరు - మన బాధ్యత ఫౌండేషన్**



**శంఖవరం, జూన్ 29 మనం ప్రతినిధి:** నిరుపేదల పక్షాన సహాయాలు అందించడానికి యువత ముందుకు రావాలని మన ఊరు - మన బాధ్యత ఫౌండేషన్ సభ్యులు పిలుపునిచ్చారు. కాకినాడ జిల్లా శంఖవరం స్థానిక అంబేద్కర్ కాలనీలో మెరుగుల స్వరూప్ కుమార్ (హర్ష)( 18) కత్తిపూడి రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా వారి కుటుంబాలను ' మన ఊరు - మన బాధ్యత' ఫౌండేషన్ సభ్యులు పరామర్శించారు. అనంతరం మృతుడి కుటుంబనికి 25 కేజీల రైస్ బాగ్, రూ. 1000/- నగదు అందజేశారు. ఈ సందర్భంగా ' మన ఊరు - మన బాధ్యత ' ఫౌండేషన్ సభ్యులు మాట్లాడుతూ, అంబేద్కర్ కాలనీలో గల నిరుపేద కుటుంబాలకు ఆర్థిక సహాయ సహకారాలు అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ ఫౌండేషన్ ద్వారా సహకరిస్తున్న యువత కు ఫౌండేషన్ తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గునపర్తి అపురూప్, బడే డేవిడ్ రాజు, బత్తిన తాతాజీ, రాయి సురేందర్, బందిలి సుబ్బు ,బోడపాటి చక్రవర్తి,చెక్క భీమరాజు, గుద్దాటి వంశీ, తదితరులు పాల్గొన్నారు.

# దేశానికి వెన్నెముక రైతు

- **ఆరుతడి పంటలపై దృష్టి పెట్టాలి**

**సిద్దిపేట జూన్ 29 మనం ప్రతినిధి:** దేశానికి వెన్నెముకైన రైతు కు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాల అండగా ఉంటుందని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ఎల్ నినో ప్రభావం వల్ల ఈసారి వర్షాభావ పరిస్థితులు నెలకొనే పరిస్థితులు ఉన్నందున రైతులు తగిన సాగు మేలుకువలు పాటించాలని సూచించారు.

కోహెడ మండలం కూరెల్లి గ్రామంలో ఏరువాక పౌర్ణమి సందర్భంగా సోమవారం మంత్రి పొన్నం ప్రభాకర్ నాగలి పట్టి దుక్కి దున్ని విత్తనాలు చల్లారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రైతులు కష్టపడి సాగు చేస్తున్న పంటలు సమృద్ధిగా పండాలని భూమాతను కోరుకున్నట్లు చెప్పారు. దేశానికి అన్నం పెట్టే రైతన్న ఆయురారోగ్యాలతో ఉంటేనే మిగతా అన్ని వర్గాలు సంతోషంగా ఉంటాయన్నారు. ఈసారి ఎల్ నినో ప్రభావం ఉన్నందున వర్షాలు తగ్గే అవకాశాలు ఉన్నాయని ఈ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని రైతులు ఆరుతడి పంటల సాగు పై దృష్టి పెట్టాలన్నారు. అధిక దిగుబడులు వచ్చే పంటలు ఎంచుకొని మంచి దిగుబడులు సాధించాలని కోరారు. ప్రస్తుత విపత్కర పరిస్థితుల్లో రైతుకు అన్ని విధాల రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు.

## ఎద్దుల పారువేట పోటీలో గెలుపొందిన వృషభాలకు నగదు అందజేత



**మంత్రాలయం , జూన్ , 29,మనం న్యూస్ ;-** ఏరువాక పౌర్ణమి పండగ సందర్భంగా మంత్రాలయం మండల పరిధిలోని చెట్నేహళ్ళి గ్రామంలో టీడీపీ ఇన్చార్జ్ ఎన్. రాఘవేంద్ర రెడ్డి ఆదేశాలు మేరకు ఎద్దుల పారువేట పోటీలు కార్యక్రమం నిర్వహించారు. పారవేట పోటీలు గ్రామానికి చెందిన రొగన్న ఎద్దులు గెలుపొందాయి. గెలుపొందిన వృషభాలు యాజమానికి రూ. 4200 నగదు ను మంచాల సొసైటీ డైరెక్టర్ చాపల నాగేష్ అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు , గ్రామ ప్రజలు ఉన్నారు.

## తుగ్గలి మండలానికి మోడల్ స్కూల్ మంజూరు చేయాలి

**తుగ్గలి, జూన్ 29 (మనం న్యూస్):** తుగ్గలి మండలంలో విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని మోడల్ స్కూల్ ఏర్పాటు చేయాలని కోరుతూ కాంగ్రెస్ నియోజకవర్గం మాజీ ఓబీసీ చైర్మన్ అద్దంకి నాగార్జున యాదవ్ జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈవో)సుధాకర్ కు సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుగ్గలి మండలంలోని గ్రామీణ ప్రాంతాలకు చెందిన అనేక మంది విద్యార్థులు మెరుగైన విద్య కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని తెలిపారు. మండల కేంద్రంలో మోడల్ స్కూల్ ఏర్పాటు చేస్తే పేద, మధ్యతరగతి కుటుంబాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు. విద్యా అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుని తుగ్గలి మండలానికి మోడల్ స్కూల్ మంజూరు



చేయాలని ఆయన కోరారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించే దిశగా అధికారులు సానుకూలంగా స్పందించాలని విజ్ఞప్తి చేశారు.

## గోనెగండ్లలో తాగునీటి సమస్యకు పరిష్కారం

● **ఎమ్మెల్యే డా. బి.వి. జయ నాగేశ్వర రెడ్డి**

**ఎమ్మిగనూరు, జూన్ 29 మనం న్యూస్ః** నియోజకవర్గ ప్రజల సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ సుపరిపాలన లక్ష్యంగా ముందుకు సాగుతున్న ఎమ్మెల్యే డాక్టర్ బి.వి. జయ నాగేశ్వర రెడ్డి చొరవతో గోనెగండ్ల మండలంలో తాగునీటి సమస్యకు విజయవంతంగా పరిష్కారం లభించింది. గోనెగండ్ల మండలంలో తాగునీటి కొరత ఉందంటూ స్థానిక ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులు, వినతులపై ఎమ్మెల్యే వెంటనే స్పందించి సంబంధిత అధికారులను అప్రమత్తం చేశారు. నీటి లభ్యతను పెంచేందుకు గాజులదిన్నె ప్రాజెక్టు నుంచి సమ్మర్ స్టోరేజ్ ఎస్ ఎస్ ట్యాంకుకు నేరుగా నీటిని పంపింగ్ చేసేలా చర్యలు చేపట్టారు. పంపింగ్ ప్రారంభ దశలో క్లోరిన్ గ్యాస్ మోతాదు తక్కువగా ఉండటంతో కొంతమేర నీరు పూర్తిస్థాయి శుద్ధి లేకుండానే సరఫరా అయింది. ఈ విషయాన్ని స్థానిక ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగానే ఆయన వెంటనే గ్రామీణ నీటి సరఫరా ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు రంగంలోకి దిగిన ఇంజనీరింగ్ బృందం క్లోరిన్ మోతాదును పెంచి, అవసరమైన రసాయన శుద్ధి (కెమికల్ ఫిల్ట్రేషన్) చేపట్టి స్వచ్ఛమైన, సురక్షితమైన తాగునీటిని ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చింది. ప్రస్తుతం గోనెగండ్ల మండలంలో తాగునీటి సమస్య పూర్తిగా పరిష్కారమైందని ఎమ్మెల్యే డాక్టర్ బి.వి. జయ నాగేశ్వర రెడ్డి తెలిపారు.

ప్రతి ఇంటికీ సురక్షితమైన తాగునీరు సహా మౌలిక వసతులు ఎలాంటి అంతరాయం లేకుండా అందించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని



అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ మరియు గ్రామ నాయకులు పాల్గొన్నారు.

## మీ అమ్మానాన్న ఫోన్లలో శక్తి యాప్ డౌన్‌లోడ్ చేసుకోండి



**నందికొట్కూర్, పగిడ్యాల(మనం న్యూస్)ః** మీ అమ్మానాన్న మొబైల్ ఫోన్లలో శక్తి యాప్ డౌన్లోడ్ చేసుకోవాలని రసూల్ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. నంద్యాల జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు, ఆత్మకూరు డీఎస్పీ రామాంజి నాయక్ వారి ఉత్తర్వుల ఆత్మకూరు శక్తి టీం సిబంది అయిన ఏఎస్ఐ నీతమ్మ పోలీస్ కానిస్టేబుల్ రసూల్ అయిన మేము పగిడ్యాల మండలం ముచ్చుమర్రి గ్రామం నందు మూవింగ్ చేస్తూ ఆ గ్రామ నందు ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత ప్రాథమిక పాఠశాల స్కూల్ హెడ్ మాస్టర్ ఎల్ల నాయుడు, మరియు టీచింగ్ స్టాఫ్ అందరితో స్కూల్ నందు ఉన్న 8,9,10 వ తరగతి విద్యార్థి, విద్యార్థినులకు అందరికి శక్తి యాప్ గురించి శక్తి యాప్ నంబర్ 7993485111 ను తెలుపుతూ,ఏదన్నా ఆపద సమయం లో మీకు రక్షణ గా శక్తి యాప్ ఉంటుంది అని అందులోని 112 నెంబర్ కి ఫోన్ చేసి మీకు కచ్చితంగా సహాయం కావాలి అనుకున్నపుడు, మీరు ఆపదలో ఉన్నపుడు ఈ నెంబర్ ద్వారా సమాచారం ఇస్తే పోలీస్ వారు మీకు అండగా ఉంటారు అని తెలియజేయడం అయినది. ఎవరన్నా మీతో అసభ్యంగా ప్రవర్తించిన వెంటనే మీ టీచర్స్ కానీ మీ తల్లి తండ్రుల కు కానీ పోలీస్ వారికీ కానీ చెప్పాలి అని తెలియజేస్తూ ,సైబర్ క్రైమ్ జరిగినచో టోల్ ఫ్రీ నెంబర్ 1930 కి ఫోన్ చేసి మీ అకౌంట్ లో ఉన్న డబ్బులు పోయిన సమయం లో కంప్లైంట్ చేస్తే పోయిన డబ్బులు తిరిగి పొందవొచ్చన్నారు.

## విద్యార్థులను ప్రతిభను గుర్తించి విద్యకు చేయూత

**కౌతాళం జూన్ 29 మనం న్యూస్:** బదినేహాల్ గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (తెలుగు మాధ్యమం) విద్యార్థుల ప్రతిభను గుర్తించి,వారి విద్యాభివృద్ధికి ఎల్లప్పుడూ అండగా నిలుస్తున్న గ్రామస్థులు బి.లక్ష్మిరెడ్డికి మా హృదయపూర్వక కృతజ్ఞతలు. విద్యార్థుల అభ్యాసం మరింత మెరుగుపడేలా మా పాఠశాలకు ఒక స్పీకర్ను బహూకరించడంతో పాటు,తరగతి గది పైకప్పులో ఉన్న చిన్నపాటి మరమ్మతులను కూడా స్వచ్ఛందంగా చేయించి తమ విద్యాభిమానాన్ని చాటుకున్నారు. ఈ ఉదార సహకారానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాలకృష్ణ, ఉపాధ్యాం యులు కుసుమాంజలి, పరమేశ్వరి బాయి, ఉపాధ్యాయులు మౌర్య సాయి కుమార్, నాసారమ్మ, వరస్వామి మరియు పాఠశాల విద్యార్థులు తరపున బి. లక్ష్మిరెడ్డికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాము.



## తుంగభద్ర నదిలో మునిగి రెండు వృషభాలు మృతి



**మంత్రాలయం , జూన్ 29,మనం న్యూస్ ;-** తుంగభద్ర నది నీటిలో మునిగి రెండు వృషభాలు మృతి చెంది, రైతు కుటుంబంలో విషాధచాయలు నింపిన ఘటన మండల కేంద్రమైన మంత్రాలయంలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు మంత్రాలయం గ్రామానికి చెందిన కురువ సురేష్ అనే రైతు ఏరువాక పండుగ సందర్భంగా వృషభాలను రాఘుసుధా ఎదురుగా తుంగభద్ర నది తీరన పుష్కర ఘాట్ లోకి స్నానాలు కోసం ఎద్దుల బండి తో వెళ్ళాడు. అక్కడ లోతు ఎక్కువ ఉండడంతో బండితో సహ రెండు ఎద్దుల నీటి లో మునిగిపోయి. దీంతో రెండు వృషభాలు ఊపిరి ఆడక అక్కడికక్కడే మృతి చెందాయి. నీటిలో మునిగిన ఎద్దులను బయటికి తీసుకురావడానికి రైతు సురేష్ తో పాటు మరో కొంతమంది రైతులు తీవ్ర ప్రయత్నం చేశారు. నదిలో రాళ్ళ మధ్య బండి ,ఎద్దులు ఇరుక్కపోళడంతో వారి ప్రయత్నాలు ఫలించలేదు. దీంతో క్షణాల్లో వ్యవధిలో నే రెండు వృషభాలు తాన కళ్ళు ఎదుటే వృషభాలు మృతి చెందాడం రైతు కన్నీరుమున్నీరుగా వీలపించారు. అనంతరం స్థానికులు , మత్స్యకారులు నదిలో వెళ్ళి తాడు కట్టి ఎద్దుల బండిని బయటికి తీశారు. పండుగ పూట తాము ఎంతో ప్రేమగా చూసుకుంటున్న వృషభాలు మృతి చెందడంతో సురేష్ కుటుంబ సభ్యులు కన్నీరువమున్నీరు వీలపించారు. వృషభాలు మృతి చెందిన విషయం తెలుసుకున్న మాజీ సర్పంచ్ తెల్లబ్లండ భీమయ్యు , వైసీపీ నాయకులు కురువ మల్లికార్జున సంఘటన స్థలానికి చేరుకుని రైతు కుటుంబాను సభ్యులను ఓదార్చారు.

## ఘనంగా లక్ష్మమ్మ అవ్వ రథోత్సవం

**మంత్రాలయం , జూన్ 29,మనం న్యూస్ః** మంత్రాలయం మండల సుంకేశ్వరి గ్రామంలో గ్రామ దేవత లక్ష్మమ్మ అవ్వ వార్షిక రథోత్సవం భక్తిశ్రద్ధల మధ్య సోమవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం ఆలయ అర్చకులు లక్ష్మమ్మవ్వ పంచామృతాభిషేకాలకు ప్రత్యేక పూజలు చేసి మంగళహారతి ఇచ్చారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన రథంపై లక్ష్మమ్మవ్వ చిత్రపటాన్ని ఉంచి పూజలు చేసి మంగళవాయిద్యాలు, మేళతాళాల నడుమ అమ్మవారి రథాన్ని గ్రామ ఆలయం నుంచి ప్రధాన వీధుల గుండా ఊరేగించారు. అంతకు ముందు గ్రామస్తులు పిండి వంటలు, చేసి నైవేద్యాలుత యారుచేసి అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ రథోత్సవానికి వేలాదిగా తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. రథోత్సవం లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మాధవరం ఎస్ఐ విజయ్ కుమార్ తన సిబ్బందితో కలిసి పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.



## నాణ్య మైన విద్య బోధిస్తామంటూ అధిగా ఫీజులు




**దేవనకొండ,జూన్ 29,( మనం న్యూస్):** దేవనకొండ మండలంలోని తెర్నేకల్లు గ్రామంలో ఉన్న శ్రీ లక్ష్మీ ఇంగ్లీష్ మీడియం స్కూల్ యాజమాన్యం ఫీజుల పేరుతో పాటు పుస్తకాలు, బ్యాగులు, యూనిఫాంలను కూడా పాఠశాల నుంచే తప్పనిసరిగా కొనుగోలు చేయాలని తల్లిదండ్రులపై ఒత్తిడి తెస్తోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. రోజువారీ కూలి పనులు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకునే పేదలకు ఈ అదనపు ఆర్థిక భారం తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 'పనికి వెళ్తేనే పూట గడుస్తుంది. అలాంటి పరిస్థితుల్లో ఒకేసారి వేల రూపాయలు ఫీజులు, బుక్స్, యూనిఫాం, బ్యాగుల కోసం చెల్లించడం ఎలా సాధ్యం?' అని పలువురు తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. పిల్లలకు నాణ్యమైన విద్య అందించాలనే ఆశతో ప్రైవేట్ పాఠశాలలో చేర్పిస్తే, విద్య పేరుతో ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని వారు వాపోతున్నారు.

## ఘనంగా ఏరువాక పౌర్ణమి వేడుకలు

**మంత్రాలయం జూన్ ,29,మనం న్యూస్ :-** నియోజకవర్గ కేంద్రమైన మంత్రాలయంలో ఏరువాక పౌర్ణమి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుండి గ్రామ దేవతలకు ఆలయ పూజారులు ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్తులు పిండి వంటలు చేసి అమ్మవార్లకు నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.రైతులు వృషబాలను తుంగభద్ర నది లో స్నానాలు చేయించి వివిధ రకాల రంగు రంగుల ను వేసి సుందరంగా అలంకరించారు. సాయంత్రం సంత మార్కెట్ మైదానంలో టీడీపీ సీనియర్ నాయకులు పన్నగా వెంకటేష్ స్వామి , పూజారి వ్యాసరాజస్వామి ఎంపిటిసి బోయ వెంకటేష్ , టీడీపీ పట్టణ అధ్యక్షుడు వరదరాజు మాజీ సర్పంచ్ భీమయ్యు , గ్రామ పెద్దలు సమక్షంలో వృషబాలను పారువేట ఉత్సవాలను ప్రారంభించారు. ఈ పారువేట లో గ్రామానికి చెందిన తెలుగు కురువ నర్సిరెడ్డి కు చెందిన వృషబాలు గెలుపొందాయి.

పారవేటలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సిఐ దస్తగిరిబాబు అధ్వర్యంలో ఎస్ఐ మల్లికార్జున పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. అలాగే మండలంలోని మాలపల్లి, పి తాండ, సుంకేశ్వరి, చెట్నె పల్లి, వగరూరు, తిమ్మాపురం, సూగురు తదితరులు గ్రామాలలో ఏరువాక పౌర్ణమి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, వైసీపీ నాయకులు గ్రామ ప్రజలు , పోలీసు సిబ్బంది ఉన్నారు.



## పీర్ల స్వాములకు సప్లయర్ సామాగ్రి విరాళం



**తుగ్గలి, జూన్ 29 (మనం న్యూస్):** తుగ్గలి మండలంలోని శభాష్పురం గ్రామంలో మొహరం వేడుకల సందర్భంగా సేవాభావంతో సప్లయర్ సామాగ్రిని విరాళంగా అందించారు. గ్రామానికి చెందిన కీశే తలారి పై కొట్టం రామాంజనేయులు, లక్ష్మీదేవి కుమారులు టి. రంగస్వామి (టీచర్), టి. శేఖర్ మరియు కుటుంబ సభ్యులు రూ.1 లక్ష విలువైన సప్లయర్ సామాగ్రిని గ్రామానికి అందజేశారు. గ్రామంలో మొహరం వేడుకలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. గ్రామస్తులు మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా విరాళం అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. తలారి పై కొట్టం రామాంజనేయులు కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

## రైతు సంక్షేమమే లక్ష్యంగా సహకార సంఘాల సేవలు

**తుగ్గలి, జూన్ 29 (మనం న్యూస్):** తుగ్గలి మండలంలోని ఆర్ఎస్ పెండేకల్లు గ్రామంలో సోమవారం సహకార వారోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. సహకార శాఖ ఏర్పడి ఐదు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా మారెళ్ళ అశోక వ్యవసాయ ప్రాథమిక సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో వారోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా సంఘం సీఈఓ మనోహర్ నాయుడు, కార్యదర్శి మధుసూదన్ నాయుడు, డైరెక్టర్లు రాంపల్లి శ్రీనివాసులు, బొందిమడుగుల మోహన్ యాదవ్లు సహకార జెండాను ఆవిష్కరించారు. అనంతరం గ్రామ పరిసరాల్లో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సంఘ ప్రతినిధులు మాట్లాడుతూ సహకార సంఘాలు గ్రామీణ ప్రాంత రైతులకు వెన్నుదన్నుగా నిలుస్తున్నాయని అన్నారు. రైతులకు పంట రుణాలు, వ్యవసాయ అవసరాలకు



కావాల్సిన సహాయం అందిస్తూ వారి ఆర్థిక అభివృద్ధికి తోడ్పడుతున్నాయని తెలిపారు. సహకార వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. వారోత్సవాల సందర్భంగా రైతులకు ఉపయోగపడే పలు కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ సిబ్బంది, రైతులు, గ్రామ పెద్దలు, సభ్యులు పాల్గొన్నారు.

## ఉచిత సేవ చేసే..ఇమ్మానుయేలు కన్నుమూత

**దేవనకొండ జూన్ 29,( మనం న్యూస్ )** విరిగిన చేతులు, కాళ్ల ఎముకలకు సంప్రదాయ పద్ధతిలో కట్లు కట్టి అనేక మంది జీవితాల్లో నమ్మకాన్ని నింపిన ఎముకల కట్లు కట్టే నిపుణుడు యోసేపు కుమారుడు ఇమ్మానుయేలు ఆదివారం రాత్రి 9 గంటలకు కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఆరోగ్య పరిస్థితి విషమించడంతో తుదిశ్వాస విడిచారు. ఆయన మృతి వార్త తెలిసిన వెంటనే పరిసర గ్రామాల ప్రజలు, శిష్యులు, అభిమానులు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో చేరుకుని నివాళులర్పించారు. ఇమ్మానుయేలు సంప్రదాయ ఎముకల చికిత్సలో ప్రత్యేక నైపుణ్యం కలిగిన వ్యక్తిగా పేరు గాంచారు. కాళ్లు, చేతులు విరిగిన వారికి ఎక్స్రేలు, శస్త్రచికిత్సలు అందుబాటులో లేని రోజుల నుంచే తన తండ్రి యోసేపు నుంచి సంక్రమించిన విద్యను సేవాభావంతో కొనసాగించారు. ఆయన కట్టిన కట్లు వల్ల అనేక



మంది బాధితులు కోలుకున్నారని స్థానికులు ఇప్పటికీ గర్వంగా చెప్పుకుంటుంటారు. ఈ సేవా భావంతోనే దేవనకొండ మండలంతో పాటు సమీపంలోని గ్రామాలు, ఇతర మండలాలు, జిల్లాల నుంచి కూడా ప్రజలు ఆయన వద్దకు వచ్చి చికిత్స పొందేవారు. ఆయన చూపిన ఆప్యాయత, ధైర్యం, అనుభవం కారణంగా ప్రజల్లో విశేషమైన నమ్మకాన్ని సంపాదించుకున్నారు.


## నకిలీ ప్రకటనలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**తిరుపతి జిల్లా జూన్29మనం న్యూస్ :** తిరుపతి పేరును దుర్వినియోగం చేస్తూ సోషల్ మీడియా వేదిక ఫేస్బుక్లో కొందరు గుర్తుతెలియని వ్యక్తులు అసభ్యకర, తప్పుడు ప్రకటనలు ప్రచారం చేస్తూ ప్రజలను మోసగించే ప్రయత్నం చేస్తున్నట్లు పోలీసుల దృష్టికి వచ్చింది. ఇందులో ప్రచారం చేస్తున్న సమాచారం పూర్తిగా అవాస్తవం, నిరాధారం అని తిరుపతి జిల్లా పోలీస్ శాఖ స్పష్టం చేస్తోంది. జిల్లా ఎస్పీ. సుబ్బారాయుడు ఆదేశాల మేరకు తిరుపతి డీఎస్పీ భక్తలం ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగి, ఈ నకిలీ ఫేస్బుక్ ఖాతాలు, పోస్టులపై సమగ్ర విచారణ చేపట్టాయి. సంబంధిత వ్యక్తులను గుర్తించి వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకునేందుకు అవసరమైన అన్ని చర్యలు కొనసాగుతున్నాయి.ఇలాంటి నకిలీ ప్రకటనలు, ఫేక్ సోషల్ మీడియా ఖాతాలను చూసి ఎవరూ నమ్మవద్దని, వాటి ద్వారా ఎటువంటి లావాదేవీలు చేయవద్దని తిరుపతి జిల్లా పోలీసులు ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నారు. అనుమానాస్పద సోషల్ మీడియా పోస్టులు లేదా ఖాతాలు కనిపించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్ లేదా డయల్-112కు సమాచారం అందించాలని కోరుతున్నారు.సామాజిక మాధ్యమాలను దుర్వినియోగం చేసి ప్రజలను మోసగించే వ్యక్తులపై చట్టపరంగా ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్ష ఉండదని, ఇలాంటి నేరాలను అరికట్టేందుకు తిరుపతి జిల్లా పోలీస్ శాఖ నిరంతరం అప్రమత్తంగా పనిచేస్తోందని జిల్లా పోలీస్ శాఖ స్పష్టం చేసింది.

## ఘనంగా పదవి విరమణ సన్మానం

● **గుజ్జుల గౌరీశ్వరీ నాయుడు**

**నందికొట్కూరు(మనం న్యూస్):** మద్దిలేటి కి పదవి విరమణ ఘనంగా సన్మానం నిర్వహించడం జరిగింది. వ్యవసాయ శాఖ అభివృద్ధికి మద్దులేటి సేవలు చిరస్మరణీయం...ఉప వ్యవసాయ సంచాలకులు డా. ఎం.సి. మద్దులేటికి ఘన పదవీ విరమణ సన్మానం కార్యక్రమంలో పాల్గొన్న గుజ్జుల గౌరీశ్వర నాయుడు -మద్దిలేటి చేసిన సేవలను కొనియాడుతూ అభినందన ప్రసంగం సంతోషంగా సాగింది. నంద్యాల జిల్లా వ్యవసాయ శాఖలో సుదీర్ఘకాలం నిబద్ధత, నిజాయితీ, సమర్థవంతమైన పరిపాలనతో విశిష్ట సేవలు అందించిన డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్, జిల్లా వనరుల కేంద్రం (డిస్టిక్ రేసోర్స్ సెంటర్) డా. ఎం.సి. మద్దులేటి పదవీ విరమణ సందర్భంగా ఘన సన్మాన సభ సోమవారం నంద్యాలలో జిల్లా పట్టణంలో అట్టహాసంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నందికొట్కూరు, ఆత్మకూరు, నంద్యాల, ఆళ్లగడ్డ, బనగానపల్లె వ్యవసాయ సబ్-డివిజన్ లకు చెందిన వ్యవసాయ సహాయ సంచాలకులు (రెగ్యులర్), జిల్లా వ్యాప్తంగా మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతు ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులు పెద్ద సంఖ్యలో పాల్గొని డా. మద్దులేటి గారికి ఘనంగా పదవి విరమణ వీడ్కోలు పలికారు.



## విశాఖ స్టీల్ ప్లాంట్ మృతుల కుటుంబాలకు కోటి రూపాయల నష్టపరిహారం చెల్లించాలి

**తిరుపతి జూన్ 29 మనం న్యూస్:** విశాఖ ఉక్కు కర్మాగారంలో ఇటీవల జరిగిన ఘోర పారిశ్రామిక ప్రమాదంలో పలువురు కార్మికులు మృతి చెందడం అత్యంత విషాదకరమని, ఈ ఘటనకు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని సిఐటియు, ఏఐటియుసి కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం తిరుపతిలోని సిఐటియు కార్యాలయంలో సిఐటియు, ఏఐటియుసి కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఉమ్మడి సమావేశం నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా జూలై 3న అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద నిర్వహించనున్న నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయడంపై సమావేశంలో చర్చించి కార్యాచరణ రూపొందించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి టి సుబ్రహ్మణ్యం, ఏఐటియుసి నగర ప్రధాన కార్యదర్శి ఎం డి రవి, సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎస్ జయచంద్ర, ఎఐటియుసి నగర కోశాధికారి శ్రీనివాసులు, సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు జీ




బాలసుబ్రమణ్యం, సిఐటియు నగర అధ్యక్షురాలు పి బుజ్జి, ఏఐటీయూసీ నగర సహాయ కార్యదర్శి ఏపీ బాల, సిఐటియు నగర ఉపాధ్యక్షులు కే వేణుగోపాల్ మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్లో జరిగిన ప్రమాదం కేవలం ఒక దుర్ఘటన మాత్రమే కాదని, కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యం, భద్రతా ప్రమాణాల అమలులో వైఫల్యం, నిర్వహణలో లోపాలు మరియు ప్రభుత్వ రంగ పరిశ్రమలను నిర్వీర్యం చేసే విధానాల ఫలితమని తీవ్రంగా విమర్శించారు.ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన కార్మికుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.1 కోటి నష్టపరిహారం, కుటుంబంలోని ఒకరికి శాశ్వత ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు.

## తలనీలాల వేలాలలో 1854000 ఆదాయం

**బేతంచేర్ల జూన్ 29 (మనం న్యూస్)** మండల పరిధిలో ఆర్ఎస్ రంగాపురం గ్రామం సమీపంలో ఉన్న శ్రీ ఘణ మద్దిలేటి నరసింహస్వామి దేవస్థానంలో తలనీలాల వేలాలు ఆలయ ఉప కమిషనర్ రామాంజనేయులు దేవాదాయ శాఖ ఇన్స్పెక్టర్ డి. రమేష్ ఆధ్వర్యంలో వేలాలు నిర్వహించారు వేలాలలో తలనీలాల ప్రోగుచేసుకునే హక్కు ఒక్క సంవత్సరానికి 1-7-2026 నుండి 30-6-2027 వరకు తలనీలాలు వేలంకు నలుగురు డిపాజిట్ చెల్లించారు బహిరంగ సీల్ టెండర్ లో 6 టెండర్లు వచ్చినట్లు ఆలయ ఉప కమిషనర్ తెలిపారు టెండర్ పత్రాలను పరిశీలించారు వాటిలో కడప జిల్లా మైదుకూరు గ్రామానికి చెందిన సంజయ్ ఎంటర్ ప్రైజెస్ వారు 2,03,94000 లకు దక్కించుకున్నారు తలనీలాల వేలం పాట ద్వారా 18,54000 వేలంలో ఆలయానికి ఆదాయం చేకూరినట్లు ఆలయ ఉప కమిషనర్ రామాంజనేయులు తెలిపారు వేలంలో సీఐ వెంకటేశ్వరరావు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

## రాష్ట్ర ప్రభుత్వం కౌలు రైతులకు గుర్తింపు కార్డులు అందించాలి




**ఎమ్మిగనూరు జూన్ 29 మనం న్యూస్** పట్టణంలోని తహసిల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అఖిలభారత రైతు కూలీ సంఘం( ఏఐకేఎంఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. సత్యన్న మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామాలలో కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు.

కౌలు రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి షరతులు, పూచి లేకుండా బ్యాంకుల ద్వారా హెక్టారకు రెండు లక్షల రూపాయలు రుణాలు ఇవ్వాలని అన్నారు. కౌలు రైతులు పంటలు వేసుకున్న తర్వాత అతివృష్టి వల్ల , అనావృష్టి వలన కానీ నష్టపోయిన కౌలు రైతులకు ప్రభుత్వం నష్టపరిహారాన్ని కౌలు రైతుల ఖాతాల్లోకి నగదును జమ చేయాలని డిమాండ్ చేశారుఈ కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ డివిజన్ నాయకులు నరసింహులు, యూసుఫ్,బాలచంద్ర, కె.జబ్బార్ ,జయరాజు, అంజిన్నయ్య,షరీఫ్,బి.ఎన్. అంజిన్నయ్య,టి.నబి సాబ్ ఐ.ఎఫ్.టి.యు డివిజన్ కార్యదర్శి బాలరాజు,నాయకులు బాబు,ప్రవీణ్ పాల్గొన్నారు.

# భారత క్రికెట్‌కు 'బ్లాక్ సండే'..

ప్రపంచ క్రికెట్ లో అటు సంపాదనలోనైనా.. ఇటు ఆటలోనైనా టీమ్ఇండియాకు తిరుగులేదనేది కాదనలేని వాస్తవం. కానీ, ఈ ఆదివారం భారత క్రికెట్ చరిత్రలో మాయని మచ్చగా మారిపోయింది. ఇటు పురుషుల క్రికెట్ తోపాటు మహిళల విభాగంలోనూ ఘోర పరాభవం ఎదురైంది. అంతా సండేను జోష్ డే అంటారు.. కానీ మనకు మాత్రం 'బ్లాక్ డే' అయిందంటూ క్రీడాభిమానులు విమర్శిస్తున్నారు.

**అతివిశ్వాసమేనా?**

ఐర్లాండ్ అంటే మన దృష్టిలో పసికూనే. సీనియర్లు గాయాల కారణంగా దూరం కావడంతో మన కుర్రాళ్లు దంచేస్తారులే అని అంతా భావించారు. తీరా, తొలి మ్యాచ్ లోనే టీమ్ఇండియాకు ఐర్లాండ్ షాక్ ఇచ్చింది. సర్లే.. అక్కడి పిచ్, వాతావరణానికి మనోళ్లు కాస్త అలవాటు పడేందుకు సమయం కావాలి కదా.. అని భావించారు.





అసలైన పరీక్ష రెండో టీ20లో ఎదురైంది. 150+ పరుగుల లక్ష్యాన్ని సాధించడంలోనూ టీమ్ఇండియా విఫలం కావడం తీవ్ర విమర్శలు ఎదురయ్యాయి. మొదటి టీ20లో 180+ ఉంది కదా.. పిచ్ కూడా మన దగ్గర ఉన్నట్లు లేదుగా ఓడిపోయారని సర్దిచెప్పుకొన్నాం. తీరా, రెండో మ్యాచ్ లో ఒక్క పరుగు తేడాతో ఓడిపోయాం. తిలక్ వర్మతోపాటు ఆఖర్లో హర్షిత్ రాణా దూకుడుగా ఆడాడు కాబట్టి.. ఘోర ఓటమి నుంచి బయటపడ్డాం. టాప్ ఆర్డర్ పెవిలియన్ కు చేరగానే మన పరాజయం ముందే డిసైడ్ అయిపోయింది. భారత మూలాలు కలిగిన ఐర్లాండ్ పేసర్ మూంగ్రాకు వికెట్లు సమర్పించడం గమనార్హం.

ఐర్లాండ్ను తక్కువగా అంచనా వేసి బరిలోకి దిగామని మాజీలే విమర్శించారు. త్వరగా రెండు మూడు వికెట్లు తీయగానే మన బౌలర్లు రిలాక్స్ అయిపోయారు. అదే అదనుగా ఐర్లాండ్ బ్యాటర్లు దూకుడు ప్రదర్శించి మెరుగైన స్కోర్లను సాధించారు.

మొదటి టీ20లో సంజు శాంసన్, ఇషాన్ కిషన్ విఫలమైనా సరే.. మళ్లీ అవకాశం ఇచ్చారు. ఈసారి వారిద్దరితోపాటు అభిషేక్ కూడా త్వరగా డగౌట్ కు చేరాడు. అటు కొత్తగా అరంగేట్రం చేసిన సూర్యాంశ్ షెడ్జే ఏమైనా ప్రభావం చూపించాడా? అంటే అదీ లేదు. అతడి బదులు వైభవ్ సూర్యవంశీని తీసుకున్నా సరిపోయేది కదా అనే ప్రశ్నలు ఇప్పుడు మేనేజ్ మెంట్ ముందున్నాయి.

కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ ఐపీఎల్ లో బ్యాటర్ గా అదరగొట్టాడు. సారథిగానూ పంజాబ్ కింగ్స్ ను అద్భుతంగా నడిపించాడు. సూర్యకుమార్ స్థానంలో భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని శ్రేయస్ కు కెప్టెన్సీ దక్కింది. కానీ, తొలి సిరీస్ ను కోల్పోవడంతో పాపం అతడి ఫేట్ ఇలా ఉందేమిటి అంటూ ఫ్యాన్స్ కూడా బాధపడ్డారు.

కనీసం బ్యాటర్ గానైనా సమయోచిత ఇన్నింగ్స్ ఆడితే బాగుండేదని పలువురి సూచన. పంజాబ్ తరఫున చాలాసార్లు క్రీజ్ లో నిలబడి మ్యాచ్ లను గెలిపించాడు. లేకపోతే శ్రేయస్ కూ సూర్య పరిస్థితి వచ్చినా ఆశ్చర్యపోనక్కర్లేదు. ఈ ఓటముల నుంచి నేర్చుకుని ముందుకు సాగుతారా? లేదా? అనేది ప్లేయర్ల చేతుల్లోనే ఉంది.

ఐర్లాండ్ తో సిరీస్ అంటే సరేలే.. పిచ్లు మనకు తెలియదు కదా అని వదిలేద్దాం. ఇంగ్లాండ్ తో జులై 1 నుంచి ఐదు టీ20ల సిరీస్ ప్రారంభమవుతుంది. వైభవ్ కు అవకాశం ఇవ్వాలనే డిమాండ్లూ వస్తున్నాయి. ఇంగ్లాండ్ లో గతంలో ఆడిన అనుభం కొందరికి ఉంది. ఇక్కడా ఓడితే మాత్రం అటు ప్రధాన కోచ్ గంభీర్తోపాటు శ్రేయస్ పదవులపై తీవ్ర ప్రభావం పడే అవకాశం లేకపోలేదు.

**ఫేవరెట్ గా బరిలోకి దిగి..**

పైన పురుషుల టీమ్ కోల్పోయింది సిరీస్ మాత్రమే. అయితే, ఐర్లాండ్ చేతిలో కావడంతో తీవ్ర విమర్శలు ఎదుర్కొంటోంది. ఇక మహిళల జట్టు ఆదివారం టీ20 ప్రపంచ కప్ లో ఆస్ట్రేలియాతో తలపడి ఓడి సెమీస్ కు చేరే అవకాశాన్ని చేజేతులా మిస్ చేసుకుంది. టైటిల్ ఫేవరెట్లలో ఒకటైన టీమ్ఇండియా గ్రూప్ స్టేజ్ నుంచే నిష్క్రమించడం అభిమానులకు రుచించడం లేదు. పాకిస్థాన్, బంగ్లాదేశ్, నెదర్లాండ్స్ పై గెలిచి.. ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా చేతిలో ఓటమితో భారత్ మూడో స్థానానికి పడిపోయింది.

ఏ జట్టుకైనా మిడిలార్డర్ చాలా బలంగా ఉండాలి. పేపర్ పై టీమ్ఇండియా పరిస్థితి కూడా ఇలాగే ఉంది. కానీ, కెప్టెన్ హర్మన్ ప్రీత్, జెమీమా రోడ్రిగ్స్, యస్తికా భాటియాతో కూడిన బ్యాటింగ్ లైనప్ నిలకడ చూపించలేకపోయింది.

ఓపెనర్లు స్మృతి మంధాన, షఫాలీ వర్మ మంచి ఆరంభాలను ఇస్తున్నా.. వాటిని భారీ స్కోర్లుగా చేయాల్సిన బాధ్యత మిగతా బ్యాటర్లపై ఉంది. ఆఖర్లో రిచా ఘోష్ దూకుడు ఆడటం మినహా.. మిగతా వారి నుంచి సరైన ప్రదర్శన రాలేదు.

స్థాయికి తగ్గట్టు ఆడలేకపోయామని భారత కెప్టెన్ హర్మన్ ప్రీత్ చెబుతున్నా.. ఆమె సారథ్యంపై వేటు వేయాలనే డిమాండ్లూ మొదలయ్యాయి. అయితే, ఆమె నాయకత్వంలోనే వన్డే ప్రపంచ కప్ ను భారత్ నెగ్గిందనే విషయాన్ని పలువురు ప్రస్తావించారు. కానీ, టీ20 జట్టులో మార్పులు చేయాల్సిన అవసరం ఉందనేది మరికొందరి వాదన.

ఇప్పటికే 37 ఏళ్లు ఉన్న హర్మన్ ప్రీత్ కౌర్ ఆటకు గుడ్ బై చెప్పినా ఆశ్చర్యపోనక్కర్లేదు. ఇప్పుడీ ఓటమితో మరికొద్ది రోజుల్లో తన నిర్ణయాన్ని హర్మన్ ప్రకటించే అవకాశం లేకపోలేదు.



# ఐర్లాండ్‌కు భారీ షాక్

స్వదేశంలో టీమిండియాపై 2-0 తేడాతో టీ20 సిరీస్ ను సొంతం చేసుకుని 24 గంటల తిరగకముందే ఐర్లాండ్ కు భారీ షాక్ తగిలింది. ఆ జట్టు హెడ్ కోచ్ హెన్రిచ్ మలాన్ తన పదవికి రాజీనామా చేశారు. వచ్చే ఏడాది ఆరంభం వరకు తన పదవీ కాలం ఉన్నప్పటికి, వన్డే ప్రపంచకప్ దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు మలాన్ తెలిపారు. కొత్త కోచ్ కు జట్టు బాధ్యతలు అప్పగించడానికి ఇదే సరైన సమయమని అతడు పేర్కొన్నాడు.

గత రెండు వన్డే ప్రపంచకప్ లకు అర్హత సాధించలేకపోయిన ఐర్లాండ్ జట్టు, ఈసారి ఎలాగైనా వచ్చే ఏడాది జరగనున్న వన్డే ప్రపంచకప్ లో బరిలోకి దిగాలని పట్టుదలగా ఉంది. ప్రస్తుతం ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్ లో ఐర్లాండ్ 11వ స్థానంలో ఉంది.

ఆతిథ్య దేశాలైన సౌతాఫ్రికా, జింబాబ్వేలతో పాటు టాప్-8 స్థానాల్లో ఉన్న జట్లకు మాత్రమే ప్రపంచకప్ కు నేరుగా అర్హత లభిస్తుంది. మిగిలిన నాలుగు స్థానాల కోసం క్వాలిఫైయర్స్ మ్యాచ్ లు ఆడాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో కొత్త కోచ్ ఆధ్వర్యంలో జట్టును ప్రపంచకప్ కు సిద్ధం చేయాలని ఐర్లాండ్ భావిస్తోంది.

కాగా హెన్రిచ్ మలాన్ హయంలో ఐర్లాండ్ ఎన్నో అద్భుత విజయాలను అందించింది. వరుసగా మూడు టీ20 ప్రపంచకప్ లకు ఐరిష్ జట్టు క్వాలిఫై అయింది. 2022 టీ20 ప్రపంచకప్లో మెల్ బోర్న్ వేదికగా ఇంగ్లండ్ ను ఓడించి ఐర్లాండ్ సంచలనం సృష్టించింది. అంతేకాకుండా అతడి నేతృత్వంలోనే పాకిస్తాన్, వెస్టిండీస్, సౌతాఫ్రికా వంటి బలమైన జట్లను కూడా ఐర్లాండ్ మట్టికరిపించింది. ఇప్పుడు వరల్ నంబర్ వన్ టీ20 జట్టు అయిన టీమిండియాను ఓడించి సరికొత్త చరిత్ర సృష్టించింది.



# 'విశ్వనాథ్ అండ్ సన్స్'.. పాట పాడిన సూర్య

ప్రస్తుతం 'కరుప్పు' సినిమా భారీ విజయంతో ఫుల్ జోష్ లో ఉన్నారు హీరో సూర్య. అదే ఉత్సాహంతో తన కొత్త సినిమా గురించి అదిరిపోయే అప్ డేట్ ఇచ్చారు. వెంకీ అట్లూరి దర్శకత్వంలో సూర్య హీరోగా నటిస్తున్న చిత్రం 'విశ్వనాథ్ అండ్ సన్స్'. తాజాగా ఈ చిత్రానికి సంబంధించి ఓ ఆసక్తికరమైన వార్త అభిమానుల ఉత్సాహాన్ని రెట్టింపు చేస్తోంది. ఈ సినిమాలో సూర్య అభిమానులకు ఓ స్పెషల్ ట్రీట్ ఇవ్వనున్నారు. 2014లో వచ్చిన 'అంజన్' మూవీలో 'ఏక్ దో తీన్' పాట పాడిన సూర్య.. మళ్లీ ఇన్నాళ్లకు ఈ సినిమా కోసం గొంతు సవరించుకున్నారు. ఇందులో సూర్య స్వయంగా ఓ పాట పాడారు. ఇదొక పూర్తి స్థాయి హుషారైన డ్యాన్స్ నంబర్ అని తెలుస్తోంది. ఈ పాటకు జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం ఇవ్వగా.. కెన్ కరుణాస్ లిరిక్స్ అందించారు. ఈ విషయాన్ని జీవీ ప్రకాష్ ఎక్స్ వేదికగా వెల్లడించారు. సూర్య పాడిన ఈ పాట సినిమాకే హైలైట్ గా నిలవనుంది. ఇటీవల ఈ సినిమాలోని 'నేనో బటర్ఫ్లై పాటకు మంచి స్పందన వచ్చింది.

ఇక ఈ చిత్రంలో సూర్య సరసన మమితా బైజు హీరోయిన్ గా నటిస్తున్నారు. బాలీవుడ్ నటి రవీనా టాండన్, సీనియర్ నటి రాధిక శరత్ కుమార్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. భారీ అంచనాల మధ్య తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని ఆగస్టు 14న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నారు.

# పోస్టర్ తోనే మైండ్ బ్లాక్ చేసిన త్రివిక్రమ్-ఎన్టీఆర్!




మ్యాన్ ఆఫ్ మాసెస్ జూనియర్ ఎన్టీఆర్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ కాంబినేషన్ లో ఓ భారీ మైథలాజికల్ చిత్రం రానుందనే వార్త గతకొంత కాలంగా సినీ వర్గాల్లో చక్కర్లు కొడుతున్న సంగతి తెలిసిందే. అయితే, వీరి కాంబినేషన్ లో ఓ సినిమా రానుందనే విషయం మాత్రం ఖాయమనే సంకేతాలు అందాయి. ఇప్పుడు ఈ వార్తను నిజం చేస్తూ మేకర్స్ ఈ కాంబోపై అధికారిక ప్రకటన చేశారు.

ఎన్టీఆర్, త్రివిక్రమ్ కాంబినేషన్ లో మైథలాజికల్ అంశాలతో ఓ భారీ పాన్ ఇండియా సినిమాను రూపొందిస్తున్నట్లు మేకర్స్ ఓ థీమ్ పోస్టర్ ను రిలీజ్ చేశారు. ఈ పోస్టర్ కు ''శివుడి కుమారుడు, పార్వతి గర్వకారకుడు సుబ్రహ్మణ్య స్వామి'' అనే క్యాప్షన్ తో ఆయుధం ఉన్న పోస్టర్ ను రిలీజ్ చేశారు. అంతేగాక, సంస్కృతంలో ఒక శ్లోకం కూడా ఈ పోస్టర్ లో మనకు కనిపిస్తుంది.

పోస్టర్ బ్యాక్ గ్రౌండ్ లో యుద్ధం తర్వాత కనిపించే సన్నివేశం మనకు కనిపిస్తుంది. దీంతో ఈ సినిమా పూర్తి మైథాలజీ నేపథ్యంలో సాగుతుందనే టాక్ వినిపిస్తోంది. ఇక ఈ సినిమాలో ఎన్టీఆర్ లుక్స్ ఏ విధంగా ఉండబోతున్నాయా అనేది కూడా ఆసక్తికరంగా మారింది. హారికా అండ్ హాసిని క్రియేషన్స్, ఎన్టీఆర్ ఆరట్స్ బ్యానర్లపై ఎస్.రాధాకృష్ణ, నందమూరి కళ్యాణ్ రామ్ ఈ చిత్రాన్ని ప్రొడ్యూస్ చేస్తున్నారు. అనిరుధ్ రవిచందర్ ఈ సినిమాకు సంగీతాన్ని అందిస్తుండటం విశేషం.

# 'విశ్వంభర' కోసం మరోసారి సెట్స్‌లోకి చిరు.. ఎందుకంటే..?



మెగాస్టార్ చిరంజీవి హీరోగా నటిస్తున్న సోషియో ఫాంటసీ చిత్రం 'విశ్వంభర' ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ చివరి దశకు చేరుకుంది. దర్శకుడు వశిష్ట మల్లిడి డైరెక్ట్ చేస్తున్న ఈ చిత్ర షూటింగ్ ఎప్పుడో ముగిసింది. అయితే, ఈ సినిమాకు సంబంధించి ఒక ఆసక్తికరమైన వార్త ఫిలిం నగర్ సర్కిల్స్ లో చక్కర్లు కొడుతోంది.

ఈ చిత్ర కథను మరింత ఎఫెక్టివ్ గా మార్చడంతో పాటు, క్లైమాక్స్ కు మరింత బలాన్ని చేకూర్చడం కోసం చిత్ర బృందం అదనంగా ఒక సీక్వెన్స్ చిత్రీకరించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. దీని కోసం చిరంజీవి మరో నాలుగు నుండి ఐదు రోజుల పాటు కాల్ షీట్లు కేటాయించనున్నాడట. ఈ షెడ్యూల్ పూర్తయిన తర్వాత 'విశ్వంభర' షూటింగ్ అధికారికంగా ముగుస్తుంది. ప్రస్తుతం చిరంజీవి దర్శకుడు బాబీ నేతృత్వంలో రూపొందుతున్న తన నెక్స్ట్ చిత్రం షూటింగ్ లో బిజీగా ఉన్నాడు. ఆ సినిమా షెడ్యూల్ మధ్యలో దొరికే చిన్న విరామంలో ఆయన 'విశ్వంభర' మిగిలిన భాగాన్ని పూర్తి చేయనున్నాడు. ఆ తర్వాత తన పూర్తి దృష్టిని మళ్లీ బాబీ ప్రాజెక్ట్ పైనే పెట్టనున్నాడు.

ఈ సినిమాలో త్రిష హీరోయిన్ గా నటిస్తుండగా ఎం.ఎం.కీరవాణి సంగీతాన్ని సమకూరుస్తున్నాడు. మేకర్స్ ఈ చిత్రాన్ని దసరా కానుకగా విడుదల చేయాలని ప్లాన్ చేస్తున్నారట. మరి ఈ చిత్ర రిలీజ్ డేట్ను మేకర్స్ ఎప్పుడు ప్రకటిస్తారా అనేది ఆసక్తికరంగా మారింది.

# నాకు ఆ సంతృప్తి ముఖ్యం - సోనాక్షి



'దబాంగ్' మూవీతో బాలీవుడ్ లోకి హీరోయిన్ గా ఎంట్రీ ఇచ్చింది సోనాక్షి సిన్హా. మొత్తానికి మొదటి చిత్రంతోనే తన నటనతో, తన అందంతో సోనాక్షి సిన్హా మంచి ఫేమ్ నేమ్ సంపాదించుకుంది. తాజాగా జరిగిన ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. ''వందశాతం నేను ఎంచుకుంటున్న ప్రాజెక్ట్ లతో బలమైన మహిళా ప్రాధాన్య కథల వైపే నడుస్తున్నాను. కారణం.. ఒక నటిగా ఆనందాన్ని, సంతృప్తిని ఇచ్చేదే నాకు ముఖ్యం. 'సిస్టమ్' సినిమా ప్రచారంలో దర్శకురాలు అశ్వినీ అయ్యర్ తివారీ నన్ను హాలీవుడ్ దిగ్గజ నటీమణులతో పోల్చారు. వారిలా ఉండాలని నేను ప్రయత్నించకపోయినప్పటికీ.. ఎంతగానో ఆరాధించే, అభిమానించే దిగ్గజాలతో పోల్చడం మంచి అనుభూతినిచ్చిందని సోనాక్షి సిన్హా చెప్పుకొచ్చింది. ఏది ఏమైనా సోనాక్షి సిన్హా కమర్షియల్ చిత్రాలకు దూరంగా ఉంటూ అఖిరా, లుటేరా, ఫోర్స్ 2 లాంటి చిత్రాల్లో పెర్ఫార్మెన్స్ రోల్స్ తో అలరించింది. కానీ ఆ సినిమాలేవీ ఆమెకు కలిసి రాలేదు. దీంతో సోనాక్షి సిన్హా కెరీర్ కాస్త స్లో అయింది. ఈ లోపు సోనాక్షి సిన్హా, జహీర్ ఇక్బాల్ ను పెళ్లి చేసుకుంది.

## 'ఇరుముడి కట్టు.. శబరిమల ఎక్కు'.. ఫ్యాన్స్‌కి గూస్ బంప్స్!

రవితేజ కథానాయకుడిగా శివ నిర్వాణ దర్శకత్వంలో ఇరుముడి చిత్రం రూపొందుతోన్న విషయం తెలిసిందే. ఈ సినిమాలో ప్రియా భవానీ శంకర్ హీరోయిన్ గా నటిస్తోంది. భక్తి, కుటుంబ భావోద్వేగాలు, యాక్షన్ మేళవింపుగా రూపొందుతున్న ఈ చిత్రం ఆగస్టు 21న రిలీజ్ కాబోతుంది. తాజాగా ఈ సినిమా నుంచి మొదటి పాటను విడుదల చేశారు. 'ఇరుముడి కట్టు.. శబరిమల ఎక్కు..' అంటూ సాగే ఈ పాట లిరిక్స్ గూస్ బంప్స్ తెప్పిస్తున్నాయని ఫ్యాన్స్ పోస్ట్ లు పెడుతున్నారు.



అన్నట్టు, తమిళంలో ఈ చిత్రం 'ఇరుముడికట్టు' పేరుతో విడుదల కానుంది. ఇక 'కొన్ని కథలు జీవితంలో సరైన సమయంలో మనల్ని ఎంచుకుంటాయి. అలాంటి ఒక కథే ఈ ఇరుముడి. ఇందులో భాగం కావడం అదృష్టంగా భావిస్తున్నాను. కొత్త ప్రయాణంలో ఉత్సాహంగా ఉన్నా'' అని రవితేజ ఆ మధ్య చెప్పుకొచ్చారు. ఈ సినిమాను మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తోంది. ఈ సినిమాకి జీవీ ప్రకాశ్ సంగీతం అందిస్తున్నారు. ఈ చిత్రంలో బేబీ నకాస్త్ర రవితేజ కుమార్తెగా నటిస్తోంది.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises D.No.New:3-88, Old : 3-22, Chandra Theatre, Gosala, Penamaluru Mandal, Krishna District,(AP),Pin -521151,
And Published at H.No.23-3-46, 1st Floor, Katamaraju vari Veedhi, Amaravathi Road, Naidupet Guntur(District) AP-522002. EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.APTEL/2016/73939.